


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




మహిళా సాధికారతలో
మరో కీలక అడుగు

7

యూఏఈ ఆర్థిక, పర్యాటక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ, యూఏఈ ఆర్థిక అధ్యయనాలు–విధానాల విభాగం అసిస్టెంట్ అండర్ సెక్రటరీ డాక్టర్ మారియా అల్ ఖాసిమ్‌లతో సమావేశమయ్యాను. ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని బలోపేతం చేసేలా యూఏఈ ఫుడ్ క్లస్టర్‌తో భాగస్వామ్యం కుదిరింది. ఏపీలో ప్రత్యక్ష పెట్టుబడులను ప్రోత్సహించడంతోపాటు ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో వాణిజ్యం, ఎగుమతులు, పెట్టుబడులను సులభతరం చేసేందుకు యూఏఈ ఫుడ్ క్లస్టర్ కట్టుబడి ఉంది. దావోస్ చర్చల్లో కుదిరిన ఒప్పందం ఇంత వేగంగా సాకారం కావడం సంతోషదాయకం. ఈ భాగస్వామ్యంలో భాగంగా తొలి పెట్టుబడిగా దుబాయ్ కేంద్రంగా పనిచేస్తున్న ఫ్లోర్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ సంస్థ చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులో రూ.100 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ముందుకొచ్చిందని చెప్పడానికి ఆనందంగా ఉంది.

**ఎక్స్ ట్వీట్‌లో సీఎం చంద్రబాబు**

# ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్

**ఈడీబీతో యూఏఈ అవగాహనా ఒప్పందం... ఫుడ్ ప్రాసెసింగ్‌లో పెట్టుబడులకు మార్గం సుగమం**

- **వాణిజ్యం, ఎగుమతులు యూఏఈ క్లస్టర్ సహకారం**
- **తొలి పెట్టుబడిగా చిత్తూరులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్**
- **ఫ్లోర్ మాస్టర్స్ ఇంటర్నేషనల్‌తో రూ.100 కోట్ల ఒప్పందం**
- **సీఎం చంద్రబాబు, యూఏఈ మంత్రి సమక్షంలో ఎంఓయూ**

ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఎగుమతులు, వాణిజ్యం, పెట్టుబడులు పెంచేలా ఏపీ ఈడీబీ–యూఏఈ ఫుడ్ క్లస్టర్ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, యూఏఈ ఆర్థిక, పర్యాటక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ సమక్షంలో ఎంఓయూపై సంతకాలు జరిగాయి. దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో కుదిరిన ఒప్పందం ఆరు నెలల్లోనే సాకారమైంది.




2

## దేశంలోనే ఆదర్శంగా..

# మంగళగిరిని తీర్చిదిద్దుతా

- **బట్టలుపెట్టి పట్టాలిస్తానన్న ప్రధాన హామీని నెరవేర్చా**
- **ప్రజలిచ్చిన బలమే ముందుకు నడిపిస్తోంది**
- **ప్రతి హామీ నెరవేర్చే దిశగా కూటమి అడుగులు**
- **మన ఇల్లు -మన లోకేష్‌లో మంత్రి నారా లోకేష్**

మంగళగిరి ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా. ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తా. అన్నిరంగాల్లో మంగళగిరి నెం.1గా నిలబడాలి. భారతదేశంలోనే మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తయారు చేయాలన్నదే ధ్యేయమని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ ప్రకటించారు.

మన ఇల్లు –మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక సికె కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన సభలో మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన పేదలకు శాశ్వత పట్టాలు పంపిణీ చేశారు.



మంగిళగిరి సికె కన్వెన్షన్‌లో మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన పేదలకు శాశ్వత పట్టాలు పంపిణీ చేస్తున్న లోకేష్

3

## అదే చిర్నవ్వు.. అదే ఉత్సాహం



**7.30 గంటలు నిలువుకాళ్లపై నాన్ స్టాప్ 'పట్టా'భిషేకం**

4



3

## ఉత్తరాంధ్రకు.. గ్రోత్ ఇంజిన్

- **భోగాపురం విమానాశ్రయంపై ముఖ్యమంత్రి వ్యాఖ్య**
- **ఆగస్టు 1న మోదీ చేతుల మీదుగా ప్రారంభం**
- **ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్**

ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఆగస్టు 1న ప్రారంభం కానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు గ్రోత్ ఇంజన అని సీఎం చంద్రబాబు అన్నారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు తొడిగేలా అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం పూర్తి చేశామని, ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లి ప్రతి పౌరుడినీ భాగస్వామిని చేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులను, యజమానులను గౌరవిస్తూ ఒకమారు ఉచిత విమాన ప్రయాణ అవకాశం కల్పిస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు.





## నేడు ఢిల్లీకి సీఎం

- **భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ప్రధానికి ఆహ్వానం**
- **హోంమంత్రి సహా పలువురు మంత్రులను కలవనున్న చంద్రబాబు**

అమరావతి (చైతన్య రథం): సీఎం చంద్రబాబు బుధవారం ఢిల్లీకి వెళ్తారు. ప్రధాని మోదీతో పాటు పలువురు కేంద్రమంత్రులను కలవనున్నారు. భోగాపురంలో నిర్మితమైన అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం ఆగస్టు 1న ప్రారంభంకానుంది. దీన్ని ప్రధాని చేతులు మీదుగా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో సీఎం ఢిల్లీ వెళ్లి ప్రధానిని ఆహ్వానించనున్నారు. అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పియూష్ గోయల్, మనోహర్ లాల్ ఖట్టర్, సీఆర్ పాటిల్‌ను సైతం ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసే అవకాశముంది. ఢిల్లీ కార్యక్రమాలను ముగించుకుని గురువారం రాష్ట్రానికి చేరుకుంటారు.



6

## ముడి పొగాకుపై జిఎస్టీ తగ్గించండి

- **40 నుంచి 28 శాతానికి తగ్గించాలని వినతి**
- **కేంద్ర ఆర్థిక మంత్రిని కలిసిన రాష్ట్ర మంత్రులు, ఎంపీలు**

సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడి సారథ్యంలో రాష్ట్ర మంతులు, ఎంపీలు మంగళవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను పార్లమెంట్‌లో కలిశారు. ముడి పొగాకుపై ప్రస్తుతం అమలులోవున్న 40 శాతం జీఎస్టీని 28 శాతానికి తగ్గించాలని కోరుతూ.. పొగాకు రైతుల సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి, తక్షణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు.

## శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో మంత్రి అచ్చెన్న భేటీ



7

## రెండేళ్లలోనే అద్భుత ప్రగతి

- **36 ప్రాధాన్య ప్రాజెక్టుల పూర్తికి ప్రణాళిక: నిమ్మల**



8





# ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్

- ఈడీబీతో యూఏఈ అవగాహనా ఒప్పందం
- ఫుడ్ ప్రాసెసింగ్‌లో పెట్టుబడులకు మార్గం సుగమం
- వాణిజ్యం, ఎగుమతులు యూఏఈ క్లస్టర్ సహకారం
- తొలి పెట్టుబడిగా చిత్తూరులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్
- ఫ్లోర్ మాస్టర్స్ ఇంటర్నేషనల్‌తో రూ.100 కోట్ల ఒప్పందం
- సీఎం చంద్రబాబు, యూఏఈ మంత్రి సమక్షంలో ఎంఓయూ





అమరావతి (చైతన్య రథం): ఈ ఏడాది దావోస్‌లోని ప్రపంచ ఆర్థిక సదస్సులో కుదుర్చుకున్న మరో ఒప్పందం ఇవాళ సాకారమైంది. యూఏఈ ఫుడ్ క్లస్టర్ ద్వారా ఏపీలోని ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఎగుమతులు, వాణిజ్యం, పెట్టుబడులను పెట్టేలా ఏపీ ఈడీబీ-యూఏఈకి చెందిన ఫుడ్ క్లస్టర్ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. ఈమేరకు రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు, యూఏఈ ఆర్థిక, పర్యాటక విభాగం మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్ ద్వారా పెద్దఎత్తున ఉద్యాన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతులు, విదేశీ వాణిజ్యం సహా యూఏఈకి చెందిన సంస్థలు పెట్టుబడులు పెట్టేలా ఈ ఒప్పందం కుదిరింది. ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుపై ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబుతో యూఏఈ ప్రతినిధుల బృందం చర్చలు జరిపింది. ఈ ఏడాది జనవరిలో దావోస్ పర్యటనలో ఏపీలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు సంబంధించి యూఏఈ సంసిద్ధత వ్యక్తం చేసింది.

ఆహారశుద్ధి రంగంలో ఏపీలో వ్యాల్యూ చైన్ ఏర్పాటు చేయాలని యూఏఈ నిర్ణయించింది. ఇందుకోసం ఏపీ ప్రభుత్వం- యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటు చేస్తూ ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. మామిడి, అరటి, కోకోలాంటి వివిధ ఉద్యాన ఉత్పత్తులకు సంబంధించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, విలువ జోడించిన ఉత్పత్తుల ఎగుమతులు, వాణిజ్యంలాంటి అంశాల్లో ఈ ఎంఓయూ సహకరించనుంది. ఈ ఒప్పందంలో తొలి అడుగుగా యూఏఈకి చెందిన ఫ్లోర్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఏపీలోని చిత్తూరులో రూ.100 కోట్లను పెట్టుబడిగా పెట్టేందుకు ముందుకొచ్చింది. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్న ఈ సంస్థ ప్రపంచ శ్రేణి ఉత్పత్తులను తయారు చేయనుంది. దుబాయ్, యూఏఈ కేంద్రంగా పనిచేస్తున్న ఫ్లోర్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ సంస్థ దాదాపు 25 దేశాలకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. ఏపీలో ఏర్పాటు చేయనున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నుంచి కూడా అంతర్జాతీయ మార్కెట్లకు ఉత్పత్తులను ఎగుమతి చేయనుంది.

## క్వాంటం స్పీడ్‌తో అవకాశాలు అందుకోండి

దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనపరిచిన యూఏఈ ఆరు నెలల్లోగా వాటిని సాకారం చేసే దిశగా ముందుకు వచ్చిందని సీఎం చంద్రబాబు అన్నారు. యూఏఈ ఫుడ్ క్లస్టర్ ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఎగుమతులు, వాణిజ్యం, పెట్టుబడులకు ఏపీ వేదిక కావటం సంతోషదాయకమని సీఎం వ్యాఖ్యానించారు. ఉద్యాన, ఆక్వా, ఐటీరంగాల్లో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని సీఎం వెల్లడించారు. రాష్ట్రంలోని వైవిధ్యమైన వాతావరణ పరిస్థితుల కారణంగా ఏడాది పొడవునా వివిధ రకాల ఉద్యాన ఉత్పత్తులు సాగు చేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. రాష్ట్ర స్థూల ఆదాయంలో 30 శాతం మేర ఉద్యాన, వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా వస్తోందని చెప్పారు. రూ.లక్ష కోట్ల ప్రభుత్వం, ప్రైవేటు పెట్టుబడితో రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యాన హబ్‌గా మారుస్తున్నామని తెలిపారు. రిలయన్స్ సంస్థ భాగస్వామ్యంతో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్-ఐఎస్ఏను కూడా ఏర్పాటు చేయనున్నట్టు సీఎం వివరించారు. 200కు పైగా ఉద్యాన క్లస్టర్లతో అక్వా మిర్చి, పామాయిల్, కోకో, కాఫీ తదితర పంటల్లో ఏపీ ఎగుమతులు చేస్తోందని సీఎం యూఏఈ ప్రతినిధి బృందానికి వివరించారు. కృష్ణా-గోదావరి డెల్టాలో నిరంతర నీటి సరఫరా కారణంగా వ్యవసాయ ఉత్పత్తి సాధించగలుగుతున్నామని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఏపీకి ఓ విధానంగా మారిపోయిందని తెలిపారు. ప్రగతిశీల విధానాల వల్ల దేశంలోని పెట్టుబడుల్లో 25శాతం ఏపీకి వచ్చాయన్నారు. పోర్టులు, రైల్వే, రోడ్డు వ్యవస్థతో ఏపీ లాజిస్టిక్స్ కేంద్రంగా మారిందని అన్నారు. ఆగస్టు 1నుంచి ఏపీలో మరో అంతర్జాతీయ విమానాశ్రయం ఏపీలో అందుబాటులోకి వస్తోందని వివరించారు. విస్తృతమైన వనరులతో వివిధరంగాల్లో విస్తృత వ్యాపార అవకాశాలను అందించేందుకు ఏపీ సిద్ధంగా ఉందని యూఏఈ బృందానికి సీఎం తెలిపారు. క్వాంటం స్పీడ్‌తో అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. పర్యావరణ అనుకూలంగా నిర్మిస్తున్న అమరావతిని మరో నివాసంగా మార్చుకోవాలని యూఏఈ ప్రతినిధులను సీఎం కోరారు.

## ఏపీ-యూఏఈ మధ్య ఫుడ్ కారిడార్


కృష్ణా-గోదావరిలాంటి నదులున్న ఏపీలో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని యూఏఈ ఎకానమీ, టూరిజం విభాగం మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విజనరీ నేత సీఎం చంద్రబాబు నాయుడు అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. భారత్-యూఏఈ వాణిజ్య బంధంలో భాగంగా ఏపీలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా పని చేస్తున్నామని తెలిపారు. ఏపీలోని రొయ్యలు, అరటిలాంటి ఉద్యాన ఉత్పత్తులు వాణిజ్యంలో కీలకంగా ఉన్నాయన్నారు. ఏపీలో ఫుడ్ పార్క్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్, కోల్డ్ చైన్ సహా వివిధ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ 21 రోజుల్లోనే అనుమతులిస్తూ వాణిజ్యాన్ని, పరిశ్రమల్ని ప్రోత్సహించటం సంతోషదాయకమని ప్రశంసించారు. అమరావతినుంచి న్యూయార్క్ మార్కెట్ వరకూ డెయిరీ, పౌల్ట్రీ, సీఫుడ్, పప్పు దినుసులు తదితర రంగాల్లో ఎగుమతులపై దృష్టి పెడతామన్నారు. కృష్ణపట్నం, కాకినాడనుంచి యూఏఈకి షిప్పింగ్ రూట్లోనూ వాణిజ్యం మరింత పెరిగేందుకు సహకరిస్తామని యూఏఈ మంత్రి తెలిపారు. ఏపీ-యూఏఈల మధ్య బంధం మరింత వేగంగా బలోపేతం కావాలని ఆకాంక్షిస్తున్నట్టు అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ స్పష్టం చేశారు. ఈ అవగాహనా ఒప్పందం కార్యక్రమంలో యూఏఈకి ఫుడ్ క్లస్టర్ చైర్మన్ సలేహ్, యూఏఈ సహాయ కార్యదర్శి మారియా అల్ ఖాసిమ్, స్పెషల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ అనూషా అల్ మర్జూఖీ, యూఏఈ ఎంబసీ నుంచి అహ్మద్ అల్ జ్నేబీ, ఏపీ పరిశ్రమల మంత్రి టీజీ భరత్, సీఎస్ సాయిప్రసాద్, పరిశ్రమలు, ఈడీబీ, ఆర్థికశాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.





# ఉత్తరాంధ్రకు గ్రోత్ ఇంజన్

- భోగాపురం విమానాశ్రయంపై ముఖ్యమంత్రి వ్యాఖ్య
- ఆగస్టు 1న మోదీ చేతుల మీదుగా ప్రారంభం
- ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్



అమరావతి (చైతన్య రథం): భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న విమానాశ్రయం ఉత్తరాంధ్రకు గ్రోత్ ఇంజన్‌గా మారుతుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు తొడిగేలా అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం పూర్తి చేశామని, ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లి ప్రతి పౌరుడినీ భాగస్వామిని చేయాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్రకు మణిహారంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిలుస్తుందని పేర్కొన్నారు. ఆగస్టు 1న అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిస్తారని, ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు పాసింజర్ టెర్మినల్, ఏవియేషన్ యూనివర్సిటీ, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఏవియేషన్ హబ్, ఎడ్యుసిటీలను కూడా ప్రారంభించుకోబోతున్నామని ముఖ్యమంత్రి వివరించారు. అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా, చారిత్రాత్మక ఘట్టంగా నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. అల్లూరి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఏపీకి లాజిస్టిక్స్ కేంద్రంగా గ్లోబల్ కనెక్టివిటీని అందిస్తుందని, రాష్ట్ర అభివృద్ధికి ఇది గేమ్ చేంజర్‌గా నిలుస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టుతోపాటు ఏఐ డేటా సెంటర్లు, రేర్ ఎర్త్ మినరల్స్‌లాంటి ఖనిజాలు ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మారుస్తాయని అభిప్రాయపడ్డారు. ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు టేకాఫ్ అయితే ఉత్తరాంధ్రతోపాటు యావత్ రాష్ట్రానికి కీలక ప్రాజెక్టుగా మారుతుందని చెప్పారు.

ఈ ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులను, యజమానులను గౌరవిస్తూ ఒకమారు ఉచిత విమాన ప్రయాణ అవకాశం కల్పిస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. వచ్చే 9 రోజులపాటు ఉత్తరాంధ్రలోని ప్రతి ఇంటా ప్రారంభోత్సవ వేడుక స్ఫూర్తి చేరాలని, ఉత్తరాంధ్రలోని 6 జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించే బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. అరకు కాఫీ, స్థానిక సంస్కృతీ సంప్రదాయాలు, కళారూపాలను కూడా ఈ సందర్భంగా ఘనంగా ప్రదర్శించాలని, విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో భోగాపురం ఎయిర్‌పోర్టు ఎంతటి కీలకమైన పాత్ర పోషిస్తుందో ప్రజలకు వివరించి చెప్పాలని ముఖ్యమంత్రి సూచించారు. పరిశ్రమలు, టూరిజం, లాజిస్టిక్స్, ఉపాధి అవకాశాలు పెద్దఎత్తున వచ్చే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన స్పష్టం చేశారు.

## బాలా మామయ్యను ఫోన్‌లో పరామర్శించిన లోకేష్



*మంగళగిరి (చైతన్య రథం): కాకినాడలో సినిమా షూటింగ్‌లో గాయపడిన మామయ్య నందమూరి బాలకృష్ణను విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ ఫోన్‌లో పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందో అడిగి తెలుసుకున్నారు. బాలా మావయ్య త్వరగా కోలుకుని, యధావిధిగా షూటింగ్‌లో పాల్గొంటారని మంత్రి లోకేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.*

# దేశంలోనే ఆదర్శంగా మంగళగిరిని తీర్చిదిద్దుతా





- బట్టలుపెట్టి పట్టాలిస్తానన్న ప్రధాన హామీని నెరవేర్చా
- మంగళగిరి ప్రజలు ఇచ్చిన బలమే ముందుకు నడిపిస్తోంది
- ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే దిశగా కూటమి అడుగులు
- మన ఇల్లు -మన లోకేష్ కార్యక్రమంలో మంత్రి లోకేష్

మంగళగిరి (చైతన్య రథం): మంగళగిరి ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా. ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తా. అన్నిరంగాల్లో మంగళగిరి నెం.1గా నిలబడాలి. భారతదేశంలోనే మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తయారు చేయాలన్నదే ధ్యేయమని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. మన ఇల్లు –మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక సికె కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన సభలో మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన పేదలకు శాశ్వత పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... "2024 ఎన్నికల తర్వాత మంగళగిరి ప్రజలే నా నమ్మకమయ్యారు. 2019 ఎన్నికల్లో నేను స్థానిక ప్రజలను అర్థం చేసుకునేలోపు ఎన్నికలు అయిపోయాయి. ఫలితంగా 5,300 ఓట్లతో ఓడిపోయాను. రెండురోజులు బాధపడినా మీ మనసు గెలవాలని ఆనాటినుంచి నా ప్రయాణం ప్రారంభించా. ఐదేళ్లలో ఎప్పుడు ఎవరిని కలిసినా మా భూమికి శాశ్వత హక్కు కావాలని అడుగుతూ వచ్చారు. ఒకేసారి అందరి భూములను రెగ్యులరైజ్ చేయలేను. అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటానని చెప్పాను. ఈరోజు 3వేలమందికి శాశ్వత పట్టాలు అందజేస్తున్నాం. దశాబ్దాలుగా ఇక్కడి ప్రజలు ఎవరు వచ్చి తమ ఇళ్లు, స్థలాలు లాగేసుకుంటారోనని భయంతో బతికారు. ఈరోజుతో ఆ భయం పోతుంది. భూమిపై శాశ్వత హక్కును కూటమి ప్రభుత్వం కల్పిస్తుంది. సుమారు వెయ్యికోట్ల విలువైన భూమిని ఈరోజు అందిస్తున్నాం. మీ భూమిని ఇకపై కుటుంబ అవసరాలకు బ్యాంకులో పెట్టి లోన్ తీసుకోవచ్చు. ఎవరు వచ్చినా మీ భూమిని తీసుకోలేరు" అని పేర్కొన్నారు.

### మీరిచ్చిన బలమే ముందుకు నడిపిస్తోంది

"2019 ఎన్నికల తర్వాత అనేక అవమానాలు ఎదుర్కొన్నాను. కొడుకును గెలిపించుకోలేకపోయావని కొందరు మా నాన్నను అవమానించారు. ఎన్నికలకు ముందు నేను గతంలో ఓటమిపాలైన 5300 పక్కన ఒక్క సున్నా పెట్టి గెలిపించమని చెప్పా. ఎవరూ ఊహించని విధంగా రాష్ట్రంలో టాప్ –3 మెజారిటీ ఇచ్చారు. మీరిచ్చిన బలమే ఇప్పుడు నన్ను ముందుకు నడిపిస్తోంది. కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి జోడెడ్ల బండిలా సాగుతున్నాయి. మంగళగిరిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, 24గంటలు తాగునీరు, పార్కులు, శ్మశానాల అభివృద్ధివంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం. రాష్ట్రస్థాయిలో 4వేల పెన్షన్, తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నక్యాంటీన్లు వంటివి అమలు చేస్తున్నాం. ప్రజలంతా ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి. గతంలో రాష్ట్ర ఆదాయం రూపాయి అయితే ఖర్చు 1.60పైసలు ఉండేది. గత రెండేళ్లుగా అహర్నిశలు కష్టపడి పరిశ్రమలు తెచ్చి, ఆగిపోయిన పనులు ప్రారంభించాం. ఇప్పటికీ రూపాయి ఆదాయానికి ఖర్చు 1.40పైసలుగా ఉంది. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది" అని లోకేష్ వివరించారు.

### ప్రజాప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

"ఎన్నికల సమయంలో బట్టలు పెట్టి పట్టాలిస్తానన్న ప్రధాన హామీని నేడు నెరవేర్చా. ఏపీలో టిడిపి, జనసేన, బిజెపి కలసికట్టుగా పనిచేస్తున్నాయి. డిల్లీలో ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే కేంద్రం సహకారం అవసరం. ప్రధానిమంత్రి మోదీజీ అన్నివిధాలుగా సహకారం అందిస్తున్నారు. విశాఖపట్నం రైల్వే జోన్ కల నెరవేర్చారు. పోలవరం, అమరావతికి నిధులిచ్చారు. అమరావతికి చట్టబద్ధత కల్పించారు. చంద్రబాబును తప్పుడు కేసులో జైలుకు పంపినపుడు అన్నగా నిలబడతానని పవనన్న భరోసా ఇచ్చారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటా. రాష్ట్రాన్ని సరైన దారిలో పెట్టేందుకు అందరం కలిసి పనిచేస్తున్నాం. మీరిచ్చిన బాధ్యతను పద్ధతి ప్రకారం ముందుకు తీసుకెళుతున్నాం. అభివృద్ధి, సంక్షేమంతో పాటు మన పిల్లలకు ఇక్కడే ఉద్యోగాలు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నా. మంగళగిరి అభివృద్ధికి అన్నివిధాలు సహాయ, సహకారాలు అందిస్తున్న మోదీజీ, చంద్రబాబు, పవనన్నకు ధన్యవాదాలు. పట్టాల పంపిణీకి ముందుకు మూడు పార్టీల నాయకులు మీ ఇళ్లకు వచ్చారు. ఒక కప్పు కాఫీ కూడా తీసుకోలేదు. పారదర్శకంగా వాస్తవ లబ్ధిదారులకు ఈరోజు పట్టాలు పంపిణీ చేస్తున్నాం. మీ అందరి కోసం పనిచేస్తున్న ప్రజాప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి" అని మంత్రి లోకేష్ కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య, జనసేన ఇన్చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ సీనియర్ నేతలు పోతినేని శ్రీనివాసరావు, వల్లభనేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం




# 7.30 గంటల నాన్ స్టాప్ పట్టాభిషేకం


- **ఉదయం నుంచి సాయంత్రం వరకు నిలబడే ఇళ్ల పట్టాల పంపిణీ**
- **తొలిరోజు 1331మందికి శాశ్వతపట్టాలు అందించిన మంత్రి లోకేష్**
- **తండ్రికి మించిన ఓపిక తనయుడికి అంటూ ప్రజల ప్రశంసలు**

మంగళగిరి (చైతన్య రథం): నాన్ స్టాప్ పట్టాభిషేకానికి సీకే కన్వెన్షన్ సెంటర్ వేదికైంది. దాదాపు 7.30 గంటలపాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు అడుగు తీసి అడుగు మార్చకుండా నిలబడే ఉన్నారు విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్. మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని 1331మంది లబ్ధిదారులకు మన ఇల్లు -మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా మంత్రి లోకేష్ తొలిరోజు శాశ్వత పట్టాలు పంపిణీ చేశారు. ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సుమారు ఏడున్నర గంటలపాటు ప్రతి లబ్ధిదారుడిని ఆప్యాయంగా పలకరిస్తూ మంత్రి లోకేష్ పట్టాలను అందజేశారు. ప్రతి ఒక్కరికీ పట్టా పత్రంతోపాటు నూతన వస్త్రాలను బహూకరించారు. ఓపిక, పట్టుదల విషయంలో యువనేత లోకేష్ తండ్రినిమించి పోయారని నాయకులు కొనియాడారు.











# మాటిచ్చారు.. నిలబెట్టుకున్నారు

**శాశ్వత పట్టాలతో సొంతింటికి వచ్చాన భావన కలిగింది**

**నారా లోకేష్ వచ్చిన తర్వాతే మాకు గుర్తింపు వచ్చింది**

**ఇంటి పట్టాలపై గతంలో ఎవరూ పట్టించుకోలేదు**

**శాశ్వత ఇంటి పట్టాల పంపిణీపై లబ్ధిదారుల హర్షాతిరేకాలు**

మంగళగిరి (చైతన్య రథం): అధికారంలోకి వస్తే మంగళగిరి నియోజకవర్గంలో పేదలకు శాశ్వత ఇంటి పట్టాలు అందిస్తామనే హామీని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ నిలబెట్టుకున్నారని, నారా లోకేష్ వచ్చిన తర్వాతే తమకు గుర్తింపు వచ్చిందని మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో జరిగిన మన ఇల్లు–మన లోకేష్ కార్యక్రమంలో లబ్ధిదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.



## అందరికీ మేలు చేస్తున్నారు

*గత పదేళ్లుగా మేం పోలకంపాడులో నివాసం ఉంటున్నాం. శాశ్వత పట్టా అందించినందుకు చాలా సంతోషంగా ఉన్నాం. నారా లోకేష్ మాకు ఎంతో మేలు చేశారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం. నియోజకవర్గంలో అందరికీ మేలు చేస్తున్నారు. మళ్లీ ఇదే ప్రభుత్వం రావాలి. మాకు ఇంటి పట్టా అందించడంతోపాటు నూతన వస్త్రాలు బహూకరించి, భోజనాలు పెట్టారు.*

**ఎన్ హరినాథప్రసాదరావు, ప్రభావతి**
**పోలకంపాడు, తాడేపల్లి**



## మళ్లీ మళ్లీ నారా లోకేష్ రావాలి

వివాహం అయినప్పటి నుంచి తాడేపల్లిలోని 15వ వార్డులో గత 20 ఏళ్లుగా నివాసం ఉంటున్నాం. ఇంటి పట్టా ఇస్తామని గతంలో అనేకమంది చెప్పినా నెరవేర్చలేదు. ఎన్నికల సమయంలో లోకేష్ శాశ్వత ఇంటి పట్టాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారు. మంగళగిరి అభివృద్ధి చెందాలంటే లోకేష్ మళ్లీ రావాలి. రాష్ట్రంలో కూడా అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నారు. తల్లికి వందనం పథకం ఇస్తున్నారు.

**షేక్ ఆయేషా బేగం,**
**షేక్ బాజి బాబు,**
**పద్మశాలీ బజారు,**
**తాడేపల్లి**

## హామీ నిలబెట్టుకున్నారు



*గత 20 ఏళ్లుగా ఇంటి పట్టా కోసం ఎదురుచూస్తున్నాం. పేదలకు శాశ్వత ఇంటి పట్టాలు అందిస్తామని మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేష్ ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారు. మాకు చాలా సంతోషంగా ఉంది. మంగళగిరి నుంచి నారా లోకేష్ మళ్లీ మళ్లీ విజయం సాధించాలని కోరుకుంటున్నాం.*

**తురకా శివగురవమ్మ,**
**తాడేపల్లి**



## ఆయనకు రుణపడి ఉంటాం

*గత 15 ఏళ్లుగా ప్రకాష్ నగర్‌లో నివాసం ఉంటున్నాం. నారా లోకేష్ ఎన్నికల ముందు మాట ఇచ్చారు. నిలబెట్టుకున్నారు. మేం ఆయన వెంట ఉంటాం. ఆయనకు రుణపడి ఉంటాం. ఇంటికి పెద్ద కొడుకులా ఆదర్శంగా నిలిచారు.*

**మునిపల్లి బుజ్జి, సీత,**
**డ్రైవర్ కాలనీ, ప్రకాష్ నగర్**

## నారా లోకేష్ వచ్చాకే గుర్తింపు



ఈరోజు మాకు, మా కుమార్తెకు నారా లోకేష్ శాశ్వత ఇంటి పట్టా అందజేశారు. మాకు ఇప్పటివరకు గుర్తింపు లేదు. నారా లోకేష్ వచ్చిన తర్వాతే గుర్తింపు వచ్చింది. మళ్లీ తండ్రీకొడుకులు చంద్రబాబు, లోకేష్ రావాలి. ఇచ్చిన హామీలు నెరవేర్చారు. మాకు నూతన వస్త్రాలు బహూకరించి ఇళ్ల పట్టాలు అందించడం పట్ల లోకేష్‌కు ధన్యవాదాలు.

**ఫాతిమున్నీసా,**
**ప్రకాష్ నగర్**
**క్వారీ**

## ఎన్నో ఇబ్బందులు పడ్డాం



*నారా లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. గత 40 ఏళ్లుగా నులకపేటలో నివాసం ఉంటున్నాం. ఇంటి పట్టా లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. నారా లోకేష్ శాశ్వత ఇంటి పట్టా అందించడం పట్ల ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.*

***బాయిన సాయికుమారి,***
***నులకపేట***

## మంగళగిరిని అభివృద్ధి చేస్తున్నారు



మొదటి విడతలో మాకు శాశ్వత ఇంటి పట్టా రాలేదు. ఎంతో బాధపడ్డాం. మా కాలనీలో అనేకమందికి అందించారు. వారు ఎంతో ఆనందించారు. రెండో విడతలో మంత్రి నారా లోకేష్ మాకు ఇంటి పట్టా అందించడం చాలా సంతోషంగా ఉంది. ఇంటి పట్టా కోసం మేం అనేక ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. పేదవారికి ఇది చాలా ఉపయోగపడుతుంది. నారా లోకేష్ మంగళగిరిని బాగా అభివృద్ధి చేస్తున్నారు. రాష్ట్రం కూడా అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తోంది. ఈ సారి నా ఓటు నారా లోకేష్‌కే.

*షేక్ మోతి, ఉండవల్లి*

## సొంతింట్లో ఉంటున్నామనే భావన కలిగింది



*నేను తాడేపల్లిలో గత 20 ఏళ్లుగా నివాసం ఉంటున్నా. అప్పటినుంచి మాకు ఇంటి పట్టా లేదు. ఎంతోమంది వచ్చారు, వెళ్లారు. మాకు ఇంటి పట్టా లేదు, మాకు గుర్తింపు లేదు. ఇప్పుడు నారా లోకేష్ వచ్చి మాకు గుర్తింపు ఇచ్చారు. సొంతింట్లో ఉంటున్నామనే భావన ఇప్పుడు కలిగింది. గతంలో ఇల్లు నిర్మించుకున్నా, ఎవరు వచ్చి కూలగొడతారోననే భయంతో బతికాం. లోకేష్ ఇచ్చిన మాట నెరవేర్చారు. ప్రభుత్వంలో లేనప్పుడు కూడా మాట ఇచ్చారు. ఇప్పుడు ప్రభుత్వం వచ్చిన తర్వాత మాకు శాశ్వత ఇంటి పట్టా ఇవ్వడంపట్ల చాలా సంతోషంగా ఉన్నాం.*

**- షేక్ గౌసియా, తాడేపల్లి**

## మొదట్లో అనుమానం ఉండేది



గత 15 ఏళ్లుగా తాడేపల్లి సలాం సెంటర్‌లో నివాసం ఉంటున్నాం. ఎన్నో ఏళ్లుగా శాశ్వత ఇంటి పట్టా కోసం ఎదురుచూస్తున్నాం. మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేష్ వచ్చిన తర్వాత ఇంటి పట్టాలు ఇస్తారని ఎంతో ఆశగా ఎదురుచూశాం. మొదట్లో మాకు కొంత అనుమానం ఉండేది. మా ఆకాంక్షలను నారా లోకేష్ నెరవేర్చారు. మాకు నూతన వస్త్రాలు బహూకరించి ఇంటి పట్టా అందించిన లోకేష్‌కు ధన్యవాదాలు.

**చల్లా భవాని, సలాం సెంటర్, తాడేపల్లి**

## గతంలో ఎవరూ పట్టించుకోలేదు

మేం తాడేపల్లి పోలీస్ స్టేషన్ వెనుక గత 40 ఏళ్లుగా ప్రభుత్వ భూమిలో నివాసం ఉంటున్నాం. లోకేష్ శాశ్వత పట్టా అందించడంపట్ల కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. నారా లోకేష్ అందరికీ మేలు చేస్తున్నారు. వారు మూడు తరాలు సంతోషంగా ఉండాలి. గతంలో ఇళ్ల పట్టాల సమస్యను ఎవరూ పట్టించుకోలేదు. నీరు, కరెంట్ లేక ఇబ్బంది పడ్డాం. ఇప్పుడు మాకు అన్నీ సమకూర్చారు.



*తన్నీరు వెంకటేశ్వరరావు,బసవమ్మ, తాడేపల్లి*



## ఉపరాష్ట్రపతిని కలిసిన మంత్రులు రామ్మోహన్, అచ్చెన్నాయుడు

న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్‌ను కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతోపాటు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రైతుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలు, వ్యవసాయ రంగంలో తీసుకుంటున్న కీలక నిర్ణయాలు తదితర అంశాలను ఉపరాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రగతి, రైతుల అభ్యున్నతి, ప్రజా సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు సాగుతున్న తీరుపై చర్చ జరిగింది.

## ఏపీ పర్యాటకానికి అరుదైన గౌరవం




- బెస్ట్ వెడ్డింగ్ డెస్టినేషన్ స్టేట్ అవార్డ్
- ఐడబ్ల్యూటీసీ వేదికగా జైపూర్‌లో ప్రదానం
- అవార్డు అందుకున్న మంత్రి కందుల దుర్గేష్

రాజస్థాన్/అమరావతి(చైతన్యరథం): జైపూర్‌లో జరుగుతున్న ఇంటర్నేషనల్ వెడ్డింగ్ అండ్ టూరిజం కాన్ క్లేవ్(ఐడబ్ల్యూటీసీ)లో ఏపీ పర్యాటక రంగానికి మరో అరుదైన గౌరవందక్కింది.పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు ప్రత్యేకగమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలకు గాను ఏపీకి బెస్ట్ వెడ్డింగ్ డెస్టినేషన్ ఎమర్జింగ్ స్టేట్ అవార్డు పురస్కారం లభించింది. ఈ ప్రతిష్టాత్మక అవార్డును పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ సోమవారం రాత్రి జైపూర్ లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో నిర్వాహకుల చేతులమీదుగా అందుకున్నారు. ఈసందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ కేంద్ర సహకారంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలోని ఏపీ సర్కార్ పర్యాటకాభివృద్ధి కోసం చేస్తున్న కృషికి ఈ అవార్డు నిదర్శనమని హర్షం వ్యక్తం చేశారు. దేశీయ, అంతర్జాతీయ వివాహ వేడుకలకు ఏపీయే ఫేవరెట్ స్పాట్‌గా ఉండేలా చేస్తామన్నారు. అందమైన లోకేషన్లు, అద్భుతమైన ఆతిథ్యంతోపాటు రాబోయే రోజుల్లో ఏపీని డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవలే కేరళలో గ్లోబల్ ట్రావెల్ మార్కెట్ అందించిన బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్ అవార్డు, గోవాలో ఇండియన్ రూట్స్ ఎడిటర్స్ ఛాయిస్ విభాగంలో అరకుకు మోస్ట్ ఇన్‌స్టాగ్రామబుల్ ల్యాండ్ స్కేప్ అవార్డును అందుకున్నామని, ఇప్పుడు మరో అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని ఆనందం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ముడి పొగాకుపై జీఎస్టీ తగ్గించాలి

- రాష్ట్ర మంత్రులు, ఎంపీల వినతిపత్రం
- కేంద్ర ఆర్థికమంత్రి దృష్టికి సమస్యలు



న్యూఢిల్లీ: ముడి పొగాకు (సూచీ 2401)పై ప్రస్తుతం అమలులో ఉన్న 40 శాతం జీఎస్టీని 28శాతానికి తగ్గించాలని వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, సహచర మంత్రులు, ఎంపీలతో కలిసి మంగళవారం పార్లమెంటులో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఇది కేవలం ముడి పొగాకు (సూచీ 2401)కు సంబంధించిన అంశమని, తయారైన పొగాకు ఉత్పత్తులకు దీనికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. జీఎస్టీ పెంపు కారణంగా రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న FCV పొగాకు విలువపై తీవ్ర ప్రభావం పడుతున్న నేపథ్యంలో రైతులప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జీఎస్టీని 40 శాతం నుంచి 28 శాతానికి తగ్గించాలని కోరారు. ఈనిర్ణయం ద్వారా పొగాకు రైతులు, డీలర్లు, ఎగుమతిదారులకు ఉప శమనం లభించడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్లో భారత పొగాకు ఎగుమతుల పోటీతత్వం మరింత మెరుగుపడుతుందని తెలిపారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కీలక సమావేశంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసరాజు, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరి, లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు,మాగుంట శ్రీనివాసులు రెడ్డి, బస్తిపాటి నాగరాజు, బీద మస్తాన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# సేవాభావంతోనే నర్సింగ్‌లో గుర్తింపు

- రోగులకు వారి సేవలు అమోఘం
- ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం(చైతన్యరథం): సమాజంపై ప్రేమ, ప్రజల పట్ల సేవా భావం ఉన్నప్పుడు మాత్రమే నర్సింగ్ రంగంలో రాణించలమని గనులు, భూ గర్భ వనరులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీ పట్నం గ్రేస్ నర్సింగ్ కాలేజీలో 11వ బ్యాచ్ విద్యార్థులకు ధృవీకరణ పత్రాలపంపిణీలో పాల్గొన్నారు. మెరుగైన ప్రతిభ చూపిన విద్యార్థులకు అవార్డులు అందించారు. అనారోగ్యంతో ఆస్పత్రిపాలైన వారికి నర్సులు అందించే సేవలు ఎంతో అమోఘమైనవని ప్రశంసించారు. డాక్టర్లు స్టెతస్కోపుతో రోగుల పరిశీలిస్తే.. నర్సులు మానవతా దృక్పథంతో మనసుతో చూసివారికి స్వాంతన చేకూరుస్తారు. మెడికల్ రంగంలో నర్సుల సేవలు అత్యంత విలువైనవి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యరంగాలపై ప్రత్యేక శ్రద్ధ పెడుతోంది. ప్రస్తుత తరుణంలో నర్సింగ్ విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉంది.

నర్సులకు మంచి డిమాండ్ ఉంది. మచిలీపట్నంలోని గ్రేస్ నర్సింగ్ కాలేజీ ఈ సమాజానికి ఎంతో మంది నర్సులను అందించింది.ఎంతోమంది పట్టభద్రులైన నర్సులు వైద్య రంగంలో విలువైన సేవలు అందిస్తున్నారు. నర్సింగ్ పూర్తి చేసిన వారు.. సేవాభావంతో పనిచేసి మరింత మందికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో పార్టీసీనియర్ నాయకులు కొనకళ్ల జగన్నాథరావు, గొర్రెపాటి గోపీచంద్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, పల్లపాటి సుబ్రహ్మణ్యం, తలారి సోమశేఖర్, గ్రేస్ నర్సింగ్ కాలేజ్ కరస్పాండెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మూలాపేటకు విశాఖ పోర్టు కార్గో హ్యాండ్లింగ్

- దశల వారీగా మళ్లించే అంశాన్ని పరిశీలిస్తాం
- కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేలా చర్యలు
- పెట్టుబడుల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



అమరావతి(చైతన్యరథం): విశాఖపట్నాన్ని ప్రపంచ స్థాయి ఐటీ సేవలు, ఐటీ పెట్టుబడులకు కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టికి అనుగుణంగా పరిశుభ్రమైన, కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతుందని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ క్రమంలో ప్రస్తుత విశాఖపోర్ట్ అథారిటీ ద్వారా నిర్వహిస్తున్న దుమ్ము వ్యాప్తికి కారణమయ్యే బొగ్గు, ఖనిజాలు, ఇతర కాలుష్య కారకాలైన బల్క్ కార్గో హ్యాండ్లింగ్ గను సమీపంలోని మూలాపేట పోర్టుకు దశలవారీగా మళ్లించేఅంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ఈ చర్యలు మూలాపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు ఆపరేషన్లు ప్రారంభించే తొలిరోజు నుంచే కార్గో హ్యాండ్లింగ్‌లో కమర్షియల్ గా విజయవంతంగా పనిచేయడానికి తోడ్పడతాయని సంతోషంవ్యక్తం చేశారు. ఈ నిర్ణయం అమల్లోకి రావడం ద్వారా విశాఖ పోర్టుపై ప్రస్తుతం ఉన్న కార్గో హ్యాండ్లింగ్ ఒత్తిడి తగ్గడంతోపాటు,ఓడల టర్న్ అరౌండ్ టైమ్ మెరుగుపడి షిప్పింగ్ సంస్థలపై పడుతున్న అదనపు ఆర్థిక భారం కూడా తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. అదే సమయంలో విశాఖ నగరంలో వాయు కాలుష్యం తగ్గి ప్రజల జీవన నాణ్యత ప్రమాణాలు మరింత మెరుగు పడుతాయని, స్థానికంగా పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రతిపాదనలో భాగంగా,మూలాపేట పోర్టుస్పెషల్ పర్పస్ వెహికల్‌లో 49-50 శాతం ఈక్విటీ భాగస్వామ్యాన్ని కల్పించాలని విశాఖపోర్ట్ అథారిటీ ప్రతిపాదించినట్లు తెలిపారు. అలాగే నామినేషన్/ఆర్‌ఓఎఫ్‌ఆర్ విధానంలో తొలి ఫేజ్‌లో రెండు బెర్తులు, సెకండ్‌ఫేజ్‌లో రెండు బెర్తులు కేటాయించాలని కోరుతుంది.ఎస్‌పీవీకి బదిలీ చేసే ఉప్పు భూములకు న్యాయమైన విలువను నిర్ణయించాలని కూడా వీపీఏ ప్రతిపాదించినట్లు వివరించారు.

### మంత్రుల కమిటీ పరిశీలన

విశాఖ పోర్ట్ అథారిటీ సమర్పించిన ఈ ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించి భాగస్వామ్య విధివిధానాలను రూపొందించి ఆమోదయోగ్యమైన సిఫార్సులను ప్రభుత్వం ముందుంచేందుకు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, తనతోపాటు ఏర్పడిన మంత్రుల కమిటీ ఈ అంశాన్ని కూడా పరిశీలించనున్నట్లు తెలిపారు.మంత్రులబృందానికి పెట్టుబడులు, మౌలికసదుపాయాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ,ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలు పూర్తిస్థాయిలో సహకరిస్తూ అవసరమైన సాంకేతిక, పరిపాలనా అంశాలపై తుది సిఫార్సుల రూపకల్పనకు తోడ్పాటును అందించనున్నట్లు తెలిపారు.

# కేంద్రమంత్రులతో అచ్చెన్నాయుడు భేటీ

- గిట్టుబాటు ధరలు, మార్కెటింగ్‌పై చర్చ
- రాష్ట్రానికి సహకారం అందించాలని వినతి



న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధి, రైతుల సంక్షేమం, పంటలకు గిట్టుబాటు ధరలు, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు, మార్కెటింగ్ సదుపాయాల బలోపేతం, రైతుల ఆదాయాన్ని పెంచే చర్యలు, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధి తదితర కీలక అంశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు.రైతు పండించిన పంటకుసరైన ధర లభించేలా మార్కెట్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పంటల సాగులో పెరుగుతున్న పెట్టుబడి వ్యయాలు రైతులపై ఆర్థిక భారాన్ని పెంచుతున్న నేపథ్యంలో సాగు ఖర్చులు తగ్గించే విధంగా కేంద్ర ప్రభుత్వం మరింత సహకారం అందించాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు తక్షణ సహాయం అందించడంతో పాటు పంట నష్టపరిహారం, బీమా ప్రయోజనాలు సకాలంలో అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మరింత సమన్వయం అవసరమని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు కేంద్ర సహకారం అవసరమని పేర్కొన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు కల్పించేందుకు, పంటల నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు గోదాములు, శీతల గిడ్డంగులు, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించాలని కోరారు. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభించడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని తెలిపారు.

### ఉక్కు శాఖ మంత్రితో భేటీ

కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను అచ్చెన్నాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధి, రైతుల సంక్షేమం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం, రాష్ట్ర పారిశ్రామిక ప్రగతి తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు మరింత మెరుగైన మద్దతు అందించడంతోపాటు వ్యవసాయ అనుబంధరంగాల అభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చేపట్టాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచే విధంగా వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధికి ఉన్న విస్తృత అవకాశాలపైనా చర్చించారు.రాష్ట్రానికి అవసరమైన సహకారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని శ్రీనివాస వర్మ హామీ ఇచ్చారు.

## మహిళా సాధికారితలో మరో కీలక అడుగు



- మహిళా సాధికారితలో మరో కీలక అడుగు
- స్త్రీ నిధి ద్వారా పీఎంఎఫ్‌ఎంఈ పథకం అమలు
- కేంద్ర కార్యదర్శితో మంత్రి కొండపల్లి చర్చలు
- ఎస్‌హెచ్‌జీ పారిశ్రామికవేత్తలకు చేయూత
- స్త్రీ నిధి రుణాలకు వడ్డీ రాయితీకి చర్యలు
- భోగాపురం ఎయిర్‌పోర్ట్‌లో స్వయం స్టాల్‌కు విజ్ఞప్తి

న్యూఢిల్లీ:ఆంధ్రప్రదేశ్‌లో స్వయం సహాయక సంఘాల మహిళలను ఆహార ప్రాసెసింగ్ రంగంలో పారిశ్రామిక వేత్తలుగా తీర్చి దిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ కార్యదర్శి అవినాష్ ప్రకాశ్ జోషి, సంయుక్త కార్యదర్శి దేవేష్ దేవల్‌లతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్‌ఎంఈ) అమలును వేగవంతం చేయడం, మహిళా పారిశ్రామి కవేత్తలకు సాధికారత కల్పించే లక్ష్యంతో కొన్ని కీలక ప్రతిపాదనలను వారి ముందు ఉంచారు. స్త్రీ నిధి ద్వారా పథకం అమలుపై కీలక చర్చలు జరపడంతోపాటు స్త్రీనిధి రుణాలతో ఏర్పాటుచేసే పీఎంఎఫ్‌ఎంఈ యూనిట్ల సబ్సిడీ మొత్తాన్ని నేరుగా 'స్త్రీ నిధి' ఖాతాకే విడుదల చేయాలనికోరారు.అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద వాణిజ్య బ్యాంకులకు ఇస్తున్న తరహాలోనే పీఎంఎఫ్ ఎంఈ పథకంకింద స్త్రీ నిధి ద్వారా డ్వాక్రా గ్రూపు మహిళలకు అందించేరుణాలకుకూడా వడ్డీ రాయితీ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు.

### ప్రతిపాదనలపై సానుకూల స్పందన

మహిళా పారిశ్రామికవేత్తలకు శిక్షణ, మార్గదర్శకత్వం, హ్యాండ్‌హోల్డింగ్ సేవలు అందించేందుకు జిల్లా, మండల సమాఖ్యలను పీఎంఎఫ్‌ఎంఈ జిల్లా వనరుల సంస్థలుగా (డీఆర్ వోఎస్) గుర్తించాలని మంత్రి చేసిన ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించారు.అలాగే స్త్రీనిధి ఖాతాకు సబ్సిడీ విడుదల, రుణాలకు వడ్డీరాయితీ అంశాలను ప్రాధాన్యతతో పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. చర్చలు విజయవంతం కావడంపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సంతోషం వ్యక్తం చేశారు.

### స్వయం బ్రాండ్ స్టాల్ ఏర్పాటుకు విజ్ఞప్తి

ఆంధ్రప్రదేశ్‌లోని స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసే 'స్వయం'బ్రాండ్‌ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెటింగ్ కల్పించే క్రమంలో భోగాపురం ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యేక స్టాల్ కేటాయించాలని మంత్రి కొండపల్లి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి మంగళవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుని, జీఎంఆర్ విమానాశ్రయ యాజమాన్యాన్ని కలిసి విజ్ఞప్తి చేశారు.

## యువత నాశనమే జగన్‌రెడ్డి లక్ష్యం

- డీఎస్సీ అభ్యర్థుల జీవితాలతో వైసీపీ చెలగాటం
- హైకోర్టు ధర్మాసనమే మొట్టికాయలు వేసింది
- ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ధ్వజం



మంగళగిరి(చైతన్యరథం): అసత్యాలతో డీఎస్సీ అభ్యర్థుల జీవితాలతో వైసీపీ చెలగాటం ఆడుతోందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అత్యంత పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహించి 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. నియామకాలు పూర్తి చేసుకుని వేలాది మంది టీచర్లు పాఠశాలల్లో చేరి విధుల్లో నిమగ్నమై ఉంటే వారిలో భయాందోళనలు రేకెత్తించేందుకు గొడ్డలి పార్టీ కుట్రలకు తెరలేపిందని ధ్వజమెత్తారు. మెగా డీఎస్సీ నియామకాలపై ఒక్క తప్పు జరిగినట్లు నిరూపించినా బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరినా వైసీపీ పారిపోయిందన్నారు.మెగా డీఎస్సీపై సీబీఐ విచారణ కోరుతూ వైసీపీ ఎమ్మెల్సీ హైకోర్టులో వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం నిన్న విచారణకురాగా ఆధారాలు లేని తప్పుడు పిటిషన్ చూసి ధర్మాసనం తీవ్రంగా ఆగ్రహించిందని వెల్లడించారు. కోర్టు సమయం వృథా చేస్తున్నందుకు న్యాయస్థానం హెచ్చరించడంతో వైసీపీ లాయర్లు క్షమాపణలు చెప్పి పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నారని తెలిపారు. నిరుద్యోగ యువతపై పదేపదే గొడ్డలి వేటు వేస్తూ వారి ఆకాంక్షలను దెబ్బ తీయాలని చూస్తోందని మండిపడ్డారు. 'మెగా డీఎస్సీ'అనేది లోకేష్ ముద్ర అయితే, 'మెగా డ్రామా' అనేది తాడేపల్లి ప్యాలెస్ మార్కుగామారిందని ఎద్దేవాచేశారు. ఉద్యోగాలు సాధించిన యువత కళ్లల్లో నీళ్లు చూడాలని జగన్‌రెడ్డి కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### జాబ్ క్యాలెండర్‌ను అడ్డుకోవాలని ఎత్తుగడలు

కూటమి ప్రభుత్వం గ్రూప్-1తోపాటు వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తుంటే, కోర్టుల్లో లిటిగేషన్లు పెట్టి జాబ్ క్యాలెండర్‌ను అడ్డుకోవాలని వైసీపీ వేస్తున్న ఎత్తుగడలు సాగవని స్పష్టం చేశారు. నిరుద్యోగ యువత ఎవరూ వైసీపీ మాయ మాటల ట్రాప్‌లో పడవద్దని విజ్ఞప్తి చేశారు. విద్యా వ్యవస్థలో కూటమి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తెచ్చిందని, పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రతిభావంతులకు ప్రతిమండలానికి ఆరుగురి చొప్పున రూ.20,000 నగదు పురస్కారాలు అందించామన్నారు. ఈ నెల 24న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో పండుగ వాతావరణంలో'మెగా పేరెంట్ టీచర్‌మీటింగ్' నిర్వహించబోతున్నామని చెప్పారు. త్వరలోనే అర్హులైన పిల్లలందరికీ 'తల్లికి వందనం'నిధులను జమచేస్తామని, గతంలో వైసీపీ ఇచ్చిన దానికంటే అదనంగా లబ్ధి చేకూరుస్తున్నామని తెలిపారు. బడి పిల్లలకు నాణ్యమైన సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనంఅందించడంతోపాటు చరిత్రలో తొలిసారిగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా ఉచితభోజన పథకం అమలు చేస్తున్నామని వెల్లడించారు. ఉన్నత విద్యా సంస్థల్లో, బీఈడీ కళాశాలల్లో బోగస్ అడ్మిషన్లకు చెక్ పెట్టేందుకు ఎఫ్‌ఆర్‌ఎస్ డిజిటల్ హాజరు విధానాన్ని తప్పనిసరి చేశామన్నారు. రాయలసీమకు దాల్మియా సిమెంట్స్ లాంటి భారీ పరిశ్రమలు వస్తుంటే రైతులను రెచ్చగొట్టి అడ్డుకోవాలని వైసీపీ చూస్తోందని దుయ్యబట్టారు. విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించే ఆలోచనలు మాని ఇప్పటికైనా వైసీపీ నాయకులు తమ వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు.

## నార్త్ సబ్ డివిజన్ ఏఈ స్థానంలో మార్పులు

- సుబ్రహ్మణ్యాన్ని తప్పించి మరొకరికి బాధ్యతలు
- తాజాగా ఉత్తర్వులు జారీచేసిన టీటీడీ



అమరావతి(చైతన్యరథం): తిరుమల నార్త్ సబ్‌డివిజన్ ఇన్‌ఛార్జి ఏఈ బాధ్యతల నుంచి పీఎంవీ సుబ్రహ్మణ్యాన్ని టీటీడీ ఇంజనీరింగ్ విభాగం తప్పించింది.ఆయనను గతంలో ఉన్న స్థానానికి పరిమితం చేసింది. సుబ్రహ్మణ్యం స్థానంలో వేణు గోపాల్‌ను నియమించింది. ఈ మేరకు మంగళవారం టీటీడీ ఇంజనీరింగ్ విభాగం ఉత్తర్వులు జారీచేసింది. ఇటీవల పీఎంవీ సుబ్రహ్మణ్యాన్ని తిరుమల నార్త్ సబ్ డివిజన్ ఇన్‌ఛార్జి ఏఈగా బాధ్యతలు అప్పగించింది. ఆయన నియామకంపై తీవ్రఅభ్యంతరాలు వ్యక్తమయాయి. వైసీపీ ప్రభుత్వహయాంలో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్ట్‌చేశారు. ఆ సమయంలో సుబ్రహ్మణ్యం స్వీట్లు పంచిపెట్టి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ తీవ్ర ఆరోపణలు ఉన్నాయి.అలాంటి వ్యక్తికికీలకమైన ఏఈ బాధ్యతలు అప్పగించడంపై స్థానికంగా తీవ్ర దుమారం రేగింది. ఈ నేపథ్యంలో గతంలో సుబ్రహ్మణ్యానికి ఇచ్చినపోస్టింగ్ ఉత్తర్వులను టీటీడీ ఇంజనీరింగ్ విభాగం రద్దుచేసింది. ఆ బాధ్యతల నుంచి ఆయనను తప్పిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

# రెండేళ్లలో జలవనరుల్లో అద్భుత ప్రగతి

- ఇరిగేషన్‌శాఖకు రూ.24611 కోట్ల బడ్జెట్
- 36 ప్రాధాన్య ప్రాజెక్టుల పూర్తికి ప్రణాళిక
- శ్వేతపత్రం విడుదల చేసిన మంత్రి నిమ్మల

అమరావతి(చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ గడచిన రెండేళ్లలో జలవనరులకు సంబంధించి అద్భుత ప్రగతి సాధించామని ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంగళవారం సచివాలయంలో ఆయన ఇరిగేషన్ శాఖకు సంబంధించి శ్వేతపత్రం విడుదలచేశారు. ముఖ్యమైన ప్రాజెక్టులు, 2024 నాటి పరిస్థితులు, తాజా స్థితిగతులపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. జలం ఉంటేనే జనం, జలం ఉంటేనే ప్రగతి, జలం ఉంటేనే మానవ మనుగడ, జలం చెంతనే జనావా సాలు, జలం ఉంటేనే నాగరికత అనే ప్రాథమిక సూత్రాన్ని అనుసరించి ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలోని ఇరిగేషన్ శాఖకు పెద్దపీట వేశారని చెప్పారు. గడిచిన రెండేళ్లుగా ఇరిగేషన్ శాఖకు రూ.24611కోట్లు బడ్జెట్ కేటాయింపులు జరిపినట్లు స్పష్టం చేశారు. ఇందులో ఒక రాయలసీమ ప్రాజెక్టులకే రూ.12,484 కోట్లు కేటాయించినట్లు వివరించారు. అలాగే రూ.35,555 కోట్లతో 2028 డిసెంబర్ నాటికి 36 ప్రధాన ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. ఐదేళ్ల గొడ్డలి పార్టీ హయాంలో రివర్స్ పాలన కారణంగా జలవనరుల రంగం విధ్వంసానికి గురైందని తెలిపారు. రూ.18 వేల కోట్లు అప్పు పెట్టి పోయిన పరిస్థితి నుంచి గట్టేక్కడానికి రెండేళ్లు పట్టిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దేశ చరిత్రలోనే తొలిసారిగా ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకటించుకుని ఆ ప్రకారం ముందుకెళుతున్నామని చెప్పారు.

## నాడు టీడీపీ ఉండి ఉంటే పోలవరం పూర్తయ్యేది

2019లో తెలుగుదేశం ప్రభుత్వం కొనసాగి ఉంటే పోలవరం 2021 కల్లా పూర్తయ్యేదని తెలిపారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన గొడ్డలి పార్టీ రాష్ట్రానికి జీవనాడైన పోలవరం ప్రాజెక్టు డయాఫ్రమ్ వాల్ దగ్గర నుంచి రాష్ట్రంలోని మిగిలిన అన్ని ప్రాజెక్టులను ధ్వంసం చేశారని మండిపడ్డారు. పోలవరం నిర్వాసితులను కూడా గొడ్డలి పార్టీ పూర్తిగా ముంచేసిందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే మూడు దఫాలుగా వాళ్లకు నష్టపరిహారం అందజేసినట్లు చెప్పారు. ప్రాజెక్టును వచ్చే ఏడాది పుష్కరాలలోపే ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నామని వివరించారు. గత రెండేళ్లలో రూ.1050కోట్లు ఖర్చు చేసి ఈ ఏడాది ఆగస్టు 14న పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీటి సరఫరా చేయబోతున్నామని చెప్పారు.



## ఉత్తరాంధ్ర ప్రాధాన్య ప్రాజెక్టుల పూర్తికి లక్ష్యం

రానున్న రెండేళ్లలో ఉత్తరాంధ్రలోని 11 ప్రాధాన్య ప్రాజెక్టులను పూర్తి చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. కరువు ప్రాంత, ఫ్లోరైడ్ బాధిత ప్రకాశం తదితర జిల్లాల ఉద్ధరణకు ఉద్దేశించిన వెలిగొండ ప్రాజెక్టు వెలుగుల ఆర్పేసి పూర్తికాకుండానే జాతికి అంకితం చేసిన నీచ చరిత్ర జగన్‌కే దక్కుతుందన్నారు. ఐదేళ్లలో గొడ్డలి పార్టీ రూ.981 కోట్లు వెలిగొండకు వెచ్చిస్తే.. కూటమి ప్రభుత్వంలో రెండేళ్లలో రూ.1108.12కోట్లు కూటమి ప్రభుత్వం ఖర్చు చేసినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కూడా గడువు నిర్ణయించుకుని పూర్తి చేయబోతున్నామన్నారు. రాయలసీమ దశదిశ మార్చే హంద్రీనీవాకు రూ.3870 కోట్లు కేటాయించి రెండు దశల పనులు 100 రోజుల్లో పూర్తి చేసినట్లు తెలిపారు. ఇరిగేషన్ రంగానికి సంబంధించి శ్వేతపత్రం విడుదల సందర్భంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, వెలిగొండ ప్రాజెక్టు, హంద్రీనీవా సుజల స్రవంతి, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు, చింతలపూడి ఎత్తిపోతల పథకం, ఏపీఎస్డీసీకి సంబంధించి రాష్ట్రంలోని 1026 ఎత్తిపోతల పథకాలు వాటి ప్రస్తుత స్థితిగతులు, సాగునీటి సంఘాల పునర్ నియామకం, జలధార జలహారతి, డ్యాముల భద్రతా పనులు తదితర అంశాలను గణాంకాలు, వీడియో క్లిప్పింగ్‌లతో వివరణాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్, ఇరిగేషన్ సలహాదారులు వెనకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

## హోంమంత్రి వంగలపూడి అనిత



అమరావతి(చైతన్యరథం): నేరాల నియంత్రణ కోసం సీఎం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను త్వరలో ఏర్పాటు చేస్తున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. వాక్ స్వాతంత్ర్యం ప్రజా స్వామ్యంలో ప్రతి పౌరుడికి ఉన్న ప్రాథమిక హక్కు అని, ఆ స్వేచ్ఛను బాధ్యతాయుతంగా వినియోగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇటీవల సోషల్ మీడియా వేదికల విస్తరణతో కొందరు అసత్య ప్రచారాలు, అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారని.. వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మంగళవారం ఏపీ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఫ్యూచర్ రెడీ ఏపీ పోలీస్ రీ ట్రీట్ టుడేస్ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనిత పాల్గొని మాట్లాడారు. రెండురోజుల పాటు ఈ వర్క్‌షాప్ జరుగు తుందని వివరించారు. బుధవారం జరిగే కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరవుతారని తెలిపారు. మీ సలహాలు, సూచనలు సీఎంకు ఇవ్వాలని సూచించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. వివిధ విభాగాలు అన్ని ఒకేచోట చేర్చామని వెల్లడించారు. ఈరోజు జరుగు తున్న రీట్రీట్ ఫ్యూచర్ రెడీ కార్యక్రమం చాలా ముఖ్యమైనదని చెప్పుకొచ్చారు. మహిళల మీద జరుగుతున్న దాడులపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. గంజాయిని అరికట్టడం కోసం ఈగల్ ప్రత్యేక వ్యవస్థను తీసుకువచ్చామని ప్రస్తావించారు. పోలీసుల సహకారంతో గంజాయి సాగును అరిక ట్టామని వెల్లడించారు. సైబర్ క్రైమ్స్‌ను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. నేరాల నియంత్రణ కోసం సీఎం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను త్వరలోనే ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు.

# ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్తకు సహకరించండి

- కొప్పర్తిలో ఎంఎస్‌ఎంఈ సెంటర్ ఏర్పాటు చేయండి
- పీఎంఈజీపీ నిధులు పెంచి ప్రోత్సాహం అందించాలి
- ఎస్‌కే యూనివర్సిటీ, విజయనగరం జేఎన్‌టీయూ ఎక్స్‌టెన్షన్ సెంటర్ల పనులు వేగవంతం చేయాలి
- కేంద్రమంత్రులకు కొండపల్లి శ్రీనివాస్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ: ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఒక కుటుంబం – ఒక పారిశ్రామికవేత్త లక్ష్యానికి అనుగుణంగా ఏపీ ప్రభుత్వానికి కేంద్రం నుంచి సహకారం అందించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. రెండురోజుల న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మంగళవారం రాత్రి కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రి జితన్ రామ్ మాంఝీ, ఆ శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజేతో 28 అక్బర్ రోడ్‌లోని రామ్‌జీ స్వగృహంలో సమావేశమయ్యారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్‌లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను 100 శాతానికి మించి 170శాతం వరకు సాధించిన నేపథ్యంలో 2026–27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో కేటాయింపులు మరింతగా పెంచి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

కడప జిల్లాలోని కొప్పర్తిలో ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్‌కే యూనివర్సిటీ, విజయనగరం జేఎన్‌టీయూలో ఎంఎస్‌ఎంఈ ఎక్స్‌టెన్షన్ సెంటర్ల ఏర్పాటు కార్యాచరణను వేగవంతం చేయాలని కోరగా అందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెప్టెంబర్ 11–13వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించే ఎంఎస్ ఎంఈ ఎక్స్‌పో కార్యక్రమానికి వారిని సాదరంగా ఆహ్వానించారు.

# 255 ప్రత్యేక కొవిడ్ పడకలు సిద్ధం

- ప్రభుత్వాసుపత్రుల్లో ముందస్తు ఏర్పాట్లు
- వైద్యఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్

అమరావతి(చైతన్యరథం): కొవిడ్‌పై ఏపీ సర్కార్ అప్రమత్తంగా ఉందని.. ప్రభుత్వాసుపత్రుల్లో ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. రాష్ట్రంలో కోవిడ్ పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సమాయత్తమైందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్స, పరీక్షలకు అవసర మైన అన్ని ఏర్పాట్లను ముమ్మరం చేశామని వెల్లడించారు. కొవిడ్‌పై ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, అయితే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్వల్ప లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వాసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని, అనుమానితులకు వెంటనే పరీక్షలు చేసేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 17 ఆసుపత్రుల్లో 255 ప్రత్యేక కొవిడ్ పడకలను సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.



లక్షల సంఖ్యలో మాస్కులు, ఎన్–95 మాస్కులు, పీపీఈ కిట్లు, చికిత్సకు అవసరమైన మందుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. టెస్టింగ్ కిట్లు, రెమిడిసివిర్‌ను స్థానికంగానే కొనుగోలు చేసేందుకు అనుమతి ఇవ్వడంతోపాటు అత్యవసర కొనుగోళ్లకు ఆసుపత్రుల సూపరింటెండెంట్లకు అధికారాలు కల్పించినట్లు తెలిపారు.

ఏపీఎంఎస్ ఐడీసీ ద్వారా ఆర్టీపీసీఆర్, ఆర్‌ఎన్‌ఏ కిట్ల సరఫరా కొనసాగుతుండగా, ప్రతి ఆసుపత్రికీ 50 రెమిడిసివిర్ ఇంజెక్షన్లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టామని, మరో ఒకటి, రెండురోజుల్లో మిగిలిన కొవిడ్ సామగ్రి కూడా ఆసుపత్రులకు చేరుతుందని వెల్లడించారు.

చైతన్యరథం

# వల్లభనేని అనుచరుడి భూ ఆక్రమణ

- వైసీపీ నేతల కబ్జా..అక్రమ నిర్మాణాలు
- వాలంటీర్, సర్వేయర్ కుమ్మక్కై రీసర్వే పేరుతో 45 సెంట్ల పట్టా భూమి ఆక్రమణ
- కోర్టు వేలం భూమి కబ్జాకు యత్నం
- న్యాయం చేయాలని ప్రజావినతుల్లో బాధితుల వినతి
- అర్జీలు స్వీకరించిన మంత్రి అనగాని, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి



మంగళగిరి(చైతన్యరథం): కృష్ణా జిల్లా కంకిపాడు మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన సిరివెళ్ళ చిట్టిబాబు టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించనని ప్రజావినతుల కార్యక్రమంలో భూమి ఆక్రమణపై వినతిపత్రం అందజేశారు. బాపులపాడు మండలం బండారుగూడెం గ్రామానికి చెందిన పావులూరి సుబ్బారావుకి 1980లో ప్రభుత్వం బండారుగూడెం రీ-సర్వే నంబర్ 39-1లో 0.59సెంట్ల వ్యవసాయ భూమిని మంజూరుచేసింది. 2022లో పొలానికి పడమర సరిహద్దుదారుగా ఉన్న తేలప్రోలు గ్రామానికి చెందిన వింతా శంకరరెడ్డి అనే వ్యక్తి భూ యజమాని అనుమతి లేకుండా దౌర్జన్యంగా ఆ పొలంలో రోడ్డు వేశారు. భూమిని ఆక్రమించి పక్కనే ఉన్న గుంటక శ్వాసబిందు పొలంలో కలిపివేశారు. శంకరరెడ్డి అప్పటి గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ముఖ్య అనుచరుడు కావడంతో ఏవిధమైన సమాధానంచెప్పకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని మంత్రి అనగాని సత్యప్రసాద్, ఏపీ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డికు వినతిపత్రం ఇచ్చారు.

## వైసీపీ నాయకుల భూ కబ్జా

విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన దన్నాన రామచంద్రుడు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ సర్వే నెం. 219లో ఆవగూడెం సమీపంలో ఉన్న బాగువలస రెవెన్యూ సర్వే నంబర్ 219లో దాదాపు 167.40 ఎకరాల ప్రభుత్వ కొండ పోరంబోకు భూమి ఉంది. మాంగనీస్ కంపెనీకి సమీపంలో ఉండటంతో ఈ భూమి విలువ బాగా పెరిగింది. సర్వే నెం.260లో కుమరాం గ్రామానికి చెందిన ఎస్సీ రైతులకు ప్రభుత్వం కేటాయించిన 38 ఎకరాల అసైన్డ్ భూములను గత వైసీపీ నాయకులు దౌర్జన్యంగా తమ పేరిట రాయించుకున్నారు. అంతే కాకుండా సమీపంలోని వాగులు, గెడ్డలను కప్పేసి మరో 50ఎకరాలు ఆక్రమించి మొత్తం భూమిని 99 ఏళ్ల లీజు పేరుతో చేజిక్కించుకున్నారు. ప్రస్తుతం 4 జేసీబీలతో నేలను చదును చేస్తూ కోట్ల రూపాయలకు ప్రైవేటు వ్యక్తులకు అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. సర్వే నెం.408లో 87.34 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనిపై ఎలాంటి 'డి-పట్టాలు' మంజూరు చేయలేదు. అయినప్పటికీ విశాఖపట్నానికి చెందిన ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి, అధికారుల సహకారంతో సుమారు రూ.25 కోట్ల విలు వైన 48 ఎకరాల భూమిని తన పేరిట మార్పించుకుని, అందులో గెస్ట్ హౌస్, కాంపౌండ్ వాల్ నిర్మించుకుని ఆక్రమించారు. కొందరు స్థానిక అధికారులు కబ్జాదారులకు సహకరిస్తూ ప్రభుత్వ రికార్డులను తారుమారు చేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతోంది. వారిపై చర్యలు తీసుకోని ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని కోరాడు.



## వాలంటీర్, సర్వేయర్, తహసీల్దారు అక్రమాలు

చిత్తూరు జిల్లా కుప్పం మండలం శీగలపల్లి గ్రామానికి చెందిన సురేష్ సమస్యను వివరిస్తూ గుడిపల్లి మండలం గోకర్నపల్లి గ్రామంలో తనకు ఖాతా నెంబర్ 187, సర్వే నెంబర్ 6ఏ/5 పరిధిలో 2.33 ఎకరాల పట్టా భూమి ఉంది. అయితే సదరు రీ సర్వే సమయంలో గ్రామ వాలంటీర్ శేఖర్, మండల సర్వేయర్ రత్నప్ప, అప్పటి తహసీల్దారు కుమ్మక్కై తన భూమిలో అక్రమాలకు పాల్పడ్డారు. తనకు చెందిన 2.33 ఎకరాల భూమిలో 0.45సెంట్ల భూమి వాలంటీర్ శేఖర్‌కు చెందుతుందని చెబుతూ వారు దౌర్జన్యంగా భూమిలోకి ప్రవేశించారు. తన భూమిని పక్కాగా సర్వే చేసి తనకు అప్పగించాలని కోరగా సర్వే చేయకుండా సదరు వ్యక్తులు తనను బూతులు తిడుతూ చంపేస్తానని శేఖర్ అనే వ్యక్తి బెదిరించాడని వాపోయారు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరాడు.

## భూమిలోకి ప్రవేశించి దౌర్జన్యం చేస్తున్నారు

కాకినాడకు చెందిన గోసారి అప్పారావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తిచేస్తూ భామరపాలెం రెవెన్యూ పరిధిలో గల సర్వే నెంబర్లు 315/3ఏలో 0.15ఎకరాలు, 315/3బీలో 1.11 ఎకరాలు, 315/3సీలో 1.50ఎకరాల భూమిని 2013లో కోర్టుద్వారా నిర్వహించిన వేలం పాటలో తాము న్యాయబద్ధంగా కొనుగోలుచేశాను. ఈ భూమిపై కొందరు వ్యక్తులు(సుంకల గంగరాజు,కేసిరెడ్డి అయ్యప్పస్వామి తదితరులు)దౌర్జన్యానికి దిగుతున్నారు. అక్రమంగా ప్రవేశించి పంటలను నాశనం చేయడానికి యత్నిస్తూ బెదిరింపులకు ప్రయత్నించారు. ఈ విషయమై పలుమార్లు పోలీసులకు, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పరిస్థితి మారలేదు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

## భూమి తమదని బెదిరిస్తున్నారు

శ్రీ సత్యసాయిజిల్లా బత్తలపల్లి మండలం గుమ్మళ్ళకుంట గ్రామానికి చెందిన కాగోళ్ళ నరసమ్మ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తాడిమర్రి మండలం నిధిగల్లు గ్రామ పొలం పరిధిలోని సర్వే నంబర్ 339-3లో 2.77ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇటీవల కే.లలితమ్మ, మేసపు నారాయణమ్మ అనే వ్యక్తులు దౌర్జన్యంగా వచ్చి భూమిలో మాకు వాటా ఉందని గొడవకు దిగుతున్నారు వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

## మరొకరి పేరుతో భూమిని నమోదు చేశారు

అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం పెనకచెర్ల గ్రామానికి చెందిన ఎం.అనిల్‌కుమార్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ తమ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 144లో తమకు భూమి ఉంది. కొందరు దౌర్జన్యంగా తమ భూమిని కబ్జా చేశారు. గతంలో పనిచేసిన స్థానిక రెవెన్యూ అధికారులు తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరించి భూమిని రికార్డుల్లో వేరేవ్యక్తుల పేరిటతప్పుగా నమోదు చేశారు. వారిపై చర్యలుతీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరాడు.

# వైసీపీ ఐదేళ్ల అక్రమాలపై చర్యలు

- మరింత సులభంగా రిజిస్ట్రేషన్ సేవలు
- అందుకోసమే సేవా కేంద్రాల ఏర్పాటు
- రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్



అమరావతి(చైతన్యరథం): వైసీపీ పాలనలో ఐదేళ్లలో జరిగిన అక్రమాలపై విచారించి చర్యలు తీసుకోనున్నట్లు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. తమ్మినేని భూ అక్రమాలతోపాటు గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు భూమికి సంబంధించి చట్ట విరుద్ధంగా కేటాయించిన వారిపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో జరిగిన అన్ని అక్రమాలపై చర్యలు ఉంటాయన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సామాన్యుల ఇబ్బందులు తొలగించేందుకు రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇవి ప్రజలకు మేలు చేసేవే తప్ప ఏ ఒక్కరికీ నష్టం చేయవని చెప్పారు. డాక్యుమెంట్ రైటర్లను పిలిపించి మాట్లాడితే వారు కూడా దీని పట్ల సానుకూలంగా స్పందించారు. కొందరు కొన్ని రాజకీయ పార్టీల స్వార్థం కోసం వేసే ట్రాప్‌లో పడొద్దని కోరారు. రెవెన్యూ సంస్కరణల్లో భాగంగా ఆర్‌ఎస్కేలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గొడ్డలి పార్టీకి రాజకీయ స్వలాభం కోసమే అసత్య ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు.

# అమరావతి ఛాంపియన్‌షిప్ షెడ్యూల్ ప్రకటించండి

- పాఠశాలలు, కళాశాలల నోటీస్ బోర్డులో ఉంచాలి
- కార్యాచరణ ప్రణాళికను కార్యాలయానికి పంపాలి
- శాప్‌చైర్మన్ అనిమిని రవినాయుడు ఆదేశం



విజయవాడ(చైతన్యరథం): శాప్ ప్రధాన కార్యాలయంలో శాప్ చైర్మన్ రవినాయుడు ఆధ్వర్యంలో అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలనిర్వహణపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.భరణి, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారులు, యూత్ సర్వీసెస్ అధికారులు, జిల్లా క్రీడా సంఘాల అధ్యక్షులు,కార్యదర్శులు,స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా కార్యదర్శులు, ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు తమ పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన అమరావతి ఛాంపియన్‌షిప్ షెడ్యూల్‌ను వెంటనే ఖరారు చేసి జిల్లాస్థాయిలో మీడియా సమావేశాలు నిర్వహించి అధికారికంగా ప్రకటించాలని ఆదేశించారు. ఏ నియోజకవర్గంలో ఏ తేదీన ఎక్కడపోటీలు నిర్వహించనున్నారోప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ప్రతిజిల్లాలో మండల విద్యాశాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు,విశ్వవిద్యాలయాలు,ఫిజికల్ డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులకు అధికారిక సమాచారాన్ని వెంటనే చేరవేయాలని ఆదేశించారు. పోటీల షెడ్యూల్‌ను ప్రతి పాఠశాల, కళాశాల నోటీస్ బోర్డుపై ప్రదర్శించి విద్యార్థులకు విస్తృతంగా తెలియజేయాలని సూచించారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించనున్న పోటీల తేదీలు, వేదికలు, నిర్వహణకు సంబంధించిన పూర్తికార్యాచరణ ప్రణాళికను వెంటనే శాప్ ప్రధాన కార్యాలయానికి పంపించాలని సూచించారు. జూలై 26నుంచి ఆగస్టు 2వతేదీ లోపు అన్ని నియోజకవర్గాల్లో పోటీలను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పోటీల నిర్వహణలో భోజనం, తాగునీరు, వసతి, వైద్య సదుపాయాలు, పరిశుభ్రత, క్రీడా మైదానాలు, క్రీడా సామగ్రి వంటి అన్ని ఏర్పాట్లను ముందస్తు ప్రణాళికతో పూర్తి చేయాలని సూచించారు. జిల్లా క్రీడా అభివృద్ధి అధికారులు అమరావతి ఛాంపియన్‌షిప్‌కు మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. స్థానిక సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, ప్రముఖ క్రీడాకారులు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు, పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, స్థానిక ప్రముఖులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసి అమరావతి ఛాంపియన్ షిప్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో శాప్ ఏవో రమావత్ వెంకటరమణనాయక్, యూత్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ రామకృష్ణ, స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ భానుమూర్తి పాల్గొన్నారు.

# రాయలసీమ అభివృద్ధి చంద్రన్న ఘనతే

- కృష్ణా జలాలతో సస్యశ్యామలం చేశారు
- ప్రతి జిల్లాకు పరిశ్రమలు తెస్తున్నారు
- ఉనికి కోసమే వైసీపీ అసత్య ఆరోపణలు
- ఐదేళ్లలో రాయలసీమకు చేసింది శూన్యం
- గొడ్డలి పార్టీది దోపిడీ.. టీడీపీది అభివృద్ధి
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



పెనుకొండ(చైతన్యరథం): ఉనికి కోసమే వైసీపీ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. కృష్ణా జలాలను రాయలసీమకు తీసుకు వచ్చి రతనాలసీమగా అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదని పేర్కొన్నారు. ఐదేళ్లలో రాయలసీమకు జగన్‌రెడ్డి చేసింది ఏమీలేదని విమర్శించారు. పెనుకొండ మండలం కురుబవాండ్ల పల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కియా పరిశ్రమతో ఈ ప్రాంతంలో యువతకు ఉద్యోగాలు లభిస్తున్నాయని తెలిపారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా ఆ సంస్థ నియోజకవర్గంలో సుమారు రూ.20 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కృష్ణా జలాలను రాయల సీమకు తీసుకొచ్చి రతనాల సీమ గా అభివృద్ధి చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో గాల్లో వచ్చి సినిమా సెట్టింగ్‌లు వేసి కొబ్బరి కాయలు కొట్టి హడావుడి తప్ప రాయలసీమకు జగన్ చేసిందేమీ లేదని విమర్శించారు.

దోపిడీకి కేరాఫ్ అడ్రాస్ వైసీపీ అని మండి పడ్డారు. ప్రపంచమంతా ఎల్‌నినో ప్రభావంతో విల విలలాడు తుంటే రాయలసీమలో చెరువులు, ఇతర నదులు జలకళతో కళకళలాడుతున్నాయి.. అటు కుప్పం, ఇటు మడకశిర వరకూ కృష్ణా జలాలు తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుదే.. రూ.లక్ష కోట్లతో రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గా తీర్చిదిద్దు తున్నారని తెలిపారు. రాయలసీమలోని అన్ని జిల్లాల్లోనూ పరిశ్రమలు ఏర్పా టు చేస్తున్నారు.

రాయలసీమ ప్రాంతానికి మొట్టమొదటిసారిగా ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో చంద్రబాబు రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నార న్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే రాయలసీమ లోని చివరి ఎకరాకు కూడా సాగునీరందుతుందని తెలిపారు. పులి వెందులకు కూడా సాగు, తాగు నీరందించిన ఘనత కూడా చంద్రబాబుదేనని పేర్కొన్నారు.

# మన్యం జిల్లాకు రెండు కుంకీ ఏనుగులు

- గుచ్చిమి క్యాంపునకు తరలించేందుకు ఏర్పాట్లు
- పలమనేరు శిబిరంలో అటవీ శాఖ సన్నాహాలు పూర్తి





పలమనేరు(చైతన్యరథం): ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాలతో రెండు కుంకీ ఏనుగులను పలమనేరు క్యాంపునుంచి పార్వతీపురం మన్యం జిల్లాకి తరలించేందుకు అటవీశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ముసలమడుగు క్యాంపు నుంచి వీటిని పార్వతీపురం మన్యం జిల్లాలోని గుచ్చిమి క్యాంపుకి తరలించనున్నారు. పవన్‌కళ్యాణ్ చొరవతో అడవి ఏనుగుల బెడదతో దీర్ఘకాలంగా పడుతున్న ఇబ్బందుల నుంచి పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలకు ఉపశమనం కలగనుంది. రాష్ట్రంలోని నానియాల్ ఏనుగుల శిబిరం లో ప్రత్యేక శిక్షణ పొందిన జయంత్ అనే కుంకీతోపాటు కర్ణాటక నుంచి తీసుకు వచ్చిన అభిమన్యుని పార్వతీపురం మన్యం జిల్లాకి తరలించేందుకు అటవీ అధికారులు సిద్ధం చేశారు. ఈ రెండూ మానవ-ఏనుగు సంఘర్షణ నియంత్రణ కార్యక్రమాల్లో అత్యంత అనుభవం కలిగిన కుంకీ ఏనుగులు. ఇటీవల కాలంలో అభిమన్యు, జయంత్‌లు ఆరు మేజర్ ఆపరేషన్లలో భాగస్వామ్యమై విజయవంతంగా పూర్తి చేశాయి. ఇటీవల పలమనేరు సమీపంలో ఒంటరి మగ అడవి ఏనుగుని బంధించిన ఆపరేషన్‌లో ఈ రెండు కుంకీలు అత్యంత కీలకంగా వ్యవహరించాయి. రెండింటి మధ్య సమన్వయం, ఆపరేషన్లలో పనితీరు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేశారు.

**అడవి ఏనుగుల నుంచి ఉపశమనం**

పార్వతీపురం మన్యం జిల్లా సరిహద్దులకు ఒడిశా రాష్ట్రం నుంచి అడవి ఏనుగుల గుంపులు పదే పదే తరలివస్తున్నాయి. వ్యవసాయ భూముల్లో చొరబడి పంటలను నాశనం చేయడంతో పాటు గ్రామాల మీద పడి విధ్వంసం సృష్టిస్తున్నాయి. అడవుల విభజన, అటవీ ఆవరణ తగ్గడం, ఆహారం, నీటి కొరత తదితర సమస్యల కారణంగా తరచూ అడవి ఏనుగులు ఒడిశా సరిహ ద్దుల నుంచి మన్యం జిల్లాకి చెందిన గ్రామాల్లో చొరబడుతు న్నాయి. మన్యం జిల్లాలో ఏనుగుల బెడద నివారణకు ఒడిశా ప్రభుత్వంతో చర్చించి తిరిగి మళ్లింపు చర్యలు చేపట్టడంతోపాటు ఆ రాష్ట్రం నుంచి కుంకీ ఏనుగులను కూడా తీసుకురావాలని ఉప ముఖ్యమంత్రి నిర్ణయించారు. అంతకంటే ముందు తక్షణ ఉపశ మన చర్యల్లో భాగంగా మన రాష్ట్రంలో అందుబాటులో ఉన్న రెండు కుంకీలను పలమనేరు నుంచి గుచ్చిమి క్యాంపునకు తరలిం చాలని ఆదేశించారు. గుచ్చిమి క్యాంపు నుంచి ఈ రెండు ఏనుగుల సహాయంతో సమస్యాత్మక ప్రాంతాల్లో సంఘర్షణల నియంత్రణ చర్యలు చేపడతారు. వీటితోపాటు సౌర కంచెల నిర్మాణం, ఏనుగులను నిరోధించేందుకు వీలుగా కందకాలు తవ్వడం, నీటి వనరుల అభివృద్ధి, ఏఐ ఆధారిత పర్యవేక్షణ, డ్రోన్ నిఘా, హనుమాన్ ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను అందుబాటులో ఉంచి, సమస్య తీవ్రత ఉన్న గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లాంటి చర్యలు అమలు చేయనున్నారు.

## శరవేగంగా సీడ్ యాక్సిస్ రోడ్డు పనులు



- స్టీల్ బ్రిడ్జిల నిర్మాణం వేగవంతం
- పరిశీలించిన పురపాలక మంత్రి నారాయణ

అమరావతి(చైతన్యరథం): రాజధాని అమరావతిలో సీడ్ యాక్సిస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జిల పెండింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా కాంట్రాక్ట్ సంస్థ నిర్విరామంగా పనులు చేస్తోంది. పురపాలక మంత్రి నారాయణ మంగళవారం రాత్రి పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు, ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేశారు. సీడ్ యాక్సిస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జిలు పూర్తయితే విజయవాడ,మంగళగిరి నుంచి జెట్ స్పీడ్‌తో అమరావతికి ప్రవేశించే అవకాశం ఉంటుందని తెలిపారు. రాజధానికి వెళ్లే ప్రయాణికులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

## భూకబ్జా కేసులో తమ్మినేనికి షాక్

### హైకోర్టులో క్వాష్ పిటిషన్ కొట్టివేత




అమరావతి(చైతన్యరథం): మాజీ స్పీకర్, వైసీపీ నేత తమ్మినేని సీతారాంకు ఏపీ హైకోర్టులో చుక్కెదురైంది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ తమ్మినేని దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. కేసు దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని పేర్కొన్న న్యాయస్థానం..ఈ దశలో జోక్యం చేసుకోవడం సరికాదని స్పష్టం చేసింది. అరెస్టు భయం ఉంటే ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని సూచించింది. ఈ కేసుకు సంబంధించి కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను జూలై 29కి వాయి దా వేసింది. నకిలీ పత్రాలను ఉపయోగించి సుమారు రూ.4 కోట్ల విలువైన భూమిని తన కుమారుడి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే ఆరోపణలతో తమ్మినేనిపై కేసు నమోదైంది. ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో కేసును రద్దు చేయాలని కోరుతూ తమ్మినేని హైకోర్టును ఆశ్రయించారు. అయితే కేసు ప్రాథమిక దశలో ఉన్నందున క్వాష్ చేయడానికి నిరాకరించిన హైకోర్టు.. చట్టపరమైన మార్గాలను అనుసరించాలని సూచించింది.

చైతన్యరథం




ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నిరంతర శ్రమతో రాష్ట్రంలో విద్యా వ్యవస్థ రూపురేఖలు వేగంగా మారిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ రాష్ట్రాన్ని ఒక "విద్యా ఇన్నోవేషన్ హబ్"గా తీర్చిదిద్దే దిశగా బలమైన అడుగులు వేస్తోంది. బాల్యం నుంచే సమగ్ర అభివృద్ధి, పారదర్శకత, సమాన అవకాశాలు కల్పిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు పునాది వేస్తున్నారు. పాఠశాలలను కేవలం చదువు చెప్పే కేంద్రాలుగానే కాకుండా సంతోషం, సృజనాత్మకత, నైతిక విలువలు నేర్పించే వికాస నిలయాలుగా తీర్చిదిద్దుతున్నారు.

# చంద్రబాబు విజన్... లోకేష్ మిషన్



## 'ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ హబ్'గా ఏపీ



### పాఠశాల స్థాయిలో విప్లవాత్మక సంస్కరణలు

గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అస్తవ్యస్తంగా ఉన్న జీవో నెం.117 రద్దు చేశారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు శనివారాన్ని 'నో బ్యాగ్ డే'గా ప్రకటించి క్రీడలు, జీవన నైపుణ్యాలకు ప్రాధాన్యమిస్తున్నారు. మహిళల పట్ల గౌరవం, సమానత్వం ప్రోత్సహించేలా పాఠ్యపుస్తకాల్లో మార్పులు తెచ్చారు. దేశంలోనే తొలిసారిగా కడప జిల్లాలో సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ విధానం ద్వారా విభిన్న, పోషకాహార మెనూ అమలు చేస్తున్నారు. రాజకీయ రంగుల స్థానే ఆకర్షణీయమైన క్రీమ్ & ఆలివ్-గ్రీన్ యూనిఫామ్, NCERT అనుగుణంగా బైలింగువల్ సిలబస్, QR కోడ్ కంటెంట్‌తో ఫౌండేషనల్ లిటరసీ-న్యూమరసీ (FLN)ని విస్తృతం చేశారు.

### మోడల్ స్కూళ్లు, అధునాతన మౌలిక సదుపాయాలు

LEAP కార్యక్రమం కింద ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక మోడల్ స్కూల్ చొప్పున 175 పాఠశాలలను అత్యుత్తమ వసతులతో అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలోని నిడమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 9,600 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేసి ఒక తరగతి-ఒక టీచర్ విధానాన్ని ప్రవేశపెట్టారు. పెదబయలు, అరకులోయ వంటి మారుమూల ప్రాంతాల్లో ఏకలవ్య పాఠశాలల ఏర్పాటుతో పాటు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సైన్స్, టెక్నాలజీ అనుభవాన్ని అందించడానికి మొబైల్ మేకర్ ల్యాబ్‌లను అందుబాటులోకి తెచ్చారు. బడుల నిర్వహణ మెరుగుదలకు ప్రత్యేక రేటింగ్ విధానాన్ని సైతం ప్రవేశపెడుతున్నారు.

### సంక్షేమ పథకాలు-ప్రపంచ స్థాయిలో రికార్డులు

సూపర్ సిక్స్ పథకాల కింద 'తల్లికి వందనం' ద్వారా ఒకటి నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 67.47 లక్షల మందికి పైగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఒక్కొక్కరికీ ఏటా రూ.15వేలు చొప్పున జమ చేస్తూ ఆర్థిక అండగా నిలుస్తున్నారు. గతంలో నిలిచిపోయిన ఉచిత పుస్తకాలు, బ్యాగుల పంపిణీతో పాటు ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని పునరుద్ధరించారు. విద్యా శాఖ మంత్రి లోకేష్ నాయకత్వంలో 61వేలకు పైగా పాఠశాలల్లో నిర్వహించిన 'మెగా పీటీఎం' (తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశం)లో 1.5 కోట్ల మంది భాగస్వాములై గిన్నిస్ వరల్డ్ రికార్డు నెలకొల్పారు. రాష్ట్రంలోని పాఠశాలలన్నింటికీ హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తూ డిజిటల్ విద్యకు ప్రాణం పోస్తున్నారు.

### పారదర్శక పాలన-నియామకాల్లో విప్లవం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం 16,347 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ ఫైలుపై తొలి సంతకం చేసి కేవలం 150 రోజుల్లోనే అత్యంత పారదర్శకంగా ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేసింది. 100% పారదర్శకతతో హామీని నిలబెట్టుకుని నిరుద్యోగ యువతలో నూతనోత్తేజం నింపింది. రాజకీయం లేని అకడమిక్ క్యాలెండర్ అమలు చేస్తూ, సామాజిక సమతూకం పాటిస్తూ వైస్ చాన్సలర్లు, ప్రిన్సిపాల్స్ నియామకాలు చేపట్టడం ప్రభుత్వ నిష్పక్షపాత వైఖరికి నిదర్శనం.

కరెంట్ అనాలిసిస్
తెలుసుకుందాం | విశ్లేషిద్దాం | సిద్ధమవుదాం
స్వరూప, అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

### విద్యార్థుల సమగ్ర వికాసం-నైపుణ్యాభివృద్ధి

కేవలం తరగతి గది విద్యకే పరిమితం కాకుండా గ్రీన్ పాస్‌పోర్ట్ (పర్యావరణ అవగాహన), యోగా, అమరావతిలో మాక్ అసెంబ్లీ (రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా), క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంచే 'ముస్తాబు' వంటి కార్యక్రమాలతో పిల్లల్లో సామాజిక బాధ్యత పెంపొందిస్తున్నారు. ఉన్నత విద్యలో ఏఆర్-వీఆర్ (AR-VR) వంటి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ శిక్షణ, పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టు ఆధునిక యంత్రాలతో ITIల బలోపేతం ద్వారా నైపుణ్యాభివృద్ధికి బలమైన బాటలు వేస్తున్నారు. మహిళలు, దివ్యాంగుల కోసం ప్రత్యేక జాతీయ స్థాయి విద్యా సంస్థలను అందుబాటులోకి తెస్తున్నారు.


## విద్యా వికాస నిలయాలుగా ప్రభుత్వ పాఠశాలలు



### వికసిత ఆంధ్రప్రదేశ్ 2047 దిశగా...

పేదింటి పిల్లవాడు సైతం అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసంతో పెరిగి ప్రపంచ నాయకుడిగా ఎదగాలనే ఉన్నత లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది. పాఠశాలలను పిల్లలకు రెండో ఇల్లుగా మారుస్తూ.. అక్షరాస్యత, ఉన్నత విద్యలో చేరికలు, పరిశోధన విశ్వవిద్యాలయాల బలోపేతంతో ఆంధ్రప్రదేశ్ 2047 నాటికి వికసిత రాష్ట్రంగా రూపుదిద్దుకోవడానికి కూటమి ప్రభుత్వం విద్యా రంగంలో స్వర్ణయుగాన్ని ఆవిష్కరిస్తోంది.





చైతన్యరథం

2 ఏళ్ల నమ్మకం
అభివృద్ధి, సంక్షేమం

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన రెండేళ్లలో చాలా రంగాల్లో మార్పులు కనిపించాయి. కానీ అందులో అత్యంత ముఖ్యమైన మార్పు ఏదైనా ఉందంటే... అది సామాజిక న్యాయం అనే భావనకు కొత్త అర్థం రావడం. ఒకప్పుడు సంక్షేమం అంటే పథకాలు ప్రకటించడం, నిధులు కేటాయించడం వరకే పరిమితమయ్యేది. ఇప్పుడు సంక్షేమం అంటే విద్య, నైపుణ్యం, ఉపాధి, భద్రత, ఆత్మవిశ్వాసం, గౌరవప్రదమైన జీవితం కల్పించడం అనే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రెండేళ్లలో తీసుకున్న అనేక నిర్ణయాలను చూస్తే... ఈ ప్రభుత్వం కేవలం సహాయం చేయడం కాదు, సమాజంలోని అట్టడుగువర్గాలను శాశ్వతంగా నిలబెట్టాలనే ఆలోచనతో పనిచేస్తోందనే విషయం స్పష్టంగా కనిపిస్తోంది.

# సామాజిక న్యాయానికి కొత్త నిర్వచనం





## విద్యే నిజమైన సాధికారత... అదే ప్రభుత్వ ప్రాధాన్యం

పేద విద్యార్థికి నాణ్యమైన విద్య అందితేనే తరాలు మారతాయి. ఈ ఆలోచనతో విద్యా రంగంలో భారీ స్థాయిలో చర్యలు చేపట్టడం విశేషం. పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద రూ.1,543.17 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసి 5.40 లక్షల మంది విద్యార్థుల ఉన్నత విద్యకు అండగా నిలిచింది ప్రభుత్వం. 'తల్లికి వందనం' ద్వారా 2.51 లక్షల మంది విద్యార్థులకు రూ.326.74 కోట్ల సహాయం అందింది. విద్యార్థులు మధ్యలో చదువు మానేయకుండా కార్పొరేట్ స్థాయి విద్యను ప్రభుత్వ వ్యవస్థలోనే అందించాలనే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టడం మరో విశేషం.

## పోటీ పరీక్షల్లో పేద విద్యార్థులకూ సమాన అవకాశాలు

గ్రామీణ ప్రాంతాల్లో చదివిన విద్యార్థులు కూడా IAS, IPS, టీచర్, గ్రూప్స్ వంటి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించింది. NEET, JEE, Civils, Groups, DSC వంటి పరీక్షలకు పూర్తిగా ఉచిత కోచింగ్ అందిస్తోంది. మెగా డీఎస్సీ కోచింగ్‌లో 2వేల మంది శిక్షణ పొందగా అందులో 331 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించడం ప్రభుత్వ శిక్షణ నాణ్యతకు నిదర్శనం. పోటీ పరీక్షలు నగరాలకే పరిమితం కావట్లేదు. ప్రభుత్వ కోచింగ్ ద్వారానే వేలాది మంది యువతలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

## గురుకులాలు... ఇప్పుడు ప్రతిభకు చిరునామా

ఒకప్పుడు గురుకులాల్లో కేవలం వసతి మాత్రమే ఉండేదని భావించేవారు. ఇప్పుడు అక్కడి ఫలితాలు ఆ అభిప్రాయాన్ని పూర్తిగా మార్చేశాయి. టెన్త్‌లో 89 శాతం, ఇంటర్మీడియట్‌లో 92 శాతం ఉత్తీర్ణత సాధించడం చిన్న విషయం కాదు. టెన్త్‌లో 591 మార్కులు, ఇంటర్‌లో 950కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు గురుకులాల నుంచే రావడం ప్రభుత్వ విద్యపై పెరిగిన నమ్మకాన్ని చూపిస్తోంది. ఇంకా జాతీయ స్థాయి పరీక్షల్లో మరింత మంది రాణించేలా నాలుగు ప్రత్యేక ఎక్సలెన్స్ సెంటర్లు ఏర్పాటు చేయడం భవిష్యత్తు తరాలకు పెద్ద పెట్టుబడి.

## హాస్టళ్లు అంటే వసతి మాత్రమే కాదు... భద్రత కూడా

ప్రభుత్వ హాస్టళ్ల పరిస్థితి గతంలో ఎలా ఉండేదో అందరికీ తెలుసు. ఇప్పుడు మాత్రం రూ.104.96 కోట్లతో 774 హాస్టళ్లలో మరమ్మతులు, మౌలిక సదుపాయాలు కల్పించారు. ప్రతి హాస్టల్‌లో ఆర్వో ప్లాంట్లు, పరిశుభ్రమైన వంటశాలలు, హౌస్ కీపింగ్ వ్యవస్థ, ఏఐ ఆధారిత సీసీ కెమెరాలు, శుభ్రమైన పడకలు, పోషకాహారం వంటి సౌకర్యాలు కల్పించడం ద్వారా విద్యార్థులకు కుటుంబ వాతావరణం కల్పించే ప్రయత్నం జరుగుతోంది.

## ఆరోగ్యంగా ఉంటేనే విద్య పూర్తవుతుంది

విద్యార్థుల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ఈ రెండేళ్లలో కనిపించిన ముఖ్యమైన మార్పు. ప్రతి హాస్టల్‌లో ఆరోగ్య సిబ్బంది, నర్సింగ్ సేవలు ఏర్పాటు చేయడం, అవసరమైతే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య సహాయం అందించడం, మానసిక ఆరోగ్యం కోసం కౌన్సిలింగ్ ఇవ్వడం వంటి చర్యలు విద్యార్థుల్లో భరోసా పెంచుతున్నాయి.

## దివ్యాంగులకు సంక్షేమం కాదు... గౌరవప్రద జీవితం

సమాజంలో అత్యంత అవసరమైన వర్గమైన దివ్యాంగులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. 52వేలకు పైగా దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు పంపిణీ చేశారు. వారి కోసం పెండింగ్ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభమైంది. పింఛన్‌ను రూ.6వేలకు పెంచడం ద్వారా ఆర్థిక భరోసా కల్పించడమే కాకుండా ఉపాధి అవకాశాలు కూడా పెంచే దిశగా చర్యలు తీసుకుంటోంది. జిల్లాలోని కలెక్టరేట్‌ల్లో దివ్యాంగులకు అనుకూల సౌకర్యాలు ఏర్పాటు చేయడం మంచి ముందడుగు.

## ట్రాన్స్‌జెండర్లకు గౌరవప్రదమైన స్థానం

సమాజంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు చేసి వారికి ఉపాధి, సంక్షేమం, గౌరవప్రద జీవితం కల్పించే చర్యలు ప్రారంభమయ్యాయి. ఇది కేవలం పరిపాలనా నిర్ణయం కాదు... సమాజాన్ని సమానత్వం వైపు తీసుకెళ్లే అడుగు.

## డిజిటల్ పరిపాలన... ప్రతి ఇంటికీ ప్రభుత్వం

స్వర్ణ గ్రామం/వార్డు వ్యవస్థ ద్వారా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైంది. 1.68 కోట్ల ఇళ్ల మ్యాపింగ్, 1.71 కోట్ల కుటుంబాల ఈ-కేవైసీ పూర్తి చేయడం ద్వారా ప్రభుత్వ సేవలు మరింత పారదర్శకంగా మారాయి. డిజిలాకర్ ద్వారా పౌరుల ముఖ్య పత్రాలను డిజిటల్ రూపంలో భద్రపరిచే అవకాశం కల్పించడం కూడా ఆధునిక పరిపాలనకు నిదర్శనం.

## ఎస్సీ సబ్ ప్లాన్... నిధులు మాత్రమే కాదు వినియోగం కూడా

చాలా ప్రభుత్వాలు భారీ కేటాయింపులు ప్రకటిస్తాయి. కానీ వాటి అమలే అసలు పరీక్ష. 2024-25 సంవత్సరానికి రూ.26,044 కోట్ల ఎస్సీ సబ్ ప్లాన్ కేటాయించి, నిధుల వినియోగంలో కూడా రికార్డు స్థాయి పురోగతి సాధించడం ప్రత్యేకత. అభివృద్ధి నిధులు నిజంగా లబ్ధిదారులకు చేరినప్పుడే వాటి విలువ ఉంటుంది.

## మహిళలు, వృద్ధులు, బలహీన వర్గాలకు భరోసా

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు లక్షలాది మంది వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు అండగా నిలుస్తున్నాయి. మహిళల స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సబ్సిడీ రుణాలు వంటి కార్యక్రమాలు కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తున్నాయి.

ఇది కేవలం సంక్షేమం కాదు...
కుటుంబాలను నిలబెట్టే ఆర్థిక బలం.
సంక్షేమం నుంచి సాధికారత వైపు... ఇదే అసలైన మార్పు
గతంలో సంక్షేమం అంటే డబ్బు పంపిణీ.
ఇప్పుడు సంక్షేమం అంటే విద్య, ఉద్యోగం, నైపుణ్యం, డిజిటల్ సేవలు, ఆరోగ్యం, భద్రత, గౌరవప్రద జీవితం.
ఇదే ఈ రెండేళ్లలో కనిపించిన అసలైన మార్పు.
ఒక విద్యార్థి మంచి ఉద్యోగం పొందితే ఒక కుటుంబం మారుతుంది.
ఒక దివ్యాంగుడు స్వయం ఉపాధి పొందితే ఒక జీవితం మారుతుంది.
ఒక మహిళ ఆర్థికంగా నిలబడితే ఒక తరం మారుతుంది.
అదే నిజమైన సామాజిక న్యాయం.

## రెండేళ్ల నమ్మకం...
## సమాన అవకాశాల వైపు రాష్ట్ర ప్రయాణం

ఈ రెండేళ్లలో తీసుకున్న నిర్ణయాలను పరిశీలిస్తే ప్రభుత్వం కేవలం పథకాలు ప్రకటించడం కాదు... సమాజంలో వెనుకబడిన ప్రతి కుటుంబాన్నీ ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేస్తోందనే విషయం స్పష్టమవుతోంది.
విద్యలో నాణ్యత...
పోటీ పరీక్షల్లో అవకాశాలు...
గురుకులాల బలోపేతం...
హాస్టళ్ల ఆధునీకరణ...
దివ్యాంగుల గౌరవప్రద జీవితం...
మహిళల సాధికారత...
డిజిటల్ పరిపాలన...
సబ్ ప్లాన్ నిధుల సమర్థ వినియోగం...
ఇవి ఒక్కోటి విడివిడిగా కనిపించినా... కలిపి చూస్తే ఒక పెద్ద దిశ కనిపిస్తోంది. అదే సంక్షేమాన్ని సాధికారతగా మార్చే పరిపాలన.

అందుకే రెండేళ్ల క్రితం ప్రజలు ఉంచిన నమ్మకం ఈ రోజు కేవలం హామీల్లో కాదు... విద్యార్థుల విజయాల్లో, హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాల్లో, దివ్యాంగుల చిరునవ్వుల్లో, మహిళల ఆత్మవిశ్వాసంలో, గ్రామీణ కుటుంబాల ఆశల్లో కనిపిస్తోంది.

"రెండేళ్ల నమ్మకం... ప్రతి బలహీన వర్గం జీవితంలో గౌరవప్రదమైన మార్పునకు బలమైన పునాది."

శశికుమార్
తెలుగుదేశం సైనికుడు



# ఆక్వా, పొగాకు రంగాల సమస్యల పరిష్కారానికి కేంద్రానికి వినతులు

**•కేంద్ర మంత్రులతో రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధుల కీలక భేటీ**



న్యూఢిల్లీ (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధుల బృందం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రులను విడివిడిగా కలిసి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించింది. ఈ సందర్భంగా ఆక్వాకల్చర్, పొగాకు రంగాలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించింది. కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌ను ఆయన నివాసంలో కలిసి అమరావతిలో జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ (NFDB) ప్రాంతీయ కార్యాలయం, ఆక్వా క్వారంటైన్ ఫెసిలిటీ (AQF) ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జీవో నెం.146 ద్వారా అమరావతి సమీపంలో 7.89 ఎకరాల భూమిని కేటాయించిందని, డీపీఆర్ తయారీ, పరిశీలనలు, ఆర్థిక అనుమతులు, నిధుల విడుదల, టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి 2028 నాటికి నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ కేంద్రాల ఏర్పాటుతో NFDB ప్రాంతీయ కార్యాలయం, ఆక్వా క్వారంటైన్ ఫెసిలిటీతో పాటు శిక్షణా కేంద్రం అందుబాటులోకి వచ్చి ఆక్వా రంగానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

**ఆక్వా, ఎఫ్‌సీవీ రంగాల సమస్యలపై చర్చ**

అనంతరం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను ఢిల్లీలోని వాణిజ్య భవన్‌లో కలిసి ఆక్వా, ఎఫ్‌సీవీ (FCV) పొగాకు రంగాల సమస్యలపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రొయ్యల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉందని, ఈ రంగంపై లక్షలాది మంది రైతులు, కార్మికులు, హేచరీలు, ఫీడ్ తయారీదారులు, ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతిదారులు ఆధారపడి ఉన్నారని వివరించారు. అంతర్జాతీయ మార్కెట్లో రొయ్యల ధరలు తగ్గడం, ముఖ్యంగా ఫీడ్ ధరలు పెరగడం వల్ల రైతులు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ, ఫిష్ మీల్ ఎగుమతులను నియంత్రించి దేశీయ అవసరాలకు ప్రాధాన్యత కల్పించాలని, అలాగే నమోదు చేసుకున్న రొయ్యల ఫీడ్ తయారీ సంస్థలకు మాత్రమే పరిమిత స్థాయిలో, తగిన నియంత్రణలతో 2021 నాటి విధానాన్ని అనుసరించి జన్యుమార్పిడి (GM) సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. ఈ చర్యల ద్వారా ఫీడ్ తయారీ వ్యయం తగ్గి రైతులకు ఉపశమనం కలగడంతో పాటు భారత రొయ్యల ఎగుమతుల పోటీతత్వం, విదేశీ మారకద్రవ్య ఆదాయం, లక్షలాది కుటుంబాల జీవనోపాధి రక్షించబడుతుందని తెలిపారు. అలాగే, పొగాకు ఎగుమతులకు ప్రోత్సాహకాలు కల్పించాలని కోరుతూ కేంద్ర వాణిజ్య శాఖ మంత్రికి వినతిపత్రం సమర్పించారు.

భారతదేశ ఎఫ్‌సీవీ పొగాకు ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఈ రంగంపై లక్షలాది మంది రైతులు, కూలీలు ఆధారపడి ఉన్నారని వివరించారు. HS Code 2401 కింద ఉన్న అన్‌మాన్యుఫ్యాక్చర్డ్ పొగాకుకు RoDTEP పథకాన్ని వర్తింపజేయడంతో పాటు Interest Equalisation Scheme (NIRYAT PROTSAHAN) పరిధిలోకి తీసుకురావాలని కోరారు. 2021-22లో భారత్ నుంచి ఎఫ్‌సీవీ పొగాకు ఎగుమతులు 105.21 మిలియన్ కిలోలు, రూ.2,909.99 కోట్ల విలువ ఉండగా, 2025-26 నాటికి 155.05 మిలియన్ కిలోలకు, రూ.7,782.98 కోట్ల విలువకు పెరిగాయని తెలిపారు. జింబాబ్వే, బ్రెజిల్ వంటి దేశాలు తమ ఎగుమతిదారులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తున్న నేపథ్యంలో, అంతర్జాతీయ మార్కెట్లో భారత పొగాకు ఎగుమతిదారులు పోటీ పడేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాలను త్వరితగతిన అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆక్వా, పొగాకు రైతుల సంక్షేమం, ఆయా రంగాల స్థిరమైన అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని రాష్ట్ర మంత్రుల బృందం స్పష్టం చేసింది. కేంద్ర మంత్రులు ఈ అంశాలను ప్రాధాన్యతతో పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించింది. ఈ సమావేశాల్లో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసరాజు, రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, తెనాలి శ్రవణ్ కుమార్, కలిశెట్టి అప్పలనాయుడు, సానా సతీష్, భరత్, మాగుంట శ్రీనివాసులురెడ్డి, పురందేశ్వరి, బీద మస్తాన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత

**•విజయనగరం జిల్లాలో అభివృద్ధికి రూ.28 కోట్లు నిధులు**

**● అందుబాటులోకి వి.ఎం.ఆర్.డి.ఎ జోనల్ కార్యాలయం**

**•విఎంఆర్‌డిఏ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్**



విజయనగరం (చైతన్యరథం): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, పట్టణ పురపాలక శాఖ మంత్రి నారాయణ సూచనలతో గ్రామీణ ప్రాంతాలను పట్టణాలుగా తీర్చిదిద్దటానికి తగిన ప్రాధాన్యత ఇస్తున్నామని వి.ఎం.ఆర్.డి.ఎ ఛైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ వెల్లడించారు. మంగళవారం విజయనగరంలోని జోనల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రజా దర్బార్‌లో పాల్గొన్నారు.

**మౌలిక సదుపాయాలు కల్పనే ధ్యేయం**

వి.ఎం.ఆర్.డి.ఎ ఇప్పటి వరకు పట్టణాల అభివృద్ధికి కీలక భూమిక పోషించిందని, ఐతే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వి.ఎం.ఆర్.డి.ఎ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు పెద్ద పీట వేస్తున్నామని పేర్కొన్నారు. ప్రధానంగా వి.ఎం.ఆర్.డి.ఎ పరిధిలోని నాలుగు మునిపాలిటీలను బలోపేతం చేసేలా ఆయా ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించడం జరిగిందన్నారు ఇందులో భాగంగానే విజయనగరం జిల్లాలో విజయనగరం, నెల్లిమర్ల మున్సిపాలిటీలకు గత రెండేళ్లలో ఇప్పటి వరకూ సుమారు రూ.28 కోట్ల నిధులు కేటాయించామని

**ఉడా పార్క్ తరహాలో అధునాతన సదుపాయాలతో మోడల్ పార్కు**

విఎంఆర్‌డిఏ ఆధ్వర్యంలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తున్నామని, విజయనగరంలో తగిన స్థలాలు కేటాయిస్తే విశాఖలోని ఉడా పార్క్ తరహాలో అధునాతన సదుపాయాలతో మోడల్ పార్కును అభివృద్ధి చేయటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అదేవిధంగా ప్రజల నుంచి వస్తున్న వినతులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

**అందుబాటులోకి జోనల్ కార్యాలయం**

విఎంఆర్‌డిఏ పరిధిలో ప్రజలు తమ వినతులు ఇవ్వటానికి విశాఖలోని ప్రధాన కార్యాలయం వరకు రానవసరం లేదని, జిల్లా ప్రజల సౌకర్యార్థం విజయనగరం ఆనంద గజపతి ఆడిటోరియం ఆవరణలో జోనల్ కార్యాలయం అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఇక్కడ ప్రతీ మంగళవారం ప్రజా దర్బార్ జరుగుతుందని, అందువల్ల ప్రజలు ఇక్కడే విఎంఆర్‌డిఏకి సంబంధించిన వినతులు ఇవ్వవచ్చన్నారు. కార్యాలయం పర్యవేక్షణ కోసం విశ్రాంతి ఆర్‌డిఓ మహేశ్వరరావుని జిల్లా సమన్వయాధికారిగా నియమించామని, ఆయన ఈ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మాజీ స్పీకర్ కుటుంబాన్ని తక్షణమే అరెస్ట్ చేయాలి

**•వైసీపీ హయాంలో ల్యాండ్ గ్రాబింగ్ అరాచకాలపై : ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి డిమాండ్**



ఎస్.కోట (చైతన్యరథం): గత ఐదేళ్ల జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నాయకులు, మంత్రులు, చివరికి రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్ వరకు భూకబ్జాలు, అరాచకాలకు ఒడిగట్టారని ఎస్.కోట శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ నాయకులు చేసిన అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటిగా బట్టబయలవుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆనాటి స్పీకర్ తీరుపై ఆమె తీవ్ర విమర్శలు గుప్పించారు. పార్టీలకు అతీతంగా, పారదర్శకంగా వ్యవహరించాల్సిన స్పీకర్ పదవిలో ఉండి, అసెంబ్లీలో నాటి ప్రతిపక్ష నాయకులను, శాసనసభ్యులను హేళన చేస్తూ జగన్ మెప్పు పొందేందుకు ప్రయత్నించారని మండిపడ్డారు. అంతేకాకుండా, స్పీకర్ భార్య అంగన్‌వాడీ వర్కర్ల స్థలాలపై, ఇతర ప్రాంతాల్లో చేసిన భూకబ్జాల వివరాలు ఈరోజు పత్రికలు, మీడియా ద్వారా బయటకు వచ్చి ప్రజలందరికీ తెలిశాయని చెప్పారు. తన సొంత నియోజకవర్గంలో రూ. 4 కోట్లకు పైగా విలువైన భూమిని కబ్జా చేసిన సదరు మాజీ స్పీకర్, విషయం వెలుగులోకి రావడంతో ఇప్పుడు ఇల్లు వదిలి పరారయ్యారని లలితకుమారి ఎద్దేవా చేశారు. జగన్ నుంచి మొదలుకొని ఆయన మంత్రివర్గం, స్పీకర్ వరకు చేసిన అరాచకాలే వైసిపి పాలనలోని అవినీతికి నిదర్శనమని, వీటిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రస్తుతం పరారీలో ఉన్న మాజీ స్పీకర్ మరియు ఆయన కుటుంబాన్ని తక్షణమే అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే లలితకుమారి డిమాండ్ చేశారు.

# ఉద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చాలి : ఎమ్మెల్యే పల్లాకు వినతి



గాజువాక (చైతన్యరథం): 2004 లోపు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జీవో నెంబర్ 53 ద్వారా పాత పెన్షన్ విధానం వర్తింపజేసిన మాదిరిగా 1-2-1999 నుండి 31-8-2004 వరకు విద్యుత్ సంస్థలోని ఉద్యోగులకు కూడా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జోన్-2 ఉద్యోగులు కోరారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుని కలిసి వినతిపత్రం సమర్పించారు. బ్రాంచి అధ్యక్షులు జె.అప్పలరాజు, కార్యదర్శి బుద్దా శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఉద్యోగుల ఆకాంక్షను నెరవేర్చాలని కోరారు. సమస్యలపై ఎమ్మెల్యే పల్లా సానుకూలంగా స్పందించారని విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు విద్యుత్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళతానని చెప్పారని అన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర నాయుడు, డిస్కమ్ వైస్ పెసిడెంట్ ఏదురు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య : మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

తిరువూరు (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం విస్సన్నపేట మండలం కొండపరువు గిరిజన బాలికల గురుకుల పాఠశాల మరియు కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను స్త్రీ, శిశు సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సందర్శించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాఠశాలలోని తరగతి గదులు, వసతి గృహాలు, వంటశాల, భోజనశాల, తాగునీరు, పారిశుధ్య సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, అందిస్తున్న ఆహారం నాణ్యతను స్వయంగా పరిశీలించారు. పాఠశాలకు అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరిన విద్యార్థులు... విద్యార్థుల విజ్ఞప్తిపై వెంటనే స్పందించిన, అప్రోచ్ రోడ్డు మంజూరుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి, ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో గిరిజన విద్యా సంస్థల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.



# విగ్రహాల మధ్య గీత గీసి సీతారాములను విడదీయాలన్న వైసీపీ కుట్ర

● 29... 30 డివిజన్లలో 'మన వార్డులో - మన ఆదిరెడ్డి' కార్యక్రమం



రాజమహేంద్రవరం (చైతన్యరథం): నగరంలోని కొత్తపేట–అన్నపూర్ణమ్మపేట మధ్య ఉన్న రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ ప్రతిపాదన సందర్భంగా, అక్కడి ఆలయంలోని సీతారాముల విగ్రహాల మధ్య గీత గీసి వాటిని విడదీయాలని అప్పటి వైసీపీ ప్రభుత్వం, అప్పటి ప్రజా ప్రతినిధి ప్రయత్నించారని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆరోపించారు. ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలు, మనోభావాలకు భంగం కలగకుండా తాము ఆ ప్రయత్నాన్ని అడ్డుకుని విగ్రహాలను యథాతథంగా కాపాడామని తెలిపారు. 29, 30 డివిజన్లలో నిర్వహించిన "మన వార్డులో -- మన ఆదిరెడ్డి" కార్యక్రమంలో భాగంగా ముందుగా సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే వాసు స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో పాల్గొని అభివృద్ధి, సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారంపై విస్తృతంగా మాట్లాడారు. కార్యక్రమం ముగిసిన అనంతరం టీడీపీ యువ నాయకుడు రఘు నివాసంలో రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.... 29, 30 డివిజన్లు తెలుగుదేశం పార్టీకి బలమైన కోటగా నిలిచాయని, కూటమి ప్రభుత్వానికి ప్రజలు అందించిన విశ్వాసం, మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మరింత చేరువ కావడం, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించడం లక్ష్యంగా "మన వార్డులో - మన ఆదిరెడ్డి" కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. ప్రతి వార్డులో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమస్యలను గుర్తించి, వేగంగా పరిష్కరిస్తున్నామని వివరించారు.

# లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



చీపురుపల్లి (చైతన్యరథం): ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సీఎం చంద్రబాబు నాయుడు అండగా ఉంటున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కిమిడి రామ్ మాలిక్ నాయుడు అన్నారు. మంగళవారం చీపురుపల్లి మండలంలోని నిమ్మలవలస, ఎలకలపేట, ఇటకర్లపల్లి తదితర గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడి వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఆయన చెక్కులను అందజేశారు. రామ్ మాలిక్ వెంట తెదేపా నాయకులు రౌతు కాము నాయుడు, చీపురుపల్లి కనకమహాలక్ష్మి ఆలయ కమిటీ అధ్యక్షుడు గవిడి నాగరాజు, ఆయా గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు.

# వర్షాలు సమృద్ధిగా కురవాలని ఎమ్మెల్యే యార్లగడ్డ చండీ హోమం

● విజయవాడ కార్యాలయంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు

● కృష్ణా డెల్టా, గన్నవరం మెట్ట ప్రాంతాలు పచ్చగా కళకళలాడాలని ఆకాంక్ష



గన్నవరం (చైతన్యరథం): వర్షాలు సమృద్ధిగా కురిసి, కృష్ణా డెల్టా ఆయకట్టు మరియు గన్నవరం మెట్ట ప్రాంతాలు పచ్చగా కళకళలాడాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మంగళవారం విజయవాడలోని తన కార్యాలయంలో శాస్త్రోక్తంగా చండీ హోమం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన హోమంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాతలకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా వరుణుడు కరుణించాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ.. కృష్ణా డెల్టా పరిధిలోని 7.37 లక్షల ఎకరాల ఆయకట్టును రక్షించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. సాగుకు అవసరమైన నీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎగువ ప్రాంతాల నుంచి ఆశించిన మేర నీరు రాకున్నా పట్టిసీమ ద్వారా ప్రస్తుతం 6 వేల క్యూసెక్కుల నీటిని డెల్టాకు తరలిస్తూ రైతులకు కొంత మేర ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని పేర్కొన్నారు. అంతేకాకుండా సీలేరు జలాలను గోదావరిలోకి మళ్లించి, పట్టిసీమ వద్ద నీటి మట్టం తగ్గకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు సాగునీటి కొరత తలెత్తకుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ అవసరమైన నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. సాధారణంగా కృష్ణా డెల్టా సాగు అవసరాల్లో కొంత భాగం వర్షాల ద్వారా తీరుతుందని, ఈసారి ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో కాలువలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

# సమాజం పట్ల ప్రేమ ఉన్నపుడే నర్సింగ్ రంగంలో రాణించగలం

● గ్రేస్ కాలేజీలో నర్సింగ్ విద్యార్థులకు ధృవీకరణ పత్రాల పంపిణీలో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర

● అనారోగ్యంతో ఉన్నవారికి మెరుగైన సేవలందించి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని పిలుపు



మచిలీపట్నం (చైతన్యరథం): సమాజం పట్ల ప్రేమ, ప్రజల పట్ల సేవా భావం ఉన్నపుడు మాత్రమే నర్సింగ్ రంగంలో రాణించవచ్చని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నంలోని గ్రేస్ నర్సింగ్ కాలేజీలో 11వ బ్యాచ్ విద్యార్థులకు ధృవీకరణ పత్రాల పంపిణీలో పాల్గొన్నారు. మెరుగైన ప్రతిభ చూపిన విద్యార్థులకు అవార్డులు అందించారు. అనారోగ్యంతో ఆస్పత్రిపాలైన వారికి నర్సులు అందించే సేవలు ఎంతో అమోఘమైనవి. డాక్టర్లు స్టెతస్కోపుతో రోగుల్ని పరిశీలిస్తే.. నర్సులు మానవతా దృక్పథంతో, మనసుతో చూసి వారికి స్వాంతన చేకూరుస్తారు. మెడికల్ రంగంలో నర్సుల సేవలు అత్యంత విలువైనవి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధ పెడుతోంది. ప్రస్తుత తరుణంలో నర్సింగ్ విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉంది. నర్సులకు మంచి డిమాండ్ ఉంది. మచిలీపట్నంలోని గ్రేస్ నర్సింగ్ కాలేజీ ఈ సమాజానికి ఎంతో మంది నర్సుల్ని అందించింది. ఎంతో మంది పట్టభద్రులైన నర్సులు వైద్య రంగంలో విలువైన సేవలు అందిస్తున్నారు. నర్సింగ్ పూర్తి చేసిన వారు.. సేవా భావంతో పని చేసి మరింత మందికి ఆదర్శంగా నిలవాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కొనకళ్ల జగన్నాధరావు, గొర్రెపాటి గోపీచంద్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, పల్లపాటి సుబ్రహ్మణ్యం, తలారి సోమశేఖర్, గ్రేస్ నర్సింగ్ కాలేజ్ కరస్పాండెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జీవనశైలి వ్యాధులకు దారితీస్తున్న అధిక చక్కెర ఆహారాలపై నియంత్రణ చర్యలేంటి?

● కేంద్రాన్ని వివరణ కోరిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు

● ఏపీలో ఫెర్రీ సేవల విస్తరణపైనా పార్లమెంట్‌లో కీలక ప్రశ్నలు




న్యూఢిల్లీ / కాకినాడ (చైతన్యరథం): ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతున్న అధిక చక్కెర కలిగిన అల్ట్రా ప్రాసెస్డ్ ఆహారాల (Ultra-Processed Foods) నియంత్రణతో పాటు, ఆంధ్రప్రదేశ్‌లో ఫెర్రీ సేవల విస్తరణ, భద్రతా ప్రమాణాలపై రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో మంగళవారం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖను ప్రశ్నిస్తూ, అధిక చక్కెర కలిగిన అల్ట్రా ప్రాసెస్డ్ ఆహారాల వినియోగం వల్ల పెరుగుతున్న జీవనశైలి వ్యాధులు, ఈ ఉత్పత్తుల తయారీ సంస్థలపై చేపట్టిన తనిఖీలు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు, ముఖ్యంగా చిన్నారులను లక్ష్యంగా చేసుకుని అధిక చక్కెర కలిగిన ఆహారాల ప్రచారం, విక్రయాల నియంత్రణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వివరాలు కోరారు. దీనికి సమాధానంగా కేంద్ర ప్రభుత్వం ఫెర్రీ సేవల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోనే ఉంటుందని, ఈ సేవల నిర్వహణకు కేంద్రం నుంచి నిధులు కేటాయించలేదని తెలిపింది. అయితే ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లాలోని ముత్యాలపాడు, గుంటూరు జిల్లాలోని హరిశ్చంద్రపురం ప్రాంతాల్లో జాతీయ జలమార్గం–4 పరిధిలో రెండు ఆధునిక వాటర్‌వే టెర్మినల్స్ అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించింది. హరిశ్చంద్రపురం టెర్మినల్ నిర్మాణ పనులు ఇప్పటికే అప్పగించినట్లు తెలిపింది. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు మాట్లాడుతూ... ప్రజారోగ్య పరిరక్షణ, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల ప్రోత్సాహం, సురక్షితమైన రవాణా సౌకర్యాల కల్పన, మెరుగైన మౌలిక వసతుల అభివృద్ధి ప్రభుత్వాల ప్రధాన బాధ్యతలని అన్నారు. ప్రజల ఆరోగ్యం, రాష్ట్ర అభివృద్ధి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రతి అంశాన్ని పార్లమెంట్‌లో నిరంతరం ప్రస్తావిస్తూ, ఆంధ్రప్రదేశ్‌కు మరింత సహకారం అందేలా కృషి చేస్తానని తెలిపారు.

# నాయకుడు అంటే ఇలా ఉండాలి నిరూపించిన ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్

● లబ్ధిదారుడి కోసం కంప్యూటర్ ఆపరేటర్‌గా మారిన ప్రజాప్రతినిధి

● స్వయంగా ఎల్‌వోసి లెటర్ తయారు చేసి బాధితులకు అందజేత



చింతలపూడి (చైతన్యరథం): నాయకుడు అంటే ప్రజల కష్టంలో తోడుగా నిలిచేవాడు. ఆ మాటను మంగళవారం చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ చేతల్లో చూపించారు. చింతలపూడి క్యాంపు కార్యాలయానికి ఉదయం నుంచే ప్రజల తాకిడి. ప్రతి ఒక్కరి సమస్య విని, వినతి పత్రం తీసుకుంటూ క్షణం తీరిక లేకుండా ఉన్నారు. అదే సమయంలో కంప్యూటర్ ఆపరేటర్ సెలవులో ఉన్నారు. కామవరపుకోట మండలం వెంకటాపురం నుంచి వచ్చిన ఒక కుటుంబానికి LOC లేఖ అత్యవసరంగా కావాలి. "సార్ రేపు అవుతుంది" అని చెప్పే అవకాశం ఉన్నా, ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఒక్క క్షణం ఆలోచించలేదు. కుర్చీలోంచి లేచి నేరుగా కంప్యూటర్ ముందు కూర్చున్నారు. తనే స్వయంగా టైప్ చేసి, సంతకం చేసి ఆ కుటుంబానికి అందించారు. లేఖ చేతిలోకి తీసుకున్న ఆ లబ్ధిదారుల కళ్ళు చెమ్మగిల్లాయి. "ఎమ్మెల్యే మా కోసం టైప్ చేశారా... ఇది మేము కలలో కూడా ఊహించలేదు" అంటూ ఆనంద భాష్పాలు రాల్చారు. అక్కడున్న వారందరూ చప్పట్లతో అభినందించారు. "పదవి వచ్చినా ఒదిగి ఉండే నాయకుడు. ప్రజల పని కోసం ఏ పని చేయడానికైనా సిద్ధంగా ఉండే మనిషి" అని ప్రశంసించారు. "ప్రజల కష్టం నా కష్టం. వాళ్ళ కోసం ఏ పని చేయడానికైనా వెనుకాడను" అని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు.

## ప్రతి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నాం :ఎమ్మెల్యే బోడే ప్రసాద్

పెనమలూరు (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా జరుగుతున్నాయి, అదే విధంగా పెనమలూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నాం. పెనమలూరు నియోజకవర్గం, కంకిపాడు మండలం ప్రొద్దుటూరు గ్రామంలోని బీసీ కాలనీలో రూ.45 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ... గతంలో ఇదే గ్రామంలో ప్రధాన రహదారితో పాటు అంతర్గత రోడ్ల అభివృద్ధికి రూ.1.02 కోట్ల నిధులు వెచ్చించి పనులు పూర్తి చేశాం. అదనంగా పంచాయతీరాజ్, స్థానిక సంస్థల నిధుల ద్వారా మరో రూ.58 లక్షలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. జల్ జీవన్ మిషన్ కింద గ్రామానికి రూ.72 లక్షలు మంజూరయ్యాయి, దెబ్బతిన్న పైప్‌లైన్ల మరమ్మతులు, తాగునీటి సమస్యల పరిష్కారానికి అవసరమైన అన్ని పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఇంకా రాబోయే ఆగస్టు నెలలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) ద్వారా సుమారు రూ.2 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

## పేద విద్యార్థుల ఉన్నత విద్యకు అండగా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

**●సొంత నిధులతో పీ4 పథకం ద్వారా రూ.42,000 ఫీజు చెల్లించి విద్యార్థిని చదువుకు చేయూత**



విజయవాడ (చైతన్యరథం): సింగ్‌నగర్‌లోని సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుల కార్యాలయంలో కండ్రిక ప్రాంతానికి చెందిన ఉప్పులూరి సాయి శివ లాస్య శ్రీ అనే విద్యార్థిని ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యను కొనసాగించేందుకు ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు తన సొంత నిధుల నుంచి పీ-4 పథకం ద్వారా రూ. 42,000 ఫీజును అందజేసి విద్యాభ్యాసానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరం కావడం బాధాకరమన్నారు, విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు అని, ప్రతిభ ఉన్న విద్యార్థులకు అవకాశం కల్పించడం సమాజం పట్ల ప్రతి ఒక్కరి బాధ్యత అని, పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ, ఆర్థిక సమస్యలు వారి కలలకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో తన వంతు సహాయాన్ని అందిస్తున్నానని తెలిపారు. అవసరమైన ప్రతి సందర్భంలో విద్యార్థులకు అండగా ఉంటానని, విద్య ద్వారానే సమాజంలో శాశ్వత మార్పు సాధ్యమవుతుందని అన్నారు. విద్యార్థిని ఉప్పులూరి సాయి శివ లాస్య శ్రీ మరియు ఆమె కుటుంబ సభ్యులు తమ క్లిష్ట పరిస్థితిని అర్థం చేసుకుని ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫీజు కోసం రూ. 42,000 అందించి చదువును కొనసాగించే అవకాశం కల్పించిన ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావుకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు, పేద విద్యార్థుల పట్ల ఆయన చూపుతున్న సేవాభావం ఎంతో మందికి ఆదర్శమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్, దేవరపు మాల్యాద్రి, గడ్డం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపత్కాలంలో అండగా టీడీపీ ప్రమాద బీమా

**● కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా అందజేసిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ**



బాపట్ల (చైతన్యరథం): కార్యకర్తలు రూ. 100లతో తీసుకునే పార్టీ సభ్యత్వం ఆపత్కాలంలో అండగా నిలస్తుందని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ వ్యాఖ్యానించారు. మంగళవారం కర్లపాలెం మండలం నాగరాజుపాలెం గ్రామానికి చెందిన షేక్ ఖతీజాబీ, బోలాయపాలెం గ్రామానికి చెందిన పిట్టు శివశంకర్‌రెడ్డిలు ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి మంజూరైన రూ. 5 లక్షల ప్రమాద బీమాను ఎమ్మెల్యే నరేంద్ర వర్మ బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మాట్లాడుతూ... దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా కార్యకర్తల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన ఘన చరిత్ర ఒక్క టీడీపీకి మాత్రమే ఉందన్నారు. పార్టీకి కార్యకర్తలే బలం, బలగమని, పసుపు సైన్యం సంక్షేమం కోసం వందల కోట్లు వెచ్చించిన ఘనత లోకేష్‌కు దక్కుతుందన్నారు. రూ. 100తో టీడీపీ సభ్యత్వం తీసుకుంటే ఐదు లక్షల ప్రమాద భీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కళలను, కళాకారులను ప్రోత్సహించడం అందరి బాధ్యత



వినుకొండ (చైతన్యరథం): గుంటూరు నగరంలోని బృందావన్ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించిన కావూరు 15వ నాటికల సంపుటి ఆవిష్కరణ మహోత్సవ సభలో ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాటికల సంపుటిని ఆవిష్కరించి రచయితలు, నిర్వాహకులను సన్మానించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ... సమాజానికి కళలు, సాహిత్యం దిశానిర్దేశం చేసే శక్తిగా నిలుస్తాయని అన్నారు. తెలుగు నాటకరంగానికి విశిష్టమైన చరిత్ర ఉందని, ఆ సంప్రదాయాన్ని కొనసాగించేందుకు నాటక రచయితలు, కళాకారులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ప్రముఖ నాటక రచయిత కావూరి సత్యనారాయణ, ముత్తవరపు సురేష్ బాబు, సాహితీవేత్తలు, నాటకరంగ ప్రముఖులు, రచయితలు, కళాకారులు పాల్గొన్నారు.

# రైతుగా మారిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

**●గుడ్లవల్లేరులో 11 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని స్వయంగా వ్యవసాయం ప్రారంభించిన ఎమ్మెల్యే**

**● వ్యవసాయం చేయడం ఎంతో ఎంజాయ్ చేస్తున్నాను... చాలా తృప్తిగా ఉందని వెల్లడి**



గుడివాడ (చైతన్యరథం): వ్యవసాయ రంగంలో క్షేత్రస్థాయి వాస్తవాలను ప్రత్యక్షంగా అర్థం చేసుకోవాలనే లక్ష్యంతో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్వయంగా రైతు పాత్రలోకి దిగి అందరి దృష్టిని ఆకర్షించారు. వ్యవసాయ, సాగునీటి శాఖల పనితీరును మెరుగుపరచాలంటే రైతుల నిజమైన కష్టాలను అనుభవపూర్వకంగా తెలుసుకోవాల్సిందేనని భావించిన ఎమ్మెల్యే రాము ఈ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో క్వాలిటీ ఫీడ్స్ అధినేత కోగంటి ఆంజనేయులకు చెందిన గుడ్లవల్లేరు మండలం కూచికాయలపూడి గ్రామంలోని 11 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని స్వయంగా వ్యవసాయం ప్రారంభించారు. కౌలుకు తీసుకున్న భూమిలో ఎమ్మెల్యే రాము స్వయంగా నారుమడి ప్రక్రియను పూర్తి చేశారు. పొలం గట్లు మెరకచేయడం, విత్తనాలు వెదజల్లడం వంటి వ్యవసాయ పనుల్లో ఆయన స్వయంగా పాల్గొన్నారు. కౌలు రైతుల సమస్యలు, లాభనష్టాలు, ప్రభుత్వ పథకాల అమలు విధానం వంటి అంశాలను ప్రత్యక్షంగా అనుభవించి తెలుసుకోవడమే ఈ నిర్ణయం వెనుక ఉద్దేశమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రైతు కోగంటి ఆంజనేయులు కౌలుకు సంబంధించిన అధికారిక కౌలు కార్డును సిద్ధం చేశారు. ఎమ్మెల్యే రాము ఆలోచన, సంకల్పాన్ని గుడివాడలో జరిగిన కార్యకర్తల సమావేశంలో తెలుసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వయంగా ప్రశంసించారు. ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను అర్థం చేసుకుని పనిచేస్తేనే పరిపాలనలో సార్థకత ఉంటుందని ఈ చర్య ద్వారా స్పష్టమవుతుందని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కౌలు గుర్తింపు కార్డును సీఎం చంద్రబాబు ఎమ్మెల్యే రాముకు అందించారు. తాను వ్యవసాయం చేయడానికి గల కారణాలను ఎమ్మెల్యే రాము ప్రజా వేదిక కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులకు వివరించారు. గుడివాడ వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో రైతుల సమస్యలను లోతుగా అర్థం చేసుకోవాలని నిర్ణయించానని చెప్పారు. వ్యవసాయం చేయడం ఎంతో ఎంజాయ్ చేస్తున్నానని, మానసికంగా చాలా తృప్తిగా ఉందని చెప్పారు.

## ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మరెన్నో విజయాలు సాధించాలి



జగ్గయ్యపేట (చైతన్యరథం): శాసనసభ్యులు, తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ పుట్టినరోజు సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో అభిమానులు, నాయకులు ఆధ్వర్యంలో అన్నదాన, సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద దేవరబోయిన బాల, పెయింటర్ కోటి, ఏడుకొండలు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో శ్రీరాం సాయి ప్రసాద్ తనయుడు శ్రీరాం కృష్ణ నిహార్ పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో నున్న సాయి ఆధ్వర్యంలో నిర్వహించిన పేషెంట్లకు బ్రెడ్‌లు, పండ్ల పంపిణీ కార్యక్రమంలో శ్రీరాం కృష్ణ నిహార్ పాల్గొని రోగులకు బ్రెడ్‌లు, పండ్లు అందజేసి వారి ఆరోగ్య క్షేమాలను ఆకాంక్షించారు. పట్టణంలోని కొత్త రైతు మార్కెట్ వద్ద ఓర్సు పెద్ద వీరన్న, పేరయ్య, బిలాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో శ్రీరాం చిన్నబాబు తనయుడు శ్రీరాం కృష్ణ సిద్ధార్థ రాయ్ పాల్గొని అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ముస్లిం మైనార్టీ ఆధ్వర్యంలో కోదాడ వద్ద గల దుర్గాపురం మదర్సాలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## వ్యవసాయ యాంత్రీకరణకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట

**●లోక్‌సభలో ఎంపీ కేశినేని శివనాథ్ ప్రశ్నకు రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ సమాధానం**



న్యూఢిల్లీ / విజయవాడ (చైతన్యరథం): కేంద్రం అమలు చేస్తున్న వ్యవసాయ ఉప-మిషన్ యాంత్రీకరణం పథకం అమలు పై కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రి శాఖను ఆయన పార్లమెంట్ సభ్యులు కేశినేని చిన్ని ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ సమాధానం ఇచ్చారు. మంత్రి సమాధానం ప్రకారం, రాష్ట్రాలు వ్యవసాయ యాంత్రీకరణ ఉప-మిషన్‌తో పాటు వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖకు సంబంధించిన అన్ని పథకాలను కలుపుకొని ఏకీకృత వార్షిక కార్యాచరణ ప్రణాళికలను సమర్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే, వ్యక్తిగత యాజమాన్య ప్రాతిపదికన వ్యవసాయ యంత్రాలు, పరికరాల కొనుగోలుకు రైతులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గత ఐదు సంవత్సరాల లబ్ధిదారుల రాష్ట్రాల వారీ, సంవత్సరాల వారీ వివరాలు వెల్లడించారు. పథకం అమలుపై సమగ్ర ప్రభావ మూల్యాంకనాన్ని నీతి ఆయోగ్ అభివృద్ధి పర్యవేక్షణ మరియు మూల్యాంకన కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2025లో విడుదలైన అధ్యయన నివేదిక ప్రకారం, ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు అద్దె యంత్రాల లభ్యతను పెంచడం ద్వారా SMAM పథకం ఎంతో ఉపయోగకరంగా మారిందని స్పష్టం చేసింది. వ్యవసాయ యాంత్రీకరణ వల్ల ఉత్పాదకత పెరగడంతో పాటు శ్రమ వ్యయం కూడా గణనీయంగా తగ్గుతోందని నివేదిక పేర్కొంది. అలాగే, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ICAR) సమాచారం ప్రకారం, దేశంలో వ్యవసాయ విద్యుత్ లభ్యత 1971-72లో హెక్టారుకు 0.372 కిలోవాట్ల నుంచి 2021-22 నాటికి హెక్టారుకు 3.045 కిలోవాట్లకు పెరగడం వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ వేగంగా విస్తరిస్తోందనడానికి నిదర్శనమని కేంద్ర ప్రభుత్వం వివరించింది.

## మహిళల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక చొరవ

గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం నిర్వహించిన మహిళా గ్రీవెన్స్ కార్యక్రమంలో మహిళల నుంచి పలు వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు స్థల వివాదాలు, పెన్షన్లు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల జారీ, సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సిరిపురపు అనురాధ అనే మహిళ తన రేషన్ కార్డులో కారు ఉన్నట్లు నమోదైందని, దానివల్ల సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటూ ఆ నమోదును తొలగించాలని కోరారు. మరో మహిళ కుటుంబ ఆర్థిక పరిస్థితిని వివరించి ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేయగా, ఇంకొకరు టిడ్కో ఇల్లు మంజూరు చేయాలని కోరారు. శ్రీనివాసరావుపేటకు చెందిన మహిళ జీవనోపాధి కోసం తోపుడు బండి మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

# కూటమి ప్రభుత్వ సంక్షేమ విజయాలను ప్రతి ఇంటికి చేరవేయాలి

**●జులై 27 నుండి నిర్వహించే డోర్ టు డోర్ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, పార్టీ శ్రేణులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలి**



కనిగిరి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేసేందుకు జూలై 27 నుండి చేపట్టే డోర్ టూ డోర్ కార్యక్రమంలో "కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమం–అభివృద్ధిని ప్రతి ఇంటికి తీసుకుని వెళ్లే విధంగా "కూటమి విజయాలు – ఇంటింటికీ" ప్రచార కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు అందరూ విజయవంతం చేయాలని ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు మరియు కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు, కార్మికులు, పేద కుటుంబాల సంక్షేమమే లక్ష్యంగా అనేక ప్రజాహిత కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, దీపం––2 పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.5కే అన్న క్యాంటీన్లు, ఎన్టీఆర్ వైద్య సేవలు, పేదలకు గృహ నిర్మాణ కార్యక్రమాలు, చేనేత మరియు గీత కార్మికులకు ప్రోత్సాహక పథకాలు, మత్స్యకారులు, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం వంటి సంక్షేమ కార్యక్రమాలు ప్రతి కుటుంబానికి భరోసాగా నిలుస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, పార్లమెంట్ కమిటీ సభ్యులు, అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు, వివిధ నామినేటెడ్ పదవుల్లో ఉన్న పార్టీ సభ్యులు, క్లస్టర్– యూనిట్– బూతు ఇంఛార్జ్ లు, మహిళలు, పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలని, సంక్షేమ పథకాల వల్ల కలుగుతున్న ప్రయోజనాలను తెలియజేయాలని సూచించారు. అలాగే ప్రజల సమస్యలు, సూచనలను తెలుసుకొని వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం ఒంగోలు పార్లమెంట్ కమిటీ సభ్యులతో కలిసి వెళ్ళి నూతనంగా నిర్మించే జిల్లా టిడిపి కార్యాలయాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు షేక్ ఆరిఫా, కార్యనిర్వాహక కార్యదర్శులు గార్లపాటి శ్రీనివాసరావు, కసుకుర్తి అంకరాజు, కార్యదర్శి తంజావూరి శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు అభివృద్ధి ఆలోచనలు.. జగన్ విధ్వంస విధానాల మధ్య 'స్థానిక' పోరు

**●మైదవోలు, బుక్కాపురం గ్రామాల్లో రూ.23 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి**



చిలకలూరిపేట (చైతన్యరథం): జగన్.. వైసీపీ నేతలు, వారి తొత్తుగా మారిన అవినీతి మీడియా, పేటీఎమ్ బృందం, చిన్నచిన్న విషయాల్ని కూడా గోరంతలు కొండంతలు చేస్తూ అభివృద్ధి నిరోధక శక్తులుగా వ్యవహరిస్తున్నారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారంలో ఉన్నప్పుడు జే ట్యాక్స్‌తో పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తల్ని భయపెట్టిన జగన్.. నేడు తన గోబెల్స్ ముఠా దుష్ప్రచారంతో పెట్టుబడిదారులు, పెట్టుబడుల్ని అడ్డుకుంటూ, చంద్రబాబు... లోకేశ్‌ల కష్టాన్ని నీరుగార్చే ప్రయత్నాల్ని నిరంతరం కొనసాగిస్తున్నాడని ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం యడ్లపాడు మండలం మైదవోలు, నాదెండ్ల మండలం బుక్కాపరం గ్రామాల్లో పర్యటించిన ప్రత్తిపాటి, స్థానిక నాయకులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్తిపాటి శంకుస్థాపన చేశారు. తొలుత బుక్కాపురంలో రూ.13 లక్షల సర్వశిక్షా అబియాన్ నిధులతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపనచేసిన ప్రత్తిపాటి, అనంతరం మైదవోలులో రూ.10 లక్షలతో నిర్మించే బీసీ సామాజిక భవనానికి, ఎస్సీ, బీసీ శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం రెండు గ్రామాల్లో ప్రజల్ని ఉద్దేశించి మాట్లాడారు.

### చంద్రబాబు అభివృద్ధి, జగన్ విధ్వంసం మధ్యే 'స్థానిక' పోరు

కూటమిలో ప్రధాన పక్షమైన తెలుగుదేశం.. మిత్ర పక్షాలైన జనసేన, బీజేపీలతో ఉన్న మైత్రి బంధాన్ని మరింత బలపరుచుకోవాలని, వ్యక్తిగత ప్రయోజనాల కంటే వ్యవస్థల పటిష్టతకే శ్రేణులు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రత్తిపాటి సూచించారు. అభిప్రాయబేధాలు.. మాట పట్టింపుల్ని పక్కన పెట్టి. మూడుపార్టీల శ్రేణులు ఐక్యంగా, సమిష్టిగా పనిచేస్తే గొడ్డలిపార్టీ శాశ్వతంగా కనుమరుగు అవుతుందన్నారు. జగన్ దృష్టి, ఆలోచనలు ఎప్పుడూ ప్రజల్ని, రాష్ట్రాన్ని ఎలా నాశనం చేయాలనే కోణంలోనే ఉంటాయని, ఈ వాస్తవాన్నిఇప్పటికే ఏపీ వాసులు గ్రహించారని ప్రత్తిపాటి చెప్పారు. చంద్రబాబు అభివృద్ధికి, జగన్ విధ్వంసానికి మధ్య ఉన్నతేడా ప్రజలకు పూర్తిగా అర్థమైందని, త్వరలో జరిగే స్థానిక ఎన్నికలు ఈ రెండు అంశాల రెఫరెండంగానే ఉంటాయన్నారు. రెండేళ్లలో ఏ రాష్ట్రానికి సాధ్యం కాని అభివృద్ధి, సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించిందని, దాంతో వారి నమ్మకం, విశ్వాసం పెరిగాయన్నారు. ప్రజల మనసుల్లో కూటమిపార్టీలపై ఉన్న సానుకూలత, సదభిప్రాయాన్ని స్థానిక ఎన్నికల్లో శ్రేణులు గొప్ప విజయంగా మలచాలని ప్రత్తిపాటి సూచించారు. కూటమి శ్రేణుల ఐక్యతతో వైసీపీ అభ్యర్థులు నామినేషన్ వేయడానికే వెనకడుగు వేసే పరిస్థితులు రావాలన్నారు. కుట్రలు, కుతంత్రాలు తప్ప ప్రజలు, రాష్ట్రం గురించి ఆలోచించని వైసీపీకి ఎప్పటికీ ప్రజాదరణ లభించదని ప్రత్తిపాటి తేల్చిచెప్పారు. మంత్రి నారాలోకేశ్ విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టి, సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని, వాటి ఫలితాలనే నేడు విద్యార్థులు అనుభవిస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. ప్రైవేట్ పాఠశాలల్ని తలదన్నేలా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంపై ఉపాధ్యాయులతో పాటు ప్రజలు గర్విస్తున్నారన్నారు.

# ఇజ్రాయిల్ పేటకు మహర్దశ తీసుకొస్తాం : ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): స్థానిక ఇజ్రాయిల్ పేటలోని ప్రతి వీధిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక 22వ డివిజన్లోని ఇజ్రాయిల్ పేట, గాంధీనగర్ ఆర్టీసీ కాలనీ, వెంకటరావు నగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే నసీర్ క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో ఎమ్మెల్యే నసీర్ మాటామంతీ కలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ సేవలు ఎలా అందుతున్నాయి ? శానిటేషన్ సక్రమంగా ఉందా ? వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కనీసం అభివృద్ధికి నోచుకోని ఇజ్రాయిల్ పేటలో రోడ్లు డ్రెయిన్ల నిర్మాణాన్ని మరో 15 నుంచి 20 రోజుల్లో చేపట్టనున్నామని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. ఇప్పటికే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సుమారు 100 కోట్ల రూపాయలతో అన్ని ప్రాంతాలలో రోడ్లు, డ్రెయిన్లు, వాటర్ పైప్ లైన్ల నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న పనులు వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించబోతున్నామని అన్నారు. ప్రజలకు తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నామని, క్షేత్రస్థాయిలో ఏ సమస్య వచ్చినా కూటమి నాయకుల వద్దకుగానీ, తన వద్దకుగానీ వచ్చి సంప్రదించవచ్చని ప్రజలకు సూచించారు. కూటమి ప్రభుత్వం అంటేనే అభివృద్ధికి బ్రాండ్ మార్క్ అనిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ స్పష్టం చేశారు.

# కూటమి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికీ చేర్చడమే లక్ష్యం

**●టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామ్ ప్రసాద్**



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరిలోని తెలుగుదేశంపార్టీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన యూనిట్ ఇన్‌చార్జ్‌ల శిక్షణా తరగతుల్లో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ, కార్పొరేషన్ చైర్మన్ కె. బుచ్చిరామ్ ప్రసాద్ పాల్గొని, పార్టీ బలోపేతంలో కార్యకర్తల పాత్ర, ప్రజలతో మమేకమయ్యే విధానం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లే కార్యాచరణపై కీలక మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముక. యూనిట్ ఇన్‌చార్జ్‌లు పార్టీకి గ్రామస్థాయిలో ప్రతినిధులుగా పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేయడం ప్రతి కార్యకర్త బాధ్యత" అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు సమగ్రంగా వివరించి ప్రతి లబ్ధిదారునికి చేరేలా కృషి చేయాలి. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి పార్టీ తరఫున కృషి చేయాలి. సమాజంలోని అన్ని వర్గాలకు, ముఖ్యంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా పార్టీ శ్రేణులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. సేవాభావం, క్రమశిక్షణ, ప్రజల పట్ల అంకితభావంతో పనిచేస్తూ తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠను మరింత పెంచాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పార్టీ నాయకులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన యూనిట్ ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమాన్ని ఇంటింటికీ చేర్చాలిసిన బాధ్యత యూనిట్ ఇన్‌ఛార్జ్‌లదే బాధ్యత అని బుచ్చిరామ్ ప్రసాద్ తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్

**● ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు**



ఒంగోలు (చైతన్యరథం): ఒంగోలు నగరంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన "ప్రజాదర్బార్" కార్యక్రమంలో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. నియోజకవర్గం నుంచి వచ్చిన ప్రజలు, నాయకులు తమ సమస్యలను శాసనసభ్యులు దృష్టికి తీసుకురాగా, ప్రతి అర్జీని పరిశీలించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంగళవారం ప్రజల నుండి 86 అర్జీలను స్వీకరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమం తమ ప్రభుత్వానికి రెండు కళ్లు లాంటివని పేర్కొంటూ, రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటూనే, రాష్ట్ర అభివృద్ధికి అనేక కీలక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలు ఎలాంటి ఆలస్యం లేకుండా పరిష్కారమయ్యేలా సంబంధిత శాఖల అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేసి, ప్రతి వినతిపత్రంపై సానుకూల చర్యలు తీసుకుంటామని శాసనసభ్యులు వారు స్పష్టం చేశారు.

# సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం : కందుల విఘ్నేశ్‌రెడ్డి



మార్కాపురం (చైతన్యరథం): పేద కుటుంబాలు వైద్యంకోసం దరఖాస్తు చేసిన వెంటనే సీఎం నిధులు మంజూరు చేస్తున్నారని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి కుమారుడు విఘ్నేశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం మార్కాపురం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా భూపతిపల్లి, బొందలపాడు, రాయవరం, గోగులదిన్నె గ్రామాల్లో పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశం అయ్యారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన వారికి సీఎం సహాయనిది చెక్కులను పంపిణీ చేశారు. రాయవరం గ్రామానికి చెందిన అమ్మిక వీరాస్వామికి రూ.45,786, తమ్మిశెట్టి రామ్మోహన్ రూ.41,269, దూదేకుల ఖాసీం సాహెబ్ రూ.45,300 మేరకు చెక్కులు అందజేశారు. పేదలు, అవసరాల్లో ఉన్నవారికి ప్రభుత్వం సహాయం తక్షణమే అందేలా కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు.

# చదువే విద్యార్థులకు విలువైన ఆస్తి

## ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

**●పామిడిలో కేజీబీవీ బాలికల జూనియర్ కళాశాల ప్రారంభోత్సవం**



పామిడి (చైతన్యరథం): చదువే విద్యార్థులకు విలువైన ఆస్తి అని ఆలూరు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వ్యాఖ్యానించారు. మంగళవారం పామిడిలో కేజీబీవీ బాలికల జూనియర్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన తన తనయుడు యువనేత, పామిడి, గుత్తి టీడీపీ ఇన్‌ఛార్జ్ గుమ్మనూరు ఈశ్వర్‌తో కలిసి హాజరయ్యారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి నూతన బాలికల కళాశాలను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ప్రారంభించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం పాఠశాలలో కలియతిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చేపడుతున్న సంస్కరణల ఫలితంగా విద్యా వ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. విద్యార్థులు బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడానికి నారాలోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారని, పేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో పాఠశాలలో సన్న బియ్యంతో రుచికరమైన భోజనం, పౌష్టికాహారం అందిస్తున్నారని అన్నారు. నేడు రెండో విడత తల్లికి వందనం నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం నిధులు జమ చేయడం జరుగుతుందన్నారు. పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యాను అభ్యసించాలని, తల్లిదండ్రులకు, పాఠశాలకు, ఉపాధ్యాయులకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే జయరాం కోరారు. చదువే నిజమైన ఆస్తి అని ప్రతి విద్యార్థి ఉన్నత విద్యాను అభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిన్నారుల సంక్షేమమే... అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యం



మంత్రాలయం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తున్న ఎలక్ట్రిక్ (ఇండక్షన్) స్టవ్‌లు మరియు వాటికి అనుకూలమైన స్టీల్ వంట పాత్రలను మంత్రాలయం నియోజకవర్గంలోని 215 అంగన్‌వాడీ కేంద్రాలకు మంత్రాలయం సొసైటీ చైర్మన్ ఎన్.రామకృష్ణారెడ్డి ఉచితంగా పంపిణీ చేశారు. మంత్రాలయం టీడీపీ ఇన్‌ఛార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి మరియు చిన్నారుల సంక్షేమం కోసం మరో కీలక ముందడుగు పడింది. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ... చిన్నారులకు అందించే పౌష్టికాహారం మరింత సురక్షితంగా, పరిశుభ్రంగా, ఆధునిక వంట సదుపాయాలతో అందేలా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి మరో గొప్ప అడుగు అని అన్నారు. చిన్నారుల ఆరోగ్యం మరియు అంగన్‌వాడీల అభివృద్ధి కోసం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటం ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు.

# విద్యతోనే ఉజ్వల భవిత: ఎమ్మెల్యే సోమిరెడ్డి

సర్వేపల్లి (చైతన్యరథం): విద్యతోనే ఉజ్వల భవిత సాధ్యమని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం పొదలకూరులోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులకు సోమిరెడ్డి చేతుల మీదుగా ట్రంకుపెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, బెడ్ షీట్లు, కార్పెట్లు, టవళ్లు, స్వెటర్లు తదితర వస్తువుల పంపిణీ చేశారు. అనంతరం సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ స్కూళ్లు, హాస్టళ్లలో వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యమిస్తోంది. సర్వేపల్లి నియోజకవర్గంలో హాస్టళ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు సీఎస్ఆర్ ఫండ్ కూడా వినియోగిస్తున్నాం. ఎస్ఈజెడ్ సీఎస్ఆర్ నిధులతో పొదలకూరులో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయించామని, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు హాస్టళ్లు, స్కూళ్ల ఆవరణలోనూ లైట్లు ఏర్పాటు చేయించడం సంతోషంగా ఉందన్నారు. బాలికల వసతిగృహం ఆవరణలో కిసాన్ క్రాఫ్ట్ సంస్థ 14 మరుగుదొడ్లను నిర్మించింది. నియోజకవర్గ వ్యాప్తంగా హాస్టళ్ల మరమ్మతులకు రూ.78 లక్షలు మంజూరు చేయించాం. గొలగమూడి బీసీ గురుకులంలో ఈ విద్యాసంవత్సరం నుంచి జూనియర్ కళాశాల ప్రారంభించుకున్నామని, పొదలకూరు ఎస్సీ హాస్టల్ నిర్మాణానికి రూ.3 కోట్లతో ప్రతిపాదనలు పంపామని, వసతి గృహాల నిర్మాణం, వసతుల కల్పన కోసం ఇప్పటి వరకు 4.60 కోట్లు మంజూరు కాగా, మరో 7 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. త్వరలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

# ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నాం.. ప్రజలు దాన్ని గుర్తించాలి

**●నామాలలో సి.సి రోడ్లు ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత**

**●రెండేళ్లలో రూ.100 కోట్ల ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ నిధులతో రోడ్లు వేశాం**

**●నేడు తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు అందిస్తామని వెల్లడి**



రాప్తాడు (చైతన్యరథం): ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని.. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి వచ్చే స్థానిక సంస్థల్లో ప్రజలు ఓట్లు వేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండి పంచాయితీ నామాల గ్రామంలో రూ.50లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆమె ప్రారంభించారు. ముందుగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతకు గ్రామస్థులు, టీడీపీ నాయకులు భారీ స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ప్రదర్శనగా వెళ్లి నూతన రోడ్లను ప్రారంభించారు. మార్గమధ్యలో గ్రామస్తులు పూలవర్షం కురిపిస్తూ అభిమానం చాటుకున్నారు. గ్రామస్థులు ఎమ్మెల్యే సునీతకు కొన్ని విజ్ఞప్తులు చేశారు. అంగన్వాడీ పాఠశాలకు ఒక నూతన భవనం, గొల్లవాండ్లపల్లి గ్రామంలో రోడ్డు, ప్యాదిండిలో సచివాలయం కావాలని కోరారు. వీటిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో సుమారు 100కోట్ల ఎన్ఆర్ఈజీఎస్, ఎంపీ నిధులు, జిల్లా పరిషత్ నిధులతో సిసి, బిటి రోడ్లు వేశామన్నారు. చెన్నేకొత్తపల్లి మండలంలో సుమారు 25 కోట్లతో రోడ్లు వేసినట్లు తెలిపారు. ప్యాదిండి పంచాయితీలో 1.50 కోట్లతో రోడ్లు వేశామన్నారు. నామాల గ్రామంలో 75 లక్షలతో సిసి రోడ్లు వేయడంతో పాటు గ్రామంలో అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. ఇంకా కొన్ని గ్రామాల్లో రోడ్లు, బ్రిడ్జిలు, సచివాలయాలు ఇతర వాటిని అడిగారని... త్వరలోనే వాటిని కూడా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రాధాన్యత వారీగా అన్ని గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. గత ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక విధ్వంసం కారణంగా అన్ని పనులు ఒకేసారి చేయలేకపోతున్నామని.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో అనుభవంతో వాటన్నింటిని చక్కదిద్దుతూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు బుధవారం రోజు తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి 15వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. గతంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలకు పిల్లలకు తల్లికి వందనం అందేది కాదన్నారు. తక్కువ వేతనాలు ఉన్నవారికి ఇలాంటి పథకం అందకపోతే నష్టపోతారన్న ఉద్దేశంతో తాను కూడా అసెంబ్లీలో దీని గురించి మాట్లాడానన్నారు. ఈ ఏడాది నుంచి అంగన్వాడీ సిబ్బందికి కూడా తల్లికి వందనం అందుతుందన్నారు. ఈ ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రతి ఒక్కరు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామస్తులంతా ఐక్యంగా ఉండి ఒక మంచి వ్యక్తిని ఎన్నుకోవాలని సూచించారు. రెండేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, గత ఐదేళ్లలో జరిగిన వాటిని ప్రజలే గమనించాలని ఎమ్మెల్యే సునీత సూచించారు.

# చెత్త రహిత కార్పోరేషన్‌గా అనంతపురం : ఛైర్మన్ పట్టాభిరాం

**●త్వరలో రూ.17.50 కోట్లతో ఫ్రెష్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్**



అనంతపురం (చైతన్యరథం): అనంతపురం మున్సిపల్ కార్పోరేషన్‌ని చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దుతామని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ చెప్పారు. అనంతపురం నగరంలోని గుత్తి రోడ్‌లోని మున్సిపల్ డంపింగ్ యార్డ్‌ను వీరిద్దరూ సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... అనంతపురం నగరంలో ఎన్నో ఏళ్లగా ఉన్న చెత్త సమస్యను రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పరిష్కరించనున్నట్లు తెలిపారు. నగరంలోని డంపింగ్ యార్డ్‌ను మొత్తం క్లియర్ చేసి ఒక ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇక్కడి డంపింగ్ యార్డ్‌లో దాదాపుగా 3,78,481 మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందని తెలిపారు. దానిని క్లియర్ చేయటం కోసం రెండు ప్యాకేజీలుగా టెండర్లు పిలిచి, ఆమోదించినట్లు చెప్పారు. ప్రస్తుతం చెత్త తొలగింపు పనులు కూడా వేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం రూ.17.50 కోట్ల రూపాయలతో రోజుకు 170 మెట్రిక్ టన్నుల వేస్ట్ ను ప్రాసెస్ చేసే ప్లాంటును స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు నిధులు కూడా సిద్ధం చేసినట్లు తెలిపారు. ఏ రోజు చెత్తను ఆ రోజు ప్రాసెస్ చేసే ప్లాంట్ ఏర్పాటు చేయుటకు అవసరమైన స్థలాన్ని ముందుగా సేకరించి, ఆగస్టు 15వ తేదీ నాటికి ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి రోజూ దాదాపు 150 మెట్రిక్ టన్నుల చెత్త నగరం నుంచి వస్తుందని, అది లెగసీ వేస్ట్‌లో కలవకుండా ఉండటం కోసం వేరే ఒక ప్రదేశాన్ని కూడా గుర్తించడం జరిగిందన్నారు. అక్కడున్న పాత నిర్మాణాలను తొలగించి, ప్రతిరోజు వచ్చిన చెత్తను, లెగసీ వేస్ట్ అంతా కూడా జిగ్మ, తరుణి అనే రెండు ఏజెన్సీ ద్వారా క్లియర్ చేయిస్తామని చెప్పారు. ప్రతిరోజు 4 వేల టన్నుల చెత్త ప్రాసెస్ చేసే యంత్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. వీక్లీ టార్గెట్ పెట్టుకుని ఇక్కడ మిగిలిన చెత్తను అక్టోబర్ 2వ తేదీ లోపల క్లియర్ చేస్తారన్నారు.

**డంపింగ్ యార్డ్ పరిశీలన**

ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ డంపింగ్ యార్డ్ మొత్తం తిరిగి పరిశీలించారు. ఈ కార్యక్రమానికి ముందు నగరపాలక సంస్థ కార్యాలయంలో మునిసిపల్ సిబ్బంది, పారిశుద్ధ కార్మికులతో పట్టణంలో చేపట్టాల్సిన పారిశుధ్య కార్యక్రమాలపై స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌లు పలు అంశాలపై అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ డైరెక్టర్లు పర్వీన్ భాను, భవాని రవికుమార్, మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావు, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

బనగానపల్లె (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సూచించారు. నేడు బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను మంత్రి స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం అభివృద్ధితో కూడిన సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అన్నారు. బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. న్యాయబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్ లో మాట్లాడి పరిష్కరించారు. ఈ అర్జీలు స్వీకరణ కార్యక్రమంలో ఆయా సమస్యలపై మంత్రి స్పందించిన తీరుతో బాధితుల నుంచి



ఆనందం వ్యక్తం అవుతుంది. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు.

# శాన్‌ఫ్రాన్సిస్కోలో M4M విజయోత్సవం

## M4M-2 సీక్వెల్‌ను అధికారికంగా ప్రకటించిన దర్శక-నిర్మాత మోహన్ వడ్లపట్ల




**శాన్‌ఫ్రాన్సిస్కో:** అమెరికాలో ఘన విజయం సాధించి విజయవంతంగా ప్రదర్శితమవుతున్న సైకాలజికల్ థ్రిల్లర్ చిత్రం M4M (మోటివ్ ఫర్ మర్డర్) 60 రోజుల విజయోత్సవ వేడుకలు శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియాలోని 'సినీ లౌంజ్'లో జరిగాయి. ఈ ప్రత్యేక కార్యక్రమంలో చిత్ర దర్శకుడు-నిర్మాత మోహన్ వడ్లపట్ల, కథా నాయకి జో శర్మ కేక్ కట్ చేశారు. ఈ విజయవంతమైన చిత్రానికి సీక్వెల్‌గా M4M-2 తీసుకొస్తున్నట్టు అధికారికంగా ప్రకటించారు. ఈ వేడుకకు అభిమానులు, ప్రవాసాంధ్ర కమ్యూనిటీ నాయకులు, సినీ ప్రముఖులు, మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

దర్శక-నిర్మాత మోహన్ వడ్లపట్ల మాట్లాడుతూ... 'M4M చిత్రానికి ప్రేక్షకులు అందించిన ఆదరణే ఈ విజయానికి మూలకారణం. నటీనటులు, సాంకేతిక నిపుణులు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు, మీడియా అందించిన అపూర్వ సహకారం వల్లే ఈ మైలురాయిని చేరుకోగలిగాం. ప్రేక్షకుల్లో పెరిగిన నమ్మకం మాపై బాధ్యతను మరింత పెంచింది. అదే ఉత్సాహంతో మొదటి భాగాన్ని మించిన ఉత్కంఠ, ఊహించని మలుపులు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో M4M-2ని భారీ స్థాయిలో రూపొందిస్తున్నాం" అని తెలిపారు.

మొదటి భాగంలో తన నటనతో ప్రేక్షకుల మెప్పు పొందిన కథా నాయకి జో శర్మ మాట్లాడుతూ... "ఈ చిత్రానికి ఆదరణ అందించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. M4M-2 సీక్వెల్‌లో మరింత శక్తివంతమైన పాత్రలో కనిపించబోతు న్నాను. ప్రేక్షకులకు మరోక థ్రిల్లింగ్ అనుభూతిని అందించడానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని హర్షం వ్యక్తం చేశారు.

ఈ అధికారిక ప్రకటనతో M4M ఫ్రాంచైజీకి కొత్త అధ్యాయం ప్రారంభమైందని... సీక్వెల్‌కు సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని చిత్ర బృందం తెలిపింది.

# ఉమ్రా యాత్రికులకు

## సౌదీ ప్రభుత్వం తీపి కబురు



- ఏడాది కాలపరిమితితో 'మల్టిపుల్ ఎంట్రీ వీసా' అందుబాటులోకి
- 'నుసుక్' యాప్ ద్వారా అనుమతి
- నిబంధనలు స్పష్టం చేసిన హజ్, ఉమ్రా మంత్రిత్వ శాఖ

**మక్కా:** ఉమ్రా యాత్రికులకు మరింత సౌలభ్యం కల్పించేందుకు సౌదీ అరేబియా హజ్, ఉమ్రా మంత్రిత్వ శాఖ సరికొత్త నిర్ణయం తీసుకుంది. ఒక సంవత్సరం కాలపరిమితి కలిగిన 'మల్టిపుల్ ఎంట్రీ ఉమ్రా వీసా'ను అందుబాటులోకి తెచ్చినట్టు వెల్లడించింది. ఈ నూతన విధానం ద్వారా యాత్రికులు ఏడాది వ్యవధిలో పలుమార్లు సౌదీ అరేబియాలో ప్రవేశించే అవకాశం లభిస్తుంది.

### ముఖ్య నిబంధనలు & మార్గదర్శకాలు

**చెల్లుబాటు:** వీసా జారీ చేసిన తేదీ నుంచి 365 రోజుల పాటు (ఒక సంవత్సరం) అమల్లో ఉంటుంది.

**స్టే పరిమితి:** వీసా వ్యవధిలో ఎన్నిసార్లయినా దేశంలోకి ప్రవేశించవచ్చు. అయితే అన్ని సందర్శనలు కలిపి మొత్తం 90 రోజులు మాత్రమే సౌదీలో ఉండేందుకు అనుమతి ఉంటుంది.

**హజ్ సీజన్ మినహాయింపు:** 'హజ్ సీజన్'లో ఈ మల్టిపుల్ ఎంట్రీ ఉమ్రా వీసాతో సౌదీలోకి ప్రవేశించడానికి అనుమతి ఉండదు.

### అనుమతులు పొందడం ఎలా...

యాత్రికులు వీసా పొందడానికి 'నుసుక్' (Nusuk) ప్లాట్‌ఫామ్‌లో నమోదైన గుర్తింపు పొందిన సేవా సంస్థ ద్వారా ప్రత్యేక సేవా ప్యాకేజీ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ప్రతి సందర్శనకు ముందు నుసుక్ యాప్ ద్వారా ప్రత్యేకంగా ఉమ్రా అనుమతి తీసుకోవడం నిర్బంధం. ఈ అనుమతి తేదీలు బుక్ చేసుకున్న సేవా ప్యాకేజీకి అనుగుణంగా ఉండాలి.

### వీసా తాత్కాలిక నిలిపివేత-పునరుద్ధరణ

ప్రతి విజిట్ పూర్తయి యాత్రికుడు సౌదీ నుంచి బయల్దేరగానే వీసా తాత్కాలికంగా నిలిపివేయబడుతుంది. తదుపరి సందర్శనకు అవసరమైన నిబంధనలు పూర్తి చేసిన తర్వాత అది మళ్లీ ఆటోమేటిక్‌గా అమల్లోకి వస్తుంది. వీసాలో మిగిలి ఉన్న రోజులను గడువు ముగిసే వరకు తర్వాత పర్యటనల్లో ఉపయోగించుకోవచ్చని సౌదీ ప్రభుత్వం స్పష్టం చేసింది.

# నేటి నుంచి యూఏఈలో 'అల్‌హింద్' ద్వారా భారత కాన్సులర్, పాస్‌పోర్ట్ సేవలు

**అబుదాబి:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో భారతీయులకు కాన్సులర్, పాస్‌పోర్ట్, వీసా, అటెస్టేషన్ సేవలను బుధవారం నుంచి అల్‌హింద్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ద్వారా అందిస్తామని అబుదాబిలోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. ఈ సేవలు యూఏఈ వ్యాప్తంగా ఏర్పాటుచేసిన 16 ఇండియన్ కాన్సులర్ అప్లికేషన్ సెంటర్ల ద్వారా అందుబాటులో ఉంటాయి.

సేవలు పొందాలనుకునే వారు http://consularsevainuae.com వెబ్‌సైట్‌లో ముందుగా ఆన్‌లైన్ ద్వారా అపాయింట్‌మెంట్ బుక్ చేసుకోవాలని రాయబార కార్యాలయం సూచించింది. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు, రాత్రి



9 గంటలకు అపాయింట్‌మెంట్ స్లాట్లు విడుదల చేస్తారు. అన్ని ఐసీఏసీ కేంద్రాలు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పని చేస్తాయి. అపాయింట్‌మెంట్ సమయానికి 15 నిమిషాల ముందు మాత్రమే కేంద్రంలోకి ప్రవేశానికి అనుమతి ఉంటుంది. అయితే తత్కాల్ పాస్‌పోర్ట్ సేవలు, నవజాత శిశువుల దరఖాస్తులు, ఎమర్జెన్సీ సర్టిఫికెట్, 60 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లకు అన్ని కేంద్రాల్లో వాక్-ఇన్ విధానంలో... ముందుగా వచ్చిన వారికి ముందుగా సేవలు అందిస్తామని ప్రకటించింది.

అల్‌హింద్ సంస్థ వ్యాట్ కలిపి Dh19 సేవా రుసుము వసూలు చేయనుంది. ఇది భారత ప్రభుత్వం నిర్ణయించిన అధికారిక ఫీజులకు అదనంగా ఉంటుంది. ఈ రుసుములో దరఖాస్తు ఫారం నింపడం, ఫొటోగ్రాఫ్, డాక్యుమెంట్ టైపింగ్, దేశీయ కొరియర్, ప్రింట్‌ఔట్లు, ఫొటో కాపీలు వంటి అనుబంధ సేవలు కూడా ఉంటాయి. పూర్తి ఫీజుల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని భారత రాయబార కార్యాలయం తెలిపింది.

# క్రీడల్లో కార్తీక్ మెరుపులు

## బాస్కెట్‌బాల్, స్విమ్మింగ్‌ల్లో రాణిస్తున్న కార్తీక్ కృష్ణస్వామి

### తాత పద్మనాభం వారసత్వాన్ని నిలబెడుతున్న మనవడు



**శాన్‌ఫ్రాన్సిస్కో:** అమెరికాలో స్థిరపడిన కాకినాడ యువకుడు కృష్ణస్వామి కార్తీక్ పద్మనాభం క్రీడా రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తూ తన తండ్రి జన్మభూమికి, మాతృ దేశానికి ఎనలేని గుర్తింపు తీసుకొస్తున్నాడు. కాకినాడకు చెందిన సీనియర్ క్రీడాకారుడు, ఒలింపిక్ సంఘం మాజీ కార్యదర్శి కె.పద్మనాభం-యమున దంపతుల కుమారుడు రామకృష్ణ. సాఫ్ట్‌వేర్ ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడిన రామకృష్ణ-పద్మజ దంపతులకు 2005లో కార్తీక్ జన్మించాడు. తాతయ్య పద్మనాభం క్రీడా రంగానికి అందించిన సేవలను వారసత్వంగా పుణికిపుచ్చుకున్న కార్తీక్ చిన్నతనం నుంచే ఆటలపై మక్కువ పెంచుకున్నాడు. అతడి ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు అమెరికాలోనే స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్ శిక్షణ ఇప్పించారు.



ఈ రెండు అంశాల్లో నైపుణ్యం సాధించిన కార్తీక్ శాన్‌ఫ్రాన్సిస్కో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించి పలు పతకాలు సాధించాడు.

పదేళ్ల వయసులో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో నిర్వహించిన మిస్ ఒలింపియాడ్ ర్యాలీలో పాల్గొని అందరి మన్ననలు అందుకున్నాడు. బాస్కెట్‌బాల్, స్విమ్మింగ్‌తో పాటు టెన్నిస్‌లో క్రీడా ప్రాథమికాంశాలను కాకినాడలోనే నేర్చుకున్నాడు.

అమెరికాలోని 'మేరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెయింట్ లూయిస్ కంట్రీ డే స్కూల్'లో 9 నుంచి 12వ తరగతి వరకు చదివిన కార్తీక్ ప్రముఖ కోచ్ ట్రవీస్ వ్యాలీస్ వద్ద బాస్కెట్‌బాల్‌లో మెరుగైన శిక్షణ తీసుకున్నాడు. తన సారథ్యంలో తొలిసారిగా 'ఇంటర్ స్కూల్ స్టేట్ పోటీల్లో' చాంపియన్‌షిప్ కైవసం చేసుకుని జట్టును విజేతగా నిలిపాడు.




## ప్రైవేట్ ఆసుపత్రికి వాంగ్‌చుక్

**- ఢిల్లీ హైకోర్టు గ్రీన్ సిగ్నల్**

న్యూఢిల్లీ: విద్యా వ్యవస్థలో వైఫల్యాలపై మూడు వారాలకు పైగా నిరాహార దీక్ష చేస్తోన్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించేందుకు ఢిల్లీ హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆయన ఆందోళనను విస్మరించలేమని అభిప్రాయపడింది. సర్దార్ జంగ్ ఆసుపత్రి నుంచి మేదాంత ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు అంగీకరించింది. ఈ నిర్ణయంపై వాంగ్‌చుక్ భార్య గీతాంజలి ఆంగ్మో హర్షం వ్యక్తం చేశారు.

వాంగ్‌చుక్ ఆరోగ్యం విషమించే ప్రమాదం ఉందని.. ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాలని ఆయన భార్య గీతాంజలి వేసిన పిటిషన్‌పై హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. ఆయనను ప్రైవేటు ఆసుపత్రికి ఎందుకు తరలించకూడదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను కోర్టు ప్రశ్నించింది. దీనిపై కేంద్రానికి ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన తెలిపారు. దీంతో వాంగ్‌చుక్‌ను ప్రైవేటు ఆసుపత్రికి తరలించేందుకు ఢిల్లీ హైకోర్టు అనుమతించింది.

నీట్ పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌పై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన ఆందోళనలో భాగంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 21 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న వాంగ్‌చుక్‌ను ఈ నెల 18వ తేదీన పోలీసులు బలవంతంగా ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసిందే. ఆసుపత్రిలో కూడా ఆయన దీక్ష కొనసాగిస్తున్నారు.

## టన్నెల్‌లో చిక్కుకుని 10 మంది మృతి



గ్యాంగ్‌టక్: సిక్కింలో ఘోర ప్రమాదం జరిగింది. నామ్చి జిల్లాలోని సమ్‌ంగ్ సైట్లో కొండచరియలు విరిగిపడటంతో నిర్మాణంలో ఉన్న టన్నెల్ ప్రవేశ మార్గం మూసుకుపోయింది. ఈ ప్రమాదంలో పది మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు శిథిలాల్లో చిక్కుకుపోయారు. కొండచరియలు విరిగిపడటంతో మీథేన్ గ్యాస్ లీకేజీ కారణంగా సహాయకచర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు వెల్లడించారు. టన్నెల్ లోపల చిక్కుకున్నవారిని బయటకు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తుండగా.. గ్యాస్ వల్ల సహాయ సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. కొందరు స్పృహ కోల్పోతున్నారు. కొండచరియల తీవ్రత కారణంగా భూగర్భ పొరలు నుంచి ఈ వాయువు సహజంగా వెలువడుతోందని అధికారులు భావిస్తున్నారు.

# నీట్ లీకేజీ ఘోర పాపం

- బాధ్యులను కఠినంగా శిక్షిస్తాం
- విద్యార్థులను రెచ్చగొట్టొద్దు
- ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ: నీట్ లీకేజీ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. పేపర్ లీక్ ఘోర పాపమని, ఇలాంటివి మళ్లీ జరగకూడదని అన్నారు. బాధ్యులకు కఠిన శిక్ష విధించాలని, ఇలాంటి లీక్‌లను నివారించడం జాతీయ బాధ్యత అని పేర్కొన్నారు. 'మంగళ్ మిలన్' పేరిట మంగళ వారం జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఈమేరకు ప్రధాని మాట్లాడారు. ఈ సమావేశం అనంతరం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మీడియాతో మాట్లాడారు. ఈభేటీలో ప్రధాని మోదీతో చర్చించిన విషయాలను మీడియాకు వెల్లడించారు. ఈ లీక్ కారకులకు శిక్షపడేలా చర్యలు తీసుకున్నామని, నిందితులను జైల్లో పెట్టామని ప్రధాని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.విద్యార్థులకు నష్టం కలగకుండా రీ నీట్ నిర్వహించామని తెలిపారు. నీట్ పరీక్షా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

నీట్ పేపర్ లీక్ అంశం వెలుగులోకి వచ్చిన వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈకేసులో ఇప్పటికే 13 మందిని అరెస్టు చేసి జైలుకు పంపించినట్లు చెప్పుకొచ్చారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నీట్ పున:పరీక్ష నిర్వహణకు ప్రాధాన్యం ఇచ్చామని, ఈ ఫలితాలను కూడా ఆలస్యం లేకుండా ప్రకటించినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కఠిన చర్యలు అవసరమని ప్రధాని మోదీ అన్నారు. పేపర్ లీక్‌లను పూర్తిగా అణచివేయడానికి, నిందితులకు కఠిన శిక్షలు పడేలా దేశంలోని ప్రముఖ న్యాయవాదులను నియమించాలన్నారు.

పార్లమెంట్‌లో నిర్మాణాత్మక చర్చలు జరిగేలా విపక్షాలు సహకరించాలి. రాజకీయంగా విభేదాలు ఉండొచ్చు. కానీ దేశ భవిష్యత్తు, యువత సంక్షేమం కోసం కలిసి పనిచేయాల్సిన బాధ్యత ఎంపీలందరిపై ఉందని ప్రధాని సూచించారు. పిల్లలను రెచ్చగొట్టొద్దు. తప్పుడు మార్గంలోకి వెళ్లడం సులభం. కానీ తిరిగి సరైన మార్గంలోకి రావడం చాలా కష్టం. వారు సరైనమార్గంలో వెళ్లేలా చూసుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.

అదే విధంగా ఎన్డీఏ సమావేశంలో దేశ ఆర్థిక పురోగతి, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, ప్రభుత్వ విజయాలపై కూడా ప్రధాని సమీక్షించారు. వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న వాణిజ్య ఒప్పందాల్లో మన దేశ రైతుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రధాని స్పష్టంచేశారు.రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మాత్రమే ప్రతి ఒప్పందాన్ని రూపొందిస్తున్నామని, వారి ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ప్రధాని మోదీ స్పష్టం చేశారని కిరణ్ రిజిజు పేర్కొన్నారు.

దేశంలో ప్రధాన పోటీ పరీక్షల్లో ఒకటైన నీట్ గత మేలో నిర్వహించగా.. 'పేపర్ లీక్ ఆరోపణలతో జూన్‌లో మళ్లీ పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది. సీబీఎస్ఈ 12వతరగతిలో ఈఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ మార్కింగ్ విధానంలోనూ లోపాలు వెలుగుచూశాయి. అలాగే మరికొన్ని లీకేజీ ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో సంస్కరణలు అమలు చేయాలని డిమాండు చేస్తూ కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) సోమవారం చేపట్టిన 'చలో పార్లమెంటు'తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వేల మంది సీజేపీ మద్దతుదారులు పార్లమెంటువైపు దూసుకురావడం, బారికేడ్లను దాటి వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఢిల్లీ రణరంగాన్ని తలపించింది. ఈనేపథ్యంలోనే మోదీ స్పందించారు.

# ప్రధాని మోదీ రాజీనామా చేయాలి: రాహుల్



న్యూఢిల్లీ: నీట్ పరీక్ష పేపర్ల లీకేజీ వ్యవహారంపై ఎన్డీఏ ప్రభుత్వం జవాబుదారీతనంతో వ్యవహరించడం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర మంగళవారం రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు ధర్నా చేశారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులపై సోమవారం జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈధర్నాలో రాహుల్‌తోపాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి, కేసీ వేణుగోపాల్, ప్రియాంకా గాంధీ సహాపలువురు కాంగ్రెస్ ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు చేతులకు సంకెళ్లువేసుకుని నిరసన తెలిపారు. గూండాగిరి, నిరంకుశత్వం వద్దంటూ.. అణచివేత చర్యలునడవవంటూ నిరసనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా సందర్భంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. యువతపై లాఠీచార్జ్‌కు బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ లీకేజీపై పార్లమెంట్‌లో చర్చకు తాము అంగీకరించలేదన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో జవాబుదారీతనం లేదని పేర్కొన్నారు. ప్రధాని మోదీ మౌనం వీడాలని,నీట్ అంశంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఆందోళన చేస్తుంటే పోలీసులు దౌర్జన్యం చేస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### రాహుల్ మాట తప్పారు: కేంద్రమంత్రి జితేంద్ర సింగ్

ప్రధాని మోదీ ఇంటి దగ్గర ధర్నా చేస్తున్న రాహుల్ గాంధీ దగ్గరకు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ వెళ్లి చర్చలు జరిపారు. రాహుల్‌కు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. ఆందోళన విరమించాలని కోరారు. చర్చల్లో ఏమి జరిగిందో ఏమో.. అనంతరం ఎక్స్ వేదికగా పెట్టిన పోస్ట్‌లో రాహుల్ మాట తప్పారంటూ జితేంద్ర సింగ్ ఆక్షేపించారు. నీట్‌పై పార్లమెంట్‌లో చర్చకు సంబంధించిన విషయంలో రాహుల్ మాట తప్పారంటూ మండిపడ్డారు. ఆ పోస్టులో.. 'హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్‌తో కలిసి చర్చలు జరిపాం. నీట్‌పై పార్లమెంట్‌లో చర్చించాలని రాహుల్ డిమాండ్ చేశారు. చర్చకు సిద్ధమని ప్రభుత్వం ప్రకటించింది. మొదట అంగీకరించి తరువాత రాహుల్ మాట తప్పారు. మళ్లీ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతున్నారు. కొత్తగా రెండు డిమాండ్లు పెట్టడం.. మాట తప్పడం సరికాదు' అని పేర్కొన్నారు.

# జమ్మూకశ్మీర్‌లో వర్ష బీభత్సం

శ్రీనగర్:జమ్మూకశ్మీర్,ఉత్తరాఖండ్‌లను భారీవర్షాలు ముంచెత్తుతున్నాయి. జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లా లోరాన్ గ్రామంలో ఓ మట్టి ఇంటిపై కొండచరియలు విరిగిపడి ఒకే కుటుంబంలోని ఏడుగురు మృతిచెందారు. కుండపోత వర్షాలతో పూంఛ్, రాజౌరీ జిల్లాల్లోనే గత రెండు రోజుల్లో ఇప్పటివరకూ 17మంది మృతి చెందగా ఏడుగురు గల్లంతయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా మృతుల సంఖ్య 23కి పెరిగింది.

ఉత్తరాఖండ్లో కొండచరియలు విరిగిపడి నాలుగు జాతీయ రహదారులు సహా 150రోడ్ల మార్గాలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ముందుజాగ్రత్త చర్యగా చార్ధామ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు సోమవారం తెలిపారు.




పరిస్థితులు అనుకూలించి, రోడ్డు మార్గాలు సురక్షితంగా ఉన్నప్పుడే ఈయాత్రలు తిరిగి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. డెహ్రాడూన్, తెహ్రీ, హరిద్వార్ జిల్లాలకు వాతావరణ శాఖ 'రెడ్ అలర్ట్' జారీచేసింది. వరదల ధాటికి సరయూ నదిలో ఎనిమిదేళ్ల బాలుడు కొట్టుకుపోయాడు.జమ్మూలోనూ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. అమర్నాథ్, వైష్ణోదేవి, శివఖోరీ యాత్రలను వరుసగా రెండోరోజుకూడా అధికారులు నిలిపివేశారు. భక్తులుబేస్ క్యాంప్‌ల్లోనే ఉండాలని సూచించారు. అలకనంద, మందాకినీ నదులు ప్రమాద స్థాయికి చేరువలో ఉన్నాయి.

### అస్సాంలో పలువురి మృతి

అస్సాంలో వరదలు మరింతతీవ్రరూపం దాల్చాయి. వరద ఉధ్ధృతిలో జోర్హాట్ జిల్లాలో సోమవారం ఇద్దరు అమ్మాయిలు సహా నలుగురు కొట్టుకు పోయారు. కార్బీ ఆంగ్లాంగ్ జిల్లాలో మరో వ్యక్తి మృతి చెందారు. ఇద్దరు గల్లంతయ్యారు. పలుచోట్ల సహాయక చర్యల కోసం సైన్యం రంగంలోకి దిగింది. హెలికాప్టర్లు, పడవలతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వరదలతో రైలు సేవలకు అంతరాయం ఏర్పడింది.

# పూర్తిస్థాయి యుద్ధం చేస్తున్నాం

**- ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్**



అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణల నేపథ్యంలో పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ వేడెక్కింది. అమెరికా-ఇరాన్ మధ్య పరస్పర దాడులు, హర్మూజ్లో నౌకల రాకపోకలకు అంతరాయాలతో పశ్చిమాసియాలో ఇప్పటికే పరిస్థితులు దారుణంగా దిగజారాయి. హర్మూజ్లో కార్గో నౌకలను ఇరాన్ టార్గెట్ చేయడంతో మొదలైన అమెరికా దాడులు పదిరోజులుగా కొనసాగుతున్నాయి. ఇరాన్ డ్రోన్, క్షిపణి నిల్వలు, తీరప్రాంతంలోని నిఘా వ్యవస్థలు, నౌకాదళ సామర్థ్యాలను ధ్వంసం చేస్తోంది. ఈ క్రమంలోనే ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ దేశం ప్రస్తుతం అమెరికాతో పూర్తి స్థాయి యుద్ధం చేస్తోందని ప్రకటించారు. ప్రస్తుతం కేవలం సైనిక పరంగానే కాకుండా ఆర్థిక రంగంలో కూడా తీవ్ర పోరాటం కొనసాగుతోందని, ప్రజల జీవనోపాధిని కాపాడటం ప్రభుత్వానికి అత్యంత కీలక బాధ్యతగా మారిందని ఆయన పేర్కొన్నారు.

దేశం యుద్ధ పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రజల దైనందిన జీవితం దెబ్బతినకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పెజెష్కియాన్ పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, ప్రజల జీవన ప్రమాణాలను కాపాడడం ప్రస్తుతం అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇరాన్ వ్యాప్తంగా అమెరికా దాడులు చేస్తోందని, ఆ పరిణామాలను దేశ ప్రజలు గమనించాలని కోరారు.

ఇటీవల కొద్ది రోజులుగా అమెరికా-ఇరాన్ మధ్య వైమానిక దాడులు కొనసాగుతున్నాయి. హర్మూజ్ జలసంధి ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరగడంతో ప్రపంచ చమురు సరఫరాపై కూడా ప్రభావం పడుతోంది. అయితే యుద్ధ వాతావరణం నెలకొన్నప్పటికీ, ఉద్రిక్తతలను తగ్గించేందుకు పలు దేశాలు దౌత్యపరమైన ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. కానీ, ఇరు దేశాలు తమ తమ వైఖరిని మార్చుకోకపోవడంతో పరిస్థితి ఇంకా అనిశ్చితంగానే ఉంది.

మరోవైపు యూఎస్ స్థావరాలను ఇరాన్ టార్గెట్ చేస్తుండటంతో గల్ఫ్ దేశాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. కువైట్లోని అరిఫ్జాన్ స్థావరంపై తాము ప్రయోగించిన క్షిపణులు.. హిమార్స్ రాకెట్ వ్యవస్థను ధ్వంసం చేశాయని ఇరాన్ ప్రకటించింది. తమ మిలిటరీ వ్యవస్థలపై చేసిన దాడికి ఇది ప్రతీకార చర్య అని వెల్లడించింది. అయితే ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను తాము అడ్డుకున్నామని యూఎస్ సెంట్రల్ కమాండ్ చెప్పింది.

# అప్రమత్తంగా ఉండండి!

– విదేశాల్లోని పౌరులకు అమెరికా హెచ్చరిక



పశ్చిమాసియాలో రోజురోజుకూ ఉద్రిక్త పరిస్థితులు తీవ్రమవుతున్న నేపథ్యంలో అమెరికా విదేశాంగ శాఖ కీలక ప్రకటన చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ పౌరులకు 'వరల్డ్ వైడ్ కాషన్' పేరుతో భద్రతా హెచ్చరిక జారీ చేసింది. అమెరికన్లు విదేశాల్లో ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించింది.

పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా అమెరికా ప్రయోజనాలు, పౌరులను ప్రత్యర్థులు లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ హెచ్చరిక జారీ చేసినట్లు స్టేట్ డిపార్ట్‌మెంట్ తెలిపింది. ముఖ్యంగా అమెరికా రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలను కచ్చితంగా పాటించాలని పౌరులకు సూచించింది. విదేశాల్లో అవసరం లేని ప్రయాణాలను నివారించాలని, జనసమ్మర్థ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, స్థానిక వార్తలు, భద్రతా హెచ్చరికలను నిరంతరం గమనించాలని, సమీపంలోని అమెరికా రాయబార కార్యాలయం లేదా కాన్సులేట్ సూచనలను అనుసరించాలని, అత్యవసర పరిస్థితుల్లో కుటుంబ సభ్యులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని సూచించింది.

గత కొద్ది రోజులుగా ఇరాన్‌పై అమెరికా వరుస దాడులు చేస్తోంది. ఇరాన్‌లోని పలు కీలక ప్రాంతాలపై వైమానిక దాడులు చేస్తోంది. అందుకు ప్రతిగా గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ విరుచుకుపడుతోంది. ఈ నేపథ్యంలో పలు దేశాల్లో ఉన్న అమెరికా పౌరులు అప్రమత్తంగా ఉండాలని స్టేట్ డిపార్ట్‌మెంట్ హెచ్చరిక జారీ చేసింది.

# అమెజాన్ డేటా సెంటర్‌పై ఇరాన్ దాడి



ఇరాన్-అమెరికా మధ్య పరస్పర దాడులు కొనసాగుతున్నాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని పలు ప్రాంతాలపై అగ్రరాజ్యం విరుచుకుపడుతుండగా.. గల్ఫ్ దేశాలలోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్‌కు చెందిప ఐఆర్జీసీ దాడులు కొనసాగిస్తోంది. ఇందులో డేటా సెంటర్లు కూడా ఉండడం గమనార్హం. సోమవారం రాత్రి జోర్డాన్‌లోని సైనిక, పౌర మౌలిక సదుపాయాలు.. కువైట్, బ్రహెయిన్లలోని పౌర విమానాశ్రయాలు, విద్యుత్ కేంద్రాలపై ఇరాన్ దాడులు చేసింది. అదే సమయంలో బ్రహెయిన్‌లోని అమెరికా దిగ్గజ కంపెనీ 'అమెజాన్' డేటా సెంటర్ పై డ్రోన్ దాడులు చేసినట్లు ఐఆర్జీసీ వెల్లడించింది. డేటా సెంటర్లోని మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసినట్లు తెలిపింది.

జోర్డాన్‌లోని మువఫ్ఫాక్ సాల్టి వైమానిక స్థావరంపై 24 గంటల వ్యవధిలో మూడు క్షిపణి దాడులు జరిగినట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు. సైనికులు నిద్రిస్తున్న సమయంలో దాడులు జరిగాయని.. ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. వైమానిక స్థావరం తీవ్రంగా ధ్వంసమవడంతో.. భారీ ఆస్తి నష్టం సంభవించింది. తన తీరానికి సమీపంలో మోహరించిన అమెరికా నౌకాదళ ఆస్తులపైనా ఇరాన్ డ్రోన్లు ప్రయోగించింది.

**మౌలిక సదుపాయాలే లక్ష్యంగా..**

ఇరాన్‌లోని రైల్వే స్టేషన్లు, విద్యుత్ కేంద్రాలు, టెలికమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, ఇతర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్నట్లు అమెరికా వెల్లడించింది. ఇరాన్ లోని ప్రధాన నౌకా కేంద్రం, అతి పెద్ద వాణిజ్య ఓడరేవు ఉన్న బందర్ అబ్బాస్ నగరంలోని పలు ప్రాంతాలపైనా అగ్రరాజ్యం క్షిపణులతో విరుచుకుపడింది. దీంతో ఈ ప్రాంతంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బోంజీ ప్రాంతంలోని ఉప్పునీటి శుద్ధి కర్మాగారంపై దాడితో.. దాదాపు 10వేల మందికి నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రస్తుతం ఇరాన్‌లో పనిచేస్తున్న ఏకైక అణు కర్మాగారం 'బుషెహర్'కు కూడా అమెరికా దాడుల వల్ల తీవ్ర నష్టం వాటిల్లినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి.



## రష్యా దౌత్యవేత్తకు భారత్ సమన్లు

రష్యా దౌత్యవేత్త వ్లాదిమిర్ లడనోవ్‌కు భారత విదేశాంగ శాఖ సమన్లు జారీ చేసింది. ఆదివారం ఉక్రెయిన్లోని ఒడెస్సా పోర్టు నుంచి వెళ్తున్న వాణిజ్య నౌకపై రష్యా చేసిన దాడిలో నలుగురు భారత నావికులు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకుంది. ఇలాంటి దాడుల కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని.. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది. వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడం, అమాయక పౌర సిబ్బంది ప్రాణాలకు ప్రమాదం కలిగించడం, వాణిజ్య స్వేచ్ఛకు ఆటంకం కలిగించడం వంటివి ఖండించదగిన చర్యలని విదేశాంగ శాఖ పేర్కొంది. నౌకలే లక్ష్యంగా చేసే దాడులు అంతర్జాతీయ సముద్ర వాణిజ్య భద్రత, స్థిరత్వానికి తీవ్ర ముప్పుగా మారతాయని విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుత పరిస్థితులను ఉక్రెయిన్‌లోని భారత కమిషన్ నిశితంగా పర్యవేక్షిస్తోందని.. బాధితులకు సాయం చేయడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తోందని తెలిపింది. ఉక్రెయిన్లోని ఒడెస్సా ఓడరేవు నుంచి బయల్దేరిన ఎంవీ గోల్డెన్ లియో నౌకపై దాడులు జరిగినట్లు ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రీ సైబిహా ఇటీవల వెల్లడించారు. తమ జలాల్లోని నౌకపై రష్యా చేసిన దాడిలో పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. ప్రమాద సమయంలో సిరియా, భారత దేశానికి చెందినవారు అందులో ఉన్నారన్నారు. ఈ దాడుల్లో నలుగురు భారత నావికులు మృతిచెందగా.. మరొక భారతీయుడి పరిస్థితి విషమంగా ఉందని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ధ్రువీకరించింది.

## బ్రిటన్ మంత్రి వర్గంలో మనవాళ్లిద్దరు!



బ్రిటన్ నూతన ప్రధానమంత్రిగా ఆండీ బర్న్‌హామ్ (56) బాధ్యతలు చేపట్టగా.. భారత మూలాలున్న ఇద్దరికి ఆయన క్యాబినెట్‌లో మంత్రి పదవులు దక్కాయి. ఒకరు కనిష్క నారాయణ్ కాగా.. మరొకరు లీసా నాండీ. వేల్స్ నుంచి ఎంపీగా గెలిచిన కనిష్క యూకే తొలి ఏఐ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు కీర్‌స్టార్మర్ ప్రభుత్వంలో సాంస్కృతిక శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన లీసా నాండీకి మరోసారి అదే పదవి దక్కింది. కీర్ స్టార్మర్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన కనిష్క.. ఆన్‌లైన్ భద్రత, కృత్రిమ మేధ విభాగాన్ని పర్యవేక్షించేవారు. ఇప్పుడు పూర్తిస్థాయిలో ఏఐ మంత్రిగా నియమితులయ్యారు. విధానాల రూపకల్పనలో ఏఐకి మరింత కీలకపాత్ర ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయం నేపథ్యంలో ఈ నియామకం జరిగింది. ఆయన భారత్‌లోని బీహార్ లో జన్మించారు. ఆయన లింక్డిన్ ప్రొఫైల్ ప్రకారం.. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో తత్వశాస్త్రం, రాజకీయాలు, ఆర్థికశాస్త్రంలో విద్యనభ్యసించారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ పట్టా పొందారు. 2024 ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించారు. 2025లో మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

**బెంగాల్‌లో లీసా మూలాలు..**

లీసా నాండీ మాంచెస్టర్ నగరంలో జన్మించారు. ఆమె తండ్రి దీపక్ నాండీది పశ్చిమ బెంగాల్. తల్లి బ్రిటిష్ జాతీయురాలు. 2010 నుంచి విగాన్ నియోజకవర్గానికి ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

## అఫ్గాన్‌లో వరదలు: 20 మంది మృతి

అఫ్గానిస్థాన్లో వరద బీభత్సం సృష్టించింది. తూర్పు ప్రాంతంలోని నూరిస్థాన్ ప్రావిన్స్‌లో ఆకస్మిక వరదలు భారీ ఆస్తి, ప్రాణ నష్టాన్ని మిగిల్చాయి. ఈ వైపరీత్యంలో 20 మంది మరణించగా.. 80 మంది గాయపడ్డారు. 100 మందికి పైగా గల్లంతయ్యారు. సహాయక చర్యలను అధికార యంత్రాంగం ముమ్మరం చేసింది. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. దేశంలోని మొత్తం 34 ప్రావిన్స్‌లో పదింట్లో భారీ వర్షాలు, బలమైన గాలులు, ఉరుములు, ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉందని వాతవరణ శాఖ సూచించింది. అఫ్గానిస్థాన్లో 2024లో సంభవించిన వరదల్లో 300 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా.. ఈ ఏడాది దేశంలోని పలు ప్రాంతాల్లో వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో ఇప్పటివరకు 110 మంది మరణించారు.

# కష్టకాలంలో కోహ్లీ స్ఫూర్తి నింపాడు..

దాదాపు రెండేళ్లుగా ఒక మేజర్ టైటిల్ కోసం ఎదురుచూసిన భారత స్టార్ షట్లర్, తెలుగు తేజం పీవీ సింధు.. ఇటీవలే జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్‌ను గెలుచుకుని ఘనంగా పునరాగమనం చేసింది. ఈ టోర్నీకి ముందు రెండేళ్లపాటు సింధు కెరీర్ పరంగా చాలా ఇబ్బందులు పడింది. ప్రతి టోర్నీలో బరిలో దిగి ఒకటి, రెండు రౌండ్లలోనే ఇంటిముఖం పట్టింది. గాయాలు కూడా ఇబ్బంది పెట్టాయి. ఈ ఫామ్‌తో 028 ఒలింపిక్స్ వరకూ కొనసాగుతుందా అన్న సందేహాలు కలుగుతున్న సమయంలో.. జపాన్ ఓపెన్ గెలిచిన తొలి భారతీయ క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించిన సింధు విజయం వెనుక కఠిన సాధనతో పాటు భారత క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ ఇచ్చిన ఒక సలహా కీలక పాత్ర పోషించింది.







తన కెరీర్ కష్ట కాలంలో ఉన్నప్పుడు.. టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ అండగా ఉన్నట్లు సింధు పేర్కొంది. కోహ్లీ మాటలు తనలో స్ఫూర్తి నింపాయని తెలిపింది. నేను విరాట్ భాయ్‌కి ఎప్పుడూ రుణపడి ఉంటాను. నా కెరీర్ క్లిష్టమైన దశలో ఉన్నప్పుడు నేను కోహ్లీని సంప్రదించాను. వరుస గాయాలు, ఆశించిన ఫలితాలు రాకపోవడంతో సతమతమవుతున్న సమయంలో నన్ను అర్థం చేసుకునే వ్యక్తి ఒకరు నాకు అవసరమయ్యారు. సలహా అడిగిన నిమిషాల వ్యవధిలోనే కోహ్లీ స్పందించారు. మరుసటి రోజే మేము కలుసుకున్నాం. ఆయన ఇచ్చిన సలహాలు నాకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఆయన చెప్పిన మాటలు నాకు, నా భర్త దత్త శాయికీ బాగా గుర్తుండిపోయాయి. పరుగులు చేయడమే నా పని.. అందులోనే ఆనందాన్ని ఆస్వాదిస్తాను.. మనం లక్ష్యాన్ని విడవగూడదు.. పరుగులు, సెంచరీలు వాటంతట అవే వస్తాయని కోహ్లీ చెప్పాడు. అదే ఆలోచనను బ్యాడ్మింటన్‌కు అన్వయించి, ఆటపై మళ్లీ ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నానని సింధు తెలిపింది.

కాగా సింధూ భర్త దత్తశాయి దీనిపై మాట్లాడుతూ కోహ్లీ సూచన సింధూపై బాగా ప్రభావం చూపించినట్లు చెప్పారు. కాలివేలి గాయం కారణంగా వైద్యుల సూచన మేరకు విశ్రాంతి తీసుకున్న సింధును అమెరికాలోని అట్లాంటాలో పునరావాస శిక్షణకు తీసుకెళ్లి శారీరక, మానసికంగా సిద్ధం చేసినట్లు దత్తసాయి వెల్లడించారు. పారిస్ ఒలింపిక్స్ అనంతరం సింధు ఆటతీరుపై స్పోర్ట్స్ సైన్స్ ఆధారంగా విశ్లేషణ జరిపామని తెలిపాడు. దూకుడుగా ఆడటం తగ్గించి, అవసరానికి మించి లైన్ కాల్స్‌పై ఆధారపడటం వంటి లోపాలను గుర్తించి వాటిపై ప్రత్యేకంగా పనిచేశామని దత్త సాయి వివరించారు. కోచ్‌లు, ఫిట్‌నెస్ నిపుణుల సూచనల మేరకు సింధు సుమారు 3.5 కిలోల బరువు తగ్గడంతో పాటు ఆహార నియమాలు కూడా కచ్చితంగా పాటించిందన్నారు. ఈ సమష్టి కృషి ఫలితంగానే జపాన్‌కు చెందిన అకానే యమగుచిని నేరుగా రెండు గేమ్‌ల్లో ఓడించి టైటిల్ సాధించిందని పేర్కొన్నారు. ఈ విజయంతో సింధు ప్రపంచ బ్యాడ్మింటన్‌లో మరోసారి తన సత్తా చాటడంతో పాటు వచ్చే నెలలో న్యూఢిల్లీలో జరగనున్న ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు ఆత్మవిశ్వాసంతో సిద్ధమవుతోంది.

## భారత హాకీ కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్

### - ప్రపంచ కప్‌నకు జట్టు ఎంపిక




ఆగస్టు 15 నుంచి 30 వరకు జరగనున్న పురుషుల హాకీ ప్రపంచ కప్ –2026 టోర్నీకి బెల్జియం, నెదర్లాండ్స్ సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. ఈ టోర్నమెంట్ కోసం మంగళవారం 20 మంది సభ్యులతో భారత్ జట్టును ప్రకటించింది. డిఫెండర్ హర్మన్ ప్రీత్ సింగ్ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. ఇటీవల లండన్ అంచె ప్రో హాకీ లీగ్ లో భారత్ 24 మంది ఆటగాళ్లతో బరిలోకి దిగింది. కానీ, ప్రపంచ కప్ జట్టు పరిమాణంపై ఉన్న పరిమితి కారణంగా ఆ లీగ్ లో పాల్గొన్న నలుగురు ఆటగాళ్లకు జట్టులో చోటు దక్కలేదు. డిఫెండర్ అమన్దీప్ లక్రా, మిడ్‌ఫీల్డర్లు రాజ్ కుమార్ పాల్, రబిచంద్ర సింగ్ మొయిరాంగ్ థెమ్, ఫార్వర్డ్ సెల్వం కార్తీ చోటు కోల్పోయారు.

ప్రపంచ కప్ పూల్ డీ లో ఉన్న భారత్ ఆగస్టు 15న వేల్స్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది. 17న ఇంగ్లాండ్, 19న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌లో తలపడనుంది. చివరగా 2023 లో జరిగిన వరల్డ్ కప్‌లో భారత్ తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఈ టోర్నీలో భారత్ ఒక్కసారి మాత్రమే ఛాంపియన్‌గా నిలిచింది. 1975లో పాకిస్థాన్‌ను ఓడించి విజేతగా అవతరించింది. తర్వాత ఒక్క పతకం కూడా సాధించలేదు. 1971లో కాంస్యం, 1973 లో రజతం సాధించింది.




## ఇక జింబాబ్వేతో టీ 20 సిరీస్

వరుసగా రెండు టీ 20, ఒక వన్‌డే సిరీస్‌లు కోల్పోయిన టీమిండియా వారం రోజులు తిరగక ముందే మరో కీలక పోరుకు సిద్ధమైంది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత జట్టు జింబాబ్వేలో మూడు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. ఇప్పటికే జింబాబ్వే గడ్డపై అడుగుపెట్టిన భారత జట్టు నెట్స్‌లో తీవ్రంగా శ్రమిస్తోంది.

వరుస పరాజయాల తర్వాత టీమిండియా మళ్లీ గెలుపు బాట పట్టడానికి ఈ టీ 20 సిరీస్ అత్యంత కీలకంగా మారింది. అయితే పేపర్ మీద భారత్ అత్యంత బలమైన జట్టుగా కనిపిస్తున్నప్పటికీ టీ 20 ఫార్మాట్లో మాత్రం జింబాబ్వేను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. పసికూనే కాదా అని తేలికగా తీసుకుంటే మన జట్టుకు మరో పరభావం ఎదురవ్వకతప్పదు. జింబాబ్వే ఇటీవలే సొంతగడ్డపై బంగ్లాదేశ్ పై వరుస విజయాలు సాధించి మంచి ఊపులో ఉంది. టీ20 ప్రపంచకప్– 2025లో పటిష్టమైన ఆస్ట్రేలియాను సైతం జింబాబ్వే చిత్తు చేసింది.

## ఫైనల్ అనంతరం ఘర్షణ

### అర్జెంటీనా ఆటగాళ్లపై ఫిఫా దర్యాప్తు

ఫిఫా ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ అనంతరం అర్జెంటీనా, స్పెయిన్ ఆటగాళ్ల మధ్య మైదానంలో ఘర్షణ జరిగింది. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఫిఫా తెలిపింది. ఫిఫా క్రమశిక్షణా నియమావళి నిబంధనలు ఉల్లంఘించిన ఆటగాళ్లపై దర్యాప్తు కోసం క్రమశిక్షణ, ఎథిక్స్ ప్రాసిక్యూటర్‌ను నియమించామని పేర్కొంది. విచారణ పూర్తయిన తర్వాత వివరాలను బహిర్గతం చేస్తామని ఒక ప్రకటనలో తెలిపింది. ఫిఫా ప్రపంచ కప్‌లో వరుసగా రెండోసారి విజేతగా నిలవాలని భావించిన డిఫెండింగ్ అర్జెంటీనాకు స్పెయిన్ షాక్ ఇచ్చింది. ఫైనల్లో 1–0 తేడాతో ఓడించింది. మ్యాచ్ అనంతరం స్పెయిన్ ఆటగాళ్లు సంబరాలు చేసుకుంటుండగా.. అర్జెంటీనా ఆటగాడు లియాండ్రో పరెడెస్ కాస్త దూకుడుగా వ్యవహరించాడు. స్పెయిన్ ప్లేయర్లు ఎరిక్ గార్సియా, గావిలపైకి వెళ్లాడు. అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు వారిని కొట్టేందుకూ యత్నించాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.



## స్పెయిన్ జట్టుకు భారీ జాక్‌పాట్

ఫిఫా ప్రపంచ కప్ – 2026 విజేతగా నిలిచిన స్పెయిన్ జట్టుకు భారీ జాక్‌పాట్ తగిలింది. జట్టులోని ప్రతి ప్లేయర్‌కు 7.56 లక్షల యూరోలు (సుమారు రూ.8.32 కోట్లు) బోనస్‌గా అందనున్నట్లు స్పానిష్ మీడియా వెల్లడించింది. ఫిఫా ఫైనల్‌లో అర్జెంటీనా జట్టుపై 1–0 తేడాతో గెలిచిన స్పెయిన్.. రెండోసారి ట్రోఫీని ముద్దాడిన సంగతి తెలిసిందే.

ప్రపంచ కప్ విజేతగా నిలవడంతో ఫిఫా నుంచి స్పానిష్ ఫుట్‌బాల్ సమాఖ్యకు 50 మిలియన్ డాలర్లు (రూ.481 కోట్లు) ప్రైజ్ మనీ లభించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా ప్రపంచ ఛాంపియన్ హోదాతో స్పాన్సర్‌షిప్ ఆదాయం, టెలివిజన్ ప్రసార హక్కుల విలువ కూడా గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం స్పెయిన్ జాతీయ జట్టుకు ప్రయాణం, బీమా, టెలికమ్యూనికేషన్, క్రీడా సామగ్రి, ఇంధనం, ఆహార, పానీయాల వంటి రంగాలకు చెందిన 35 సంస్థలు స్పాన్సర్లుగా ఉన్నాయి. ప్రపంచకప్ విజయంతో వీటి విలువ మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.



ఇక జట్టు అధికారిక జెర్సీల అమ్మకాలు కూడా భారీగా పెరిగాయి. ముఖ్యంగా స్పెయిన్ జెర్సీలు దేశవ్యాప్తంగా పూర్తిగా విక్రయాలు పూర్తి స్థాయిలో జరుగుతున్నట్లు సమాచారం. విదేశాల్లోనూ వీటి డిమాండ్ పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రైజ్ మనీతో పాటు ప్రతి ఆటగాడికి ప్రపంచ కప్ విజేత పతకం, ప్రత్యేక రింగ్ కూడా అందజేయనున్నారు.

చైతన్య రథం సినిమా

బుధవారం 22 జూలై 2026 X

# షూటింగ్‌లో బాలయ్యకు స్వల్ప గాయం

అగ్ర నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గాయపడ్డారు. ఆయన కథానాయకుడిగా గోపిచంద్ మలినేని దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఎన్‌బీకే 111 (వర్కింగ్ టైటిల్) మూవీ షూటింగ్ ప్రస్తుతం కాకినాడ పోర్టులో జరుగుతోంది. నటుడు మంచు మనోజ్, బాలకృష్ణ మధ్య మంగళ వారం కీలక యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరి స్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే అప్రమత్తమైన చిత్ర బృందం షూటింగ్‌ను నిలిపివేసింది. బాలకృష్ణ మోకాలికి స్వల్ప గాయం కాగా, వైద్యులు ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం స్కానింగ్ కోసం కాకినాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.. పరీక్షల అనంత రం కొంత విశ్రాంతి అవసరమని వైద్యు లు సూచించారు. గాయం గురించి తెలి యగానే కంగారుపడ్డ అభిమానులు, వైద్యు ల చెప్పింది తెలిసి ఊపిరి పీల్చుకున్నారు.




**ఆందోళన అవసరం లేదు: గోపిచంద్ మలినేని**

"కాకినాడలో ఎన్‌బీకే 11 షూటింగ్ జరుగుతున్న సమయంలో ఓ యాక్షన్ సీక్వెన్స్‌లో నందమూరి బాలకృష్ణకి చిన్న మసిల్ టియర్ అయింది.వైద్యుల సూచన మేరకు, ఆయన త్వరగా కోలుకోవడానికి మైనర్ సర్జరీ చేయాల్సి ఉంది. సినిమాపై ఆయనకున్న క్రమశిక్షణ, కష్టపడే తత్వం ఎన్‌బీకే 111 చిత్ర బృందంలోని ప్రతి ఒక్కరికీ ఎంతో స్ఫూర్తినిస్తోంది. అభిమా నులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.ఆయన త్వరగా కోలుకుని మళ్లీ షూటింగ్‌లో పాల్గొనాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం" దర్శకుడు గోపిచంద్ మలినేని.

'వీర సింహారెడ్డి' విజయం తర్వాత బాలకృష్ణ, గోపిచంద్ కాంబినేషన్లో ఈ మూవీ రూపొందుతోంది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. ఇది ముంబయి నేపథ్యంలో సాగే మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉండనుంది. దీంట్లో బాలయ్య గ్యాంగ్‌స్టర్ తరహా పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఆయనకు జోడీగా కాజల్ నటిస్తున్నారు.



# బాబాయ్ త్వరగా కోలుకోవాలి

ఎన్‌బీకూ 111 షూటింగ్లో గాయపడిన సినీ నటుడు నందమూరి బాలకృష్ణ త్వరగా కోలుకోవాలని మంత్రి నటులు ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్ ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా వేర్వేరు పోస్టులు పెట్టారు.

"కాకినాడలో జరుగుతున్న సినిమా షూటింగ్‌లో గాయపడిన బాలా బాబాయ్ త్వరగా కోలుకోవాలని ఎన్టీఆర్ పోస్ట్ పెట్టారు. సంపూర్ణ ఆరోగ్యం, సామర్థ్యంతో తిరిగి గర్జించాలని అభిలషిస్తున్నానన్నారు.

మరోపక్క కళ్యాణ్‌రామ్ బాబాయ్ మీరు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. మీరు అమితంగా ప్రేమించే పనిలో తిరిగి నిమగ్నమయ్యేందుకు తక్కువ సమయంలోనే మళ్లీ యాక్షన్ మోడ్లోకి రావాలని కోరుకుంటున్నానన్నారు. బాబాయ్ బాలకృష్ణపట్ల ఎన్టీఆర్ చూపించిన ఈ ప్రేమాభిమానాలు అటు నందమూరి అభిమానులను, ఇటు సాధారణ ప్రేక్షకులను ఎంతో సంతోషానికి గురిచేస్తున్నాయి.

# మనసాగదే.. అంటున్న యశ్




పాన్ ఇండియా రాకింగ్ స్టార్ యశ్ కథానాయకుడిగా నటిస్తున్న హై వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'టాక్సిక్. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 26న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. చిత్ర ప్రచారంలో భాగంగా 'మనసాగదే.. అంటూ సాగే పాటను చిత్ర బృందం తాజాగా విడుదల చేసింది. తనిష్ బాగ్చీ, అర్సాన్ నిజామి, ఫహీమ్ అబ్దుల్లా స్వరాలు సమకూర్చిన ఈ పాటకు రామ జోగయ్యశాస్త్రి సాహిత్యం అందించారు. సిద్ధార్థ్ బస్రూర్ ఆలపించారు. యశ్‌తో పాటు, నయనతార, కియారా అద్వానీ, హ్యూమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్‌లు ఈ మూవీలో నటిస్తున్నారు ఓ సరికొత్త యాక్షన్ డ్రామాగా గీతూ మోహన్ దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు అర్థమవుతోంది.

# అమితాబ్ ఆరోగ్యంపై మరోసారి ఆందోళన

బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ ఆరోగ్యంపై మరోసారి అభిమానుల్లో ఆందోళన నెలకొంది. సోషల్ మీడియాలో ఆయన పెట్టిన తాజా పోస్ట్ ఆయన అభిమానులను ఆందోళనకు కారణమయింది. 83 ఏళ్ల వయసులో కూడా సినిమాలతో బిజీగా ఉన్న ఆయన ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నట్లు వెల్లడించారు. ఐసీయూలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందాల్సి వచ్చిందని బ్లాగ్‌లో రాసుకొచ్చారు. అయితే ఆ శస్త్రచికిత్స ఎప్పుడు జరిగింది? ఎందుకు అనే వివరాలను వెల్లడించలేదు. ఆసుపత్రిలో గడిపిన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. 'శస్త్రచికిత్స... ఐసీయూలో నిపుణులైన వైద్యులు, వైద్య సిబ్బంది అందించిన సంరక్షణ... ఆ తర్వాత డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకోవడం' అని పోస్ట్ లో పేర్కొన్నారు. ఆయన పోస్ట్ లో మరో అంశం అభిమానులను మరింత భావోద్వేగానికి గురి చేసింది. ఆసుపత్రి నుంచి ఇంటికి చేరుకున్నాకే అసలు సవాళ్లు మొదలవుతాయి. శారీరకంగా, మానసికంగా కోలుకోవడం చాలా కష్టమైన ప్రక్రియ. జీవితంలో ఎంతటి విజేత అయినా ఒక దశలో బలహీనతను ఎదుర్కోవాల్సి వస్తుంది. కొందరు ధైర్యంగా దాన్ని అధిగమిస్తారు.. మరికొందరు లొంగిపోతారు. అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నాను' అని ఆయన రాసుకొచ్చారు. ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'బిగ్‌బీ త్వరగా కోలుకోవాలి, పూర్తి ఆరోగ్యంతో తిరిగి రావాలి' అంటూ పోస్టు పెడుతున్నారు. ప్రస్తుతం ఆయన 'కల్కి 2898 ఎ.డి.' సీక్వెల్‌తో పాటు మరికొన్ని భారీ ప్రాజెక్టుల్లో నటిస్తున్నారు.

# 8 వేల స్క్రీన్లపై 'జన నాయగన్'!

ప్రస్తుతం సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రం 'జన నాయగన్'. తమిళనాడు ముఖ్యమంత్రి, కథానాయకుడు విజయ్ నటించిన ఆఖరి చిత్రం కావడంతో అందరి కళ్లు దీనిపైనే ఉన్నాయి. సంక్రాంతికి విడుదల కావాల్సిన ఈ మూవీ ఆరున్నర నెలల తర్వాత జులై 23న ప్రేక్షకుల ముందుకు వస్తోంది.

రాజకీయ రంగ ప్రవేశానికి ముందు విజయ్ నటించిన చివరి చిత్రం ఇదే కావడం గమనార్హం. కానీ, దర్శకుడు హెచ్. వినోద్ మాత్రం ఇది సీఎం విజయ్ ఫస్ట్ మూవీ అంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ మూవీని 30 దేశాల్లో 8 వేల స్క్రీన్లపై ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికే అన్నిచోట్ల బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ ఉదయం 8 గంటల నుంచే ప్రదర్శనలకు ఏర్పాట్లు జరుగుతుండటం గమనార్హం. ఆడ్వాన్స్ బుకింగ్స్ లోనూ 'జన నాయగన్' దూకుడు కొనసాగుతోంది. ఇప్పటికే ఈ రూపంలో రూ.15.22 కోట్లు ఈ మూవీ ఖాతాలో పడినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి.

తమిళనాడులో ఈ మూవీ టికెట్స్ హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. మరోవైపు బెంగళూరులోనూ విజయ్ క్రేజ్ కొనసాగుతోంది. ఓ థియేటర్లో ఏకంగా ఈ మూవీ టికెట్ ధరను రూ.2500గా నిర్ణయించడం గమనార్హం.

చెన్నైలోని మయజాల్ మల్టీప్లెక్స్ లో ప్రదర్శిస్తున్న 4= షోల టికెట్స్ అన్నీ అమ్ముడయ్యాయి. తెలుగులో ఈ మూవీని 'జన నాయకుడు', హిందీలో 'జన నేత పేరుతో విడుదల చేస్తున్నారు..

బాలకృష్ణ–అనిల్ రావిపూడి కాంబోలో వచ్చిన తెలుగు మూవీ 'భగవంత్ కేసరి. దీని మూల కథను తీసుకుని.. విజయ్ స్టార్‌డమ్‌కు అనుగుణంగా హెచ్.వినోద్ మార్పులు చేశారు. ముఖ్యంగా సెకండాఫ్ లో కీలక మార్పులు చేశారు..

'జననాయగన్' క్లైమాక్స్‌లో కొన్ని సన్నివేశాలను విజయ్ స్వయంగా డైరెక్ట్ చేశారు. గత దశాబ్దకాలంగా టైటిల్ కార్డ్స్‌లో దళపతి విజయ్. అని వేస్తున్నారు. ఈ సినిమాకు 'గౌరవ తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్' అని వేయనున్నారు.




# సింహాద్రిలో ఆ సీన్ చేయటం సాహసమే..

ఎన్టీఆర్, రాజమౌళి కాంబినేషన్‌లో 2003లో వచ్చిన చిత్రం 'సింహాద్రి'..కెరీర్ పరంగా వారిద్దరికీ ఎంతో ప్లస్ అయింది. యాక్షన్, ఎమోషన్స్, పాటలు అన్నీ ప్రేక్ష కులను మెప్పించాయి. ఈ సినిమాలో ఓ సాహసోపేత నిర్ణయం గురించి రాజమౌళి ఇటీవల ఒక సందర్భంలో వివరించారు. సింహాద్రిలో వేలమంది అమాయకుల ప్రాణాలను కాపాడటానికి కథానాయకుడి పాత్ర ఒక మంచివ్యక్తిని చంపాల్సి వస్తుం ది.అది సినిమాలోనే కీలకమైన సన్నివేశం. ఈ ఆలోచనను రాజమౌళి..తన కుటుంబ సభ్యులకు, చిత్రబృందానికి వివరించిన పుడు.. ఒక హీరో ఇలా చేస్తే దాన్ని ప్రేక్ష కులు అసలు అంగీకరించరని అన్నారట. అయితే, రాజమౌళి మాత్రం ఆ ఎమోష నల్ సీన్ ఈ కథకు ప్రాణమని నమ్మారు. ప్రేక్షకులు కచ్చితంగా దీనికి కనెక్ట్ అవు తారని నమ్మకంతో తెరకెక్కించారు. అదే భానుచందర్‌ను ఎన్టీఆర్ షూట్ చేసే సన్ని వేశం.రాజమౌళి నమ్మకమే నిజమై,'సింహా ద్రి' ఆసంవత్సరంలోనే అతిపెద్ద బ్లాక్‌బస్టర్ గా నిలిచింది. అప్పట్లో చర్చనీయాంశంగా మారిన ఆ సన్నివేశం ప్రేక్షకులను విశేషం గా ఆకట్టుకోవడమే కాకుండా, విమర్శ కుల ప్రశంసలు కూడా అందుకుంది.

**ఇదీ చదవండి: బాల సుబ్రహ్మణ్యం అల్లరి.. ఎస్. జానకికి అక్షింతలు..**



ఇక రామౌళి ఎన్టీఆర్ కాంబినేషన్లో వచ్చిన సినిమాలు సూపర్ హిట్గా నిలిచిన సంగతి తెలిసిందే. రాజమౌళి దర్శకుడిగా పరిచయం అయిన మొదటి సినిమా స్టూ డెంట్ నం.1.. ఎన్టీఆర్ కెరీర్‌లో మొదటి భారీ హిట్.ఈకాంబినేషన్లో వచ్చిన రెండో సినిమా'సింహాద్రి'.. ఇండస్ట్రీ రికార్డులను తిరగరాసి ఎన్టీఆర్ స్థాయిని మాస్ హీరో గా అమాంతం పెంచింది. ఆ తర్వాత వచ్చిన యమదొంగ కూడా కమర్షియల్ హిట్. ఇక వీరి కాంబోలో వచ్చిన 'ఆర్ఆర్ఆర్'.. భారతీయ సినీ పరిశ్రమం గగర్వించదగ్గ పాన్–ఇండియా చిత్రంగా నిలిచిపోయింది.